SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume: 54, Issue: 11
APRIL - 2024 Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

ఏప్రిల్ 2024 - వెల రూ. 20/-
పుటలు-56



తిరుమల శ్రీవారి ఉగాది ఆస్థాన మహోత్సవం
(09-04-2024)



ఒంటిమిట్ట

## శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు
## 2024 ఏప్రిల్ 17 నుండి 25 వరకు

**17-04-2024 బుధవారం**
పగలు: ధ్వజారోహణం...రాత్రి: శేషవాహనం

**18-04-2024 గురువారం**
పగలు: వేణుగానాలంకారం...రాత్రి: హంసవాహనం

**19-04-2024 శుక్రవారం**
పగలు: వటపత్రశాయి అలంకారం...రాత్రి: సింహవాహనం

**20-04-2024 శనివారం**
పగలు: నవనీత కృష్ణాలంకారం రాత్రి: హనుమత్సేవ

**21-04-2024 ఆదివారం**
పగలు: మోహినీసేవ...రాత్రి: గరుడసేవ

**22-04-2024 సోమవారం**
పగలు: శివధనుర్బాణాలంకారం
రాత్రి: ఎదుర్కోలు, కల్యాణోత్సవం, గజవాహనం

**23-04-2024 మంగళవారం**
పగలు: రథోత్సవం

**24-04-2024 బుధవారం**
పగలు: కాళీయమర్దనాలంకారం...రాత్రి: అశ్వవాహనం

**25-04-2024 గురువారం**
పగలు: చక్రతీర్థం...రాత్రి: ధ్వజావరోహణం



తిరుపతి

## శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం
## 2024 ఏప్రిల్ 05 నుండి 13 వరకు

**05-04-2024 శుక్రవారం**
పగలు: ధ్వజారోహణం...రాత్రి: పెద్దశేషవాహనం

**06-04-2024 శనివారం**
పగలు: చిన్నశేషవాహనం...రాత్రి: హంసవాహనం

**07-04-2024 ఆదివారం**
పగలు: సింహవాహనం...రాత్రి: ముత్యపుపందిరివాహనం

**08-04-2024 సోమవారం**
పగలు: కల్పవృక్షవాహనం...రాత్రి: సర్వభూపాలవాహనం

**09-04-2024 మంగళవారం**
పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం...రాత్రి: గరుడవాహనం

**10-04-2024 బుధవారం**
పగలు: హనుమద్వాహనం...రాత్రి: గజవాహనం

**11-04-2024 గురువారం**
పగలు: సూర్యప్రభవాహనం...రాత్రి: చంద్రప్రభవాహనం

**12-04-2024 శుక్రవారం**
పగలు: రథోత్సవం...రాత్రి: అశ్వవాహనం

**13-04-2024 శనివారం**
పగలు: చక్రస్నానం...రాత్రి: ధ్వజావరోహణం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ।
సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే॥

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-15వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** పురుషర్షభ= పురుషశ్రేష్ఠుడవగు ఓ అర్జునా!; ఏతే= శబ్దస్పర్శాదివిషయములు; సమదుఃఖసుఖమ్= సుఖదుఃఖములను సమముగ జూచునట్టి; ధీరమ్= ధైర్యశాలియగు; యం పురుషమ్= ఏ మనుజుని; న వ్యథయన్తి= బాధింపవో(చలింపచేయవో); సః హి= అతడుగదా; అమృతత్వాయ= మోక్షము కొఱకు; కల్పతే= తగియున్నాడు.

**భావం:** పురుషశ్రేష్ఠుడవగు ఓ అర్జునా! ఎవనిని ఈ శబ్దస్పర్శాదులు బాధింపవో(చలింపచేయవో), సుఖదుఃఖములందు సమభావము గల అట్టి ధీరుడే మోక్షమున కర్హుడగును.

---

## తిరువేంకటేశుడే... పరదైవమూ...!!

ఎంత విభవము గలిగె- నంతయును నాపదని
చింతించినది గదా- చెడని జీవనము.

చలముఁ గోపంబుఁ దనుఁ- జంపేటి పగతులని
తెలిసినది యదిగదా- తెలివి,
తలకొన్న పరనింద- తనపాలి మృత్యువని
తొలఁగినది యదిగదా- తుదగన్న ఫలము.

మెఱయు విషయములె తన- మెడనున్న యురులుగా
ఎఱిఁగినది యదిగదా- యెఱుక,
పఱివోని యాస దనుఁ- బట్టుకొను భూతమని
వెఱచినది యదిగదా- విజ్ఞానమహిమ.

ఎనలేని తిరువేంక- టేశుఁడే దైవమని
వినగలిగినదిగదా- వినికి,
అనయంబు నతని సే- వానందపరులయి
మనఁ గలిగినది గదా - మనుజులకు మనికి.

(ఆధ్యాత్మిక సంకీర్తన సంపుటం 1- సంకీర్తన 181)



*ఎంతటి ఐశ్వర్యము కలిగినా అది అంతా ఆపదయేగాని సంపదగాదని భావించి గర్వగ్రస్తుడుగాని వానిబ్రతుకే చెడనిబ్రతుకు.*

*మచ్చరము, కోపములను తన దుర్గుణాలే తనను చంపే శత్రువులని తెలిసి వాటిని దరికి రానీయకుండుటే నిజమైన తెలివి. పరదూషణము తనపాలి మృత్యువని తలచి దానిని వర్జించుటే శ్రేష్ఠాతిశ్రేష్ఠమైన ఫలము.*

*శబ్ద స్పర్శ రూపాదులైన విషయాలే తన మెడకు తగులుకొన్న ఉరులుగా గ్రహించి వాటికి దూరమగుటే నిజమైన విజ్ఞత. బలవత్తరమైన ఆశయే తనను పట్టుకొన్న దెయ్యమని ఎంచి దానికి వెఱచి తొలగుటయే విశిష్టమైన తెలివి.*



*సాటిలేని శ్రీవేంకటేశ్వరుడే దైవమని పెద్దలవలన విన్నదియే నిజమైన వినికి. ఎల్లప్పుడు ఆ దేవుని సేవిస్తూ ఆనందంతో బ్రతుకువారిదే నిజమైన బ్రతుకు అంటూ మానవ జీవనవిధానంలోని అక్షరసత్యాలను కళ్లకు కట్టినట్లుగా వర్ణించాడు అన్నమయ్య.*

*- కీ.శే. డా॥ సముద్రాల లక్ష్మణయ్య*

వ్యక్తిత్వ వికాసం

# తారక మంత్రం

- శ్రీ గుత్తి నరసింహులు,
95053 06514

త్రేతాయుగంలో దశరథుడు తన కుమారులకు ముఖ్యంగా జ్యేష్ఠపుత్రునకు నామకరణం చేస్తున్నపుడు అందచందాలను బట్టి, మనోహరత్వంచేతను, జగత్తుకు మొదట మంగళాకారు డగుటచేతను "రామ" అని నామకరణం చేశాడట. గురువులు, రాజగురువులు, పురోహితులు, పంచాంగకర్తలు పేరు సూచించి నంతవరకే బాధ్యులు. పేరు పెట్టేది తండ్రిమాత్రమే. ఇది లోకంతీరుకూడా! పరమాత్మ అవతరణం సంపూర్ణమానవత్వంగా భూమిమీద జరిగింది కనుక రామశబ్దానికి ముందు శ్రీకారం ఉంచడం శుభకరం అంటుంటారు ఆధ్యాత్మికవేత్తలు. ఆ భావన తోనే "శ్రీరామ" శబ్దం లోకంలో రూఢ్యర్థంగా స్థిరపడింది. శ్రీ అనగా స్త్రీబీజం, శక్తిబీజం, సర్వసంపత్కరం, శుభకరం, మంగళకరం, కల్యాణకరం, భద్రం, సాలెపురుగు, చెవి అని నైఘంటి కార్థాలు.

పరమాత్మయే సమస్త శరీరాలలో జీవాత్మగా శోభిస్తున్నాడు. కనుక పరమాత్మస్వరూపమైన జీవాత్మకు శివుడూ, రాముడని పేర్లు. శరీర మందు చైతన్యస్వరూపంగా ఉంటున్న జీవునకు శివుడని, శివంపోయిన శరీరం శవమని పిలువబడుతుండడం లోకంలో ఉంది.

ఆత్మ సనాతనమైనది కనుక రాముడు సనాతనుడు. అందువల్లనే బ్రహ్మవిష్ణుమహేశ్వరులు రాముని అంశయే. ఆత్మకు 'రామం' అనడం సత్యసనాతనం. ఇక్కడ శివం-రామం ఒకటే. ఇరువురి అభేదం అభివ్యక్తం అవుతుంది.

"రమయతి ఇతి రామః" అని రామశబ్దనిర్వచనం. అనగా ఆనందింపచేయువాడు రాముడు. రాముడు ఆకార మాత్రంచేత మోహనమూర్తి, సర్వజనరంజకుడు కావున భౌతికా నందం ఇస్తాడు. అంతర్గతంగా, ఆధ్యాత్మికంగా ఆత్మస్వరూపుడు కనుక ఆత్మానందాన్ని కలిగిస్తుంటాడు. రాముడు తన దర్శన, స్పర్శన, సంభాషణాదులచేత చంద్రునిలా చల్లదనాన్ని ప్రసాదిస్తూ రామచంద్రుడయినాడు. అనగా సమస్త హృదయాలలో ఉంటూ ఆనందించేవాడు రాముడు. అనగా రాముడు ఆత్మస్వరూపుడని భావం. రామమంత్రం అర్థాన్ని తెలుసుకున్నవాడు జీవన్ముక్తు డౌతాడు. మంత్రమంటే మాటిమాటికి స్మరించదగినది రక్షించునది. దేనినైనా చదివినపుడు, మనస్ఫూర్తిగా మననం చేయునపుడు ఒక్క విశ్వాసంతోనేకాక అర్థంకూడా చక్కగా ఎరిగినచో ఆ మంత్రం శీఘ్రంగా సంపూర్ణఫలితాన్ని ఇస్తుంది. ఏకాగ్రత సిద్ధిస్తుంది. రామనామమే దివ్యమంత్రం. ఆ నామార్థాన్ని తెలుసుకొని మననం చేయడంవల్ల, జపించడంవల్ల, స్మరించడంవల్ల మానవులు తత్ఫలితంగా అతిశీఘ్రంగా తరించడం జరుగుతుంది. రామనామానికి తారక మంత్రమని ప్రసిద్ధి. తారక మంత్రమనగా వెంటనే స్ఫురించేది శ్రీరామ మంత్రమే. బుద్ధితో విచారణ చేసి, శాస్త్ర జ్ఞానంతో సత్యం గ్రహించి, స్వానుభవం పొంది తరించినవారికి "జగమే రామమయం".

రామనామస్మరణవల్ల జీవనవిధానంలో ఒడుదొడుకులు చక్కబడి, మనస్సు క్షాళితమై, సత్త్వగుణశోభితమై, మనస్సు నిర్మలమై ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంకూడా ఆరోగ్యంగా ఉంటుంది. జీవనం జీవనగమ్యం చేరుతుంది. ఇది చంద్ర బీజాక్షరప్రభావఫలితం. మకారం అగ్నిబీజం. అగ్నియొక్క స్వభావం దహనం. అగ్నికి సర్వభక్షకుడను విశేషనామముంది. భౌతిక, స్వార్థపూరిత, స్వభావసిద్ధ, ప్రభావప్రచోదిత, అహంకార సహితమైన సమస్తదురాలోచనలను దహించి, దురాగతాలను దూరంచేసి రజఃతమోగుణాలను కనుమరుగు చేస్తుంది. సాత్త్వికుని చేస్తుంది. సత్యాన్వేషకుని చేస్తుంది. జీవితగమ్యం రమ్యం చేస్తుంది. ఇట్టి దివ్యత్వమే రామనామంలో నిక్షిప్తమై ఉంది. అదే తారకమంత్రం.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 54 ఏప్రిల్, 2024 సంచిక : 11



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| తారకమంత్రం | శ్రీ గుత్తి నరసింహులు | 04 |
| హనుమంతునిమాటల్లో శ్రీరాముడు | డా॥ అద్దంకి శ్రీనివాస్ | 07 |
| కల్యాణం | శ్రీమతి చెవుటూరి కుసుమకుమారి | 09 |
| సందేహాలు-సమాధానాలు | శ్రీమతి యం.గీతాకుమారి | 10 |
| శ్రీవేంకటాచలమాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| ఉగాదిఆస్థానం | శ్రీ యం.వి.యస్. రామశేషు | 13 |
| ఒంటిమిట్ట శ్రీకోదండరామాలయం | డా॥ మైలవరపు లలితకుమారి | 15 |
| ప్రణోదేవి | శ్రీ చాకిచర్ల నాగసుదర్శనరావు | 17 |
| వసంతశోభ | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 19 |
| పట్టాభిషేకం | డా॥ ఎన్.సిహెచ్.సుధామైథిలి | 21 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 23 |
| ఆనందం | శ్రీ నీలంరాజు రాధాకృష్ణమూర్తి | 24 |
| 108 దివ్యదేశాలు-తిరుక్కావళంబాడి (తిరునాంగూర్) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| తాళ్లపాక అన్నమయ్యకు- శ్రీనివాస సాక్షాత్కారం | డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ | 31 |
| పుష్పయాగం | డా॥ యస్.పద్మావతి | 34 |
| అరటిపండుప్రసాదం | శ్రీమతి వారణాశి అనసూయ | 37 |
| ధ్యానం | శ్రీ జె. నరసింహారావు | 38 |
| మత్స్యం | శ్రీమతి ఎన్.సిహెచ్.శ్రీలక్ష్మి | 39 |
| ఆదర్శం | శ్రీ యం.సి.శివశంకరశాస్త్రి | 41 |
| అరివేణికుండలు | శ్రీమతి వావిలాల నాగవల్లి | 42 |
| అన్నదానం దానాల్లో ఉత్తమం | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 43 |
| ఉగాదిపచ్చడి | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 44 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 45 |
| పరమధర్మం | శ్రీ అనంతాత్మకుల రంగారావు | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ | 47 |
| అందరికీ మోక్షం! (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| బాలవినోదం | | 50 |
| విరాధుడు | శ్రీమతి ఇ.పద్మాసని | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |

ముఖచిత్రం : తిరుమల శ్రీవారి ఉగాది ఆస్థాన మహోత్సవం
వెనుకచిత్రం : తిరుమల శ్రీవారి శ్రీరామనవమి ఆస్థాన మహోత్సవం



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# "రామో విగ్రహవాన్ ధర్మః"

"మర్యాద పురుషోత్తముడు" అని అభిమానంగా పిలుచుకునే మరియు గౌరవింపబడే శ్రీరామ చంద్రుడు శ్రీమహావిష్ణువుయొక్క అవతారం. శ్రీమహావిష్ణువుయొక్క అన్ని అవతారాలలో రామావతారం "సంపూర్ణ అవతారం"గా పరిగణించబడుతుంది. శ్రీహరి కాలధర్మానికి అనుగుణంగా "ఆదర్శపురుషుడు"గా జీవితాన్ని ఎలా నడిపించాలో శ్రీరాముని అవతారంతో ప్రపంచానికి చూపించాడు.

వాల్మీకిమహర్షి నారదమహామునిని ధర్మం, కార్యనిష్ఠ, సత్యప్రవర్తనకి ప్రతిబింబంగా పేర్కొనదగిన వ్యక్తి ఎవరు అని అడగగా, నారదుడు "నిజాయితీ, శౌర్యం, ధార్మికత, సత్యం పలకడం, నిబద్ధత, నమ్మకం, లోపం లేని గుణం, సానుభూతి, జ్ఞానం, నైపుణ్యం, సున్నితమైన మనస్తత్వం, బాధ్యతాయుత నడవడి, ఇంద్రియనిగ్రహం, సమత్వం, నిబద్ధత మరియు నిర్భయత్వం"వంటి 16 గుణాలు కలిగిన శ్రీరామచంద్రుడు మాత్రమే అటువంటి లక్షణాలను కలవాడు అని సమాధానమిచ్చాడు. శ్రీరామునిలో పై అన్ని గుణాలను మనం గుర్తించవచ్చు.

***"రామో విగ్రహవాన్ ధర్మః"*** అంటే "రాముడు ధర్మస్వరూపుడు" అని అర్థం. రాముడి జీవితం మొత్తం ధర్మాన్ని అనుసరించే ఒక మార్గదర్శి. మనం రోజువారీజీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి ఆయన జీవితాన్ని ఒక ఆదర్శంగా తీసుకోవచ్చు. శ్రీరాముడు తండ్రి మాట జవదాటని కుమారుడు, విధేయుడైన విద్యార్థి, శక్తివంతమైన యోధుడు, మంచి స్నేహితుడు మరియు నీతిమంతుడైన రాజు. తన జీవితంలోని ప్రతి దశలో ఒక ఉదాహరణగా నిలిచాడు. ఈ విశిష్టతే అతనిని శత్రువులను కూడా మెచ్చుకునేలా చేసింది. మారీచుడు పలికిన ***"రామో విగ్రహవాన్ ధర్మః"*** అన్న మాట శ్రీరాముడు ఎంత నీతిమంతుడో తెలియజేస్తుంది. "శ్రీరామనామం" రామునియొక్క అత్యున్నతగుణాలకారణంగా "తారకనామం"గా పరిగణించబడుతుంది.

శ్రీరాముడు మహావిష్ణువు అవతారమైనా, లోకంలో బాధలను అనుభవించి మనిషిలా జీవించాడు. ధర్మమార్గంలో పయనిస్తే మనిషి భగవంతుడు అవుతాడని నిరూపించాడు. ***"ధర్మో రక్షతి రక్షితః"*** శ్రీరాముని మార్గమే ఆయనను అన్ని యుగాలకు ఆదర్శవంతమైన వ్యక్తిగా చేసింది.

అన్నమాచార్య, భక్తరామదాసు, త్యాగరాజు, పురందరదాసు, ముత్తుస్వామిదీక్షితార్‌వంటి అనేకమంది కవులు శ్రీరామునిపై తమ భక్తిని పాటలు మరియు కీర్తనలద్వారా వ్యక్తపరిచారు. వారు రామాయణం యొక్క సారాంశాన్ని తీసుకొని అతని జీవితంలోని అనేక దశలను, అతని వ్యక్తిత్వంలోని అనేక లక్షణాలను కొనియాడారు. నవవిధభక్తి వారి రచనల్లో వ్యక్తమైంది. కొన్ని కీర్తనలు పురుషోత్తముడు అని కీర్తించాయి. మరికొన్ని రాముడి అందాన్ని వర్ణించాయి. ఇంకొన్ని అతని ధైర్యాన్ని కొనియాడాయి. చాలా పాటలు సౌశీల్య, వాత్సల్య, వీర్య మరియు కారుణ్యంవంటి అతని లక్షణాలను తెలియచేశాయి.

అన్నమయ్య కీర్తన, "రామచంద్రుడుడీతడు" అతని శౌర్యం, కరుణవంటి లక్షణాలను ప్రశంసిస్తుంది. భక్తరామదాసు తన "పలుకే బంగారమాయెన"లో శ్రీరాముడు తన జీవితంలోని ప్రతిదశలో దయను కురిపించిన వ్యక్తిగా కీర్తించాడు మరియు అతనిని ఏకైక రక్షకుడిగా అభివర్ణించాడు. ఇలా శ్రీరాముని గుణాలను తమ పాటల్లో సమర్థవంతంగా చిత్రించిన కవులు ఎందరో ఉన్నారు. పురందరదాసర్ రచించిన "రామ రామ రామ సీతా" అనే పాట "రామ" అనే నామం అన్ని సమస్యలకు పరిష్కారం అని, "రామనామం" బాధలనుండి రక్షిస్తుందని వర్ణించింది.

మన జీవితాలను అర్థవంతంగా చేసుకోవడానికి రామాయణంలోని ప్రతిభాగాన్ని విందాం, చదువుదాం మరియు సారాంశాన్ని గ్రహిద్దాం.

***జై శ్రీ రామ్!***

# హనుమంతుని మాటల్లో శ్రీరాముడు

- డా॥ అద్దంకి శ్రీనివాస్



వాల్మీకి రామాయణ సుందరకాండలో రామునిగురించి రావణునిముందు హనుమంతుడు చెప్పిన మాటల్లోని ఆంతర్యాన్ని తెలియజేయడం ఈ వ్యాసలక్ష్యం. హనుమంతునిమాటల్లో పైకి కనిపించేది ఒకటైతే, అంతర్గతంగా తాను చెప్పదలుచుకున్న మాటల్ని చాలాఘాటుగా చెప్పాడు. రావణునిహోదాను, మనసును విశ్లేషించి అమోఘంగా పలికిన ఈ పలుకులద్వారా హనుమంతునిలోని అర్థవంతమూ, అవ్యగ్రమూ అయిన వాక్పరంపర ద్యోతకమవుతుంది.

రామాయణ పాత్రలస్వభావం, శక్తియుక్తులు ఆయా సన్నివేశాలద్వారా వాల్మీకి ప్రకటించాడు. వారి సంభాషణలే వారి వారి మనోవిశ్లేషణకు వేదికలు. ఇలాంటి విశ్లేషణకు పాత్రమయిన ఘట్టం సుందరకాండలో ఒకటి ఉంది. అది రావణ - ఆంజనేయుల సంభాషణ.

**తం సమీక్ష్య మహాసత్త్వం సత్త్వవాన్ హరిసత్తమః,**
**వాక్యమర్థవదవ్యగ్రః తమువాచ దశాననమ్.**

అని వాల్మీకి ముందుగా హనుమంతుని వాగ్లక్షణాల్ని సూచన చేశాడు. ఈ లక్షణాల్ని తరువాత చాలా సమర్థవంతంగా నిర్వహించాడు. ఇక్కడ హనుమంతునికి విశేషణంగా 'సత్త్వవాన్' అన్న పదం వేయడంలో వాల్మీకిలోని సాధికారికమైన సార్థకత కన్పిస్తోంది. 'సత్త్వవాన్' అంటే బలవంతుడు. ఎంతటి బలవంతుడంటే మహాబలవంతుడైన రావణుని సైతం భేదించగలిగే బలంకల ధైర్యశాలి హనుమంతుడని నొక్కి చెప్పాడు.

హనుమంతుడు బలవంతుడే. ఆయనకుకోపం వస్తే రావణుడే కాదు ఎవరైనప్పటికీ దాసోహం అనవలసినదే. కానీ హనుమంతుడు స్వామికార్యాన్ని సఫలం చేయాలనుకొనే వ్యక్తి. అందుకే కార్యసాధనకోసం తనమాటల్ని బాటలుగా చేసుకున్నాడు. రావణునికి- సుగ్రీవునికి మధ్య భ్రాతృత్వాన్ని తానే కల్పించాడు. రావణుడు తప్పు తెలుసుకొని దిద్దుకొనేలా చేయడం ఇతని లక్ష్యం. ఎదుటివ్యక్తి సామాన్యుడైతే ఈ పని చాలా తేలిక. కానీ తనముందున్న వ్యక్తి అసామాన్యుడు. మహాబలవంతుడు. ఎంతటి బలవంతుడైనా తన శక్తిసామర్థ్యాలకన్నా వైరివర్గం శక్తిసామర్థ్యాలు ఎక్కువన్న విషయం తెలిస్తే ఎంతో కొంత భయపడకపోడు. ఇది ఎంతటివారికైనా ఏర్పడే మానసిక స్థితి. సరిగ్గా హనుమంతుడు ఈ ఎత్తునే వేశాడు.

**జ్యేష్ఠస్తస్య మహాబాహుః పుత్రః ప్రియకరః ప్రభుః,**
**పితుర్నిర్దేశాత్ నిష్క్రాంతః ప్రవిష్టో దండకావనమ్.**

అని తండ్రిమాటకోసం రాముడు దండకారణ్యానికి వచ్చాడే కానీ అంత మాత్రంచేత బలహీనుడని కాదు. రాముని వెనుకఉన్న, జన్మనిచ్చిన తండ్రి దశరథుడు కూడా సామాన్యుడు కాదు.

**ఏప్రిల్ 17 శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేకరచన**



**రామచంద్రుడితడు**
**రఘువీరుడు**
**కామిత**
**ఫలములీయ**
**గలిగెనిందరికి...**




రామనామాన్ని మూడుసార్లు స్మరిస్తే చాలు, వెయ్యి నామాలతో వేయివెలుగులవేల్పును ధ్యానించినట్లవుతుందని ఆర్యోక్తి. రామశబ్దంయొక్క మాహాత్మ్యం అటువంటిది. రామచరిత్ర ఒక్క అయోధ్యను ఉద్ధరిస్తే రామనామం యావత్ప్రపంచాన్ని తరింపజేసిందని తులసీదాసు రామనామప్రాచుర్యాన్ని విశదీకరించాడు. శ్రీరామచంద్రమూర్తికి సాటి దైవములేదని రామదాసు కొనియాడాడు.

రాజా దశరథో నామ రథ కుంజర వాజిమాన్,
పితేవ బంధుర్లోకస్య సురేశ్వర సమద్యుతిః.

అంటూ దశరథుని ఘనతను చెప్పాడు. అక్కణ్ణుంచి శ్రీరాముని భార్యావియోగం, ఋష్యమూకంపై సుగ్రీవునితో మైత్రి, వాలిసంహారం, సుగ్రీవుడు సీతాన్వేషణకు సహకరిస్తానని ప్రతిజ్ఞ చేయడంవంటి విషయాల్ని సంక్షిప్తంగా హనుమంతుడు రావణుని ముందు ప్రస్తావించాడు. దీని ఆంతర్యం రామునిశక్తిని చూపి రావణునిమదిలో భీతిని రగుల్కొల్పడానికే.

రాముడు పరాక్రమవంతుడు. అతనితండ్రి చతుర్విధ బలసంపన్నుడేకాక, ఇంద్రునితో సమానమైన విభవం కలవాడు. రామునిభార్య మహాసాధ్వి. ఆమె తండ్రి జనకుడు మహాత్ముడు. రాముని మిత్రుడు సుగ్రీవుడు. వానరసేన యుద్ధానికైనా సిద్ధంగా అండగా ఉంది. ఈ విషయాలను హనుమంతుడు, రావణునికి చెప్పడంవల్ల, ఇటువంటివారితో శత్రుత్వం కూడదని, అది సర్వ అనర్థాలకూ దారి తీస్తుందని బోధించడమే ఆయన లక్ష్యం.

రావణుడు ధర్మతత్త్వజ్ఞుడు. నీతిశాస్త్రకోవిదుడు. స్త్రీలోలతవల్ల ధర్మం తప్పవద్దని హనుమంతుడు సూచన చేస్తూ ధర్మాన్ని ఉపదేశించాడు.

“నహి ధర్మ విరుద్ధేషు బహ్వపాయేషు కర్మసు, మూల ఘాతిషు సజ్జంతే బుద్ధిమంతో భవద్విధాః” అంటూ నీ వంటి ధీయుతులు ధర్మం విడనాడడం కూడదన్నాడు.

రాముని చుట్టూఉన్న అతిరథమహారథులవివరాల్ని చెప్పి రావణుని భయపెట్టడంతోనే ఆగిపోలేదు హనుమంతుడు. వీరి వైరానికి హేతువు సీతపై రావణునికి ఉన్న మోహం. దీనికి కారణం సీతను సామాన్యస్త్రీగా భావించడమే. సీత అనన్య సామాన్యురాలనే సత్యాన్ని విస్మరించాడు. ఇది మోహార్తుల లక్షణమే గానీ విజ్ఞుడైన రావణుడు తెలుసుకొనవలసినదిగా –

న సుఖం ప్రాప్నుయాదన్యః కింపునస్త్వద్విధో జనః,
యాం సీతేత్యభిజానాసి యేయం తిష్ఠతి తే వశే,
కాల రాత్రీతి తాం విద్ధి సర్వలంకా వినాశినీమ్,
తదలం కాలపాశేన సీతా విగ్రహరూపిణా–అని విజ్ఞప్తి చేశాడు.

సీత లంకా విధ్వంసిని. యమపాశంగా ఉత్ప్రేక్షించాడు. సీతను నిర్బంధించిన దోషాన్ని దిద్దుకోవలసినదిగా హితవు పలికాడు. మొదట రామునిశక్తిని, పిదప సీతమాహాత్మ్యాన్ని ప్రకటించడంద్వారా శ్రీరాముని అజేయత్వాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటించాడు.

దేవాశ్చ దైత్యాశ్చ నిశాచరేంద్ర గంధర్వ విద్యాధర నాగయక్షాః,
రామస్య లోక త్రయ నాయకస్య స్థాతుం న శక్తాః సమరేషు సర్వే.

దేవదానవగంధర్వాదులు సైతం రామునిముందు నిలువలేరు. శ్రీరామునికి ఇష్టంలేనికార్యాన్ని తలపెట్టి ఎంతటివారైనా సుఖంగా ఉండలేరని “పునరేవ తథా స్రష్టుం శక్తో రామో మహాయశా” అని రాముని అవతారపురుషుడని చెప్పాడు.

బ్రహ్మా స్వయంభూశ్చతురాననో వా
రుద్రః త్రినేత్రః త్రిపురాంతకో వా
ఇంద్రో మహేంద్రః సురనాయకోవా
త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్.

అంటూ బ్రహ్మరుద్రాదులకు సైతం రాముణ్ణి ఎదిరించడం సాధ్యం కాదని ప్రకటించాడు.



# కల్యాణం

- శ్రీమతి చెవుటూరి కుసుమకుమారి, 97012 96960

పురుషోత్తముడైన రామచంద్రునకూ, పృథివినుండి (భూమి నుండి) పుట్టిన సీతమ్మకు పెళ్లి. అందుకని ఆకాశమంతపందిరి. భూమంత అరుగు. కల్యాణవేదిక ఐన మిథిలాపురం అంతా పసిడిద్వారాలు, పసుపుగడపలు, పచ్చపచ్చనితోరణాలు, మంచి గంధం పన్నీరు కలిపి కళ్లాపు చల్లిన ఘుమఘుమలు, రంగు రంగుల పతాకాలు, ముద్దబంతులు, చిట్టిచేమంతులు కలిపి అల్లిన పూలపందిళ్ళు, ముత్యాల తోరణాలు ఎక్కడ చూచినా సిరికళ వెల్లివిరుస్తోంది.

మన చక్కనితల్లి సీతమ్మ, చల్లనితండ్రి రామయ్యల కల్యాణం కనులారా చూచి తరిద్దాం రండి రండి అంటూ కదులు తున్న జనసందోహంతో మిథిలానగరం కిటకిటలాడుతోంది.

ఘనీభవించిన పాలకడలితుంపురులా అన్నట్లు ఎక్కడ చూచినా ముత్యాలరాశులు. ఒకప్రక్క ఇంద్రనీలమణికాంతులు. అనురక్తితో భక్తులు తెచ్చిన భక్తికుసుమమాలికలకు ప్రతిగా బహూకరించటానికా అన్నట్లు ముక్తిమౌక్తిక(ముత్యాల) ఆభరణాల పళ్ళాలు, అగరుధూపాలు, అసాధారణవిందులు, చలివేంద్రాలు, మిరియాల పచ్చకర్పూరపుపానకాలు, అడుగడుగునా రథాలు, అలుపెరుగని అశ్వాలు, ఎటుచూచినా అందరిలోను వెల్లివిరు స్తున్న ఆనందమే. నీలమేఘశ్యాముడు రామయ్యకు కనకమయ వస్త్రాలతో, శ్రీరమ సీతకు సిందూరపు సరిగంచు పచ్చనిపట్టు చీరతో, వజ్రవైడూర్య ఆభరణాలతో నీలిమేఘం మెరుపులా సీతమ్మ, పురుషసింహంలా రాజీవాక్షుడు రాముడు ప్రకాశిస్తు న్నారు వేదికమీద.

అప్పుడు జనకమహారాజు వసిష్ఠమహర్షిని సమీపించి మహర్షీ! రఘువంశశ్రేయస్సును కోరే పరమధార్మికుడవు. లోకాభిరాముడైన శ్రీరామునకు, నా పుత్రిక సీతకూ శాస్త్రాను సారం యథావిధిగా వివాహం జరిపించుమని చేతులు జోడించి అడిగాడు. విశ్వామిత్ర, శతానందులసహకారంతో వివాహవిధి మొదలైంది. హోమం పూర్తికాగానే లావణ్యరాశి సర్వాలంకార శోభిత ఐన తన పుత్రికను అగ్నికి అభిముఖంగా తీసుకువచ్చి...

రామచంద్రా! ఈమె నా పుత్రిక సీత. నేటినుండి నీకు సహధర్మచారిణి కానున్నది. నీ హస్తంతో ఈమెచేతిని పట్టుకొని ధర్మపత్నిగా ఈమెను స్వీకరించు. ఈమె ఛాయలా నేటినుండి నిన్ను అనుసరించగలదని కన్యాదానం చేశాడు.

**18-04-2024 న**
**తిరుపతి, శ్రీకోదండరామస్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా...**

శ్రీరాముని ఆజానుబాహువులనుండి జాలువారుతున్న తలంబ్రాలు ఈ భూమిమీది ప్రాణికోటికి జీవాధారాలా అన్నట్లు వర్షించాయి. దివ్యపారిజాతాల్లాంటి సీతమ్మ దోసిలి లోని తలంబ్రాలతో మూర్తీభవించిన పృథివీతత్త్వంలా, అన్న పూర్ణలా ఉన్నదని అందరూ చెప్పుకొంటున్నారు. అంతేకాదు. నాటికీ నేటికీ అదే భావన. అదే సీతారామకల్యాణం. ఆ అవని కన్యకు (భూమిపుత్రికకు) ఆ అనంతపురుషునికి జరిగిన లోక కల్యాణం ఏటేటా జరుపుకొని కనువిందుగా చూడాలని వాడ వాడలా నేటికీ అవే పందిళ్లు. మండుటెండలో మంచిగంధాల మరుమల్లెల గుబాళింపులు. చల్లనిపానకాలతో మనస్సులోని మాలిన్యాలను మటుమాయం చేసుకుంటూ మనసులు కలిసిన మనీషుల్లాగా మనుగడ సాగించనున్న సాకేతరాముని ఆశయం మనకాదర్శం. పృథివి(భూమి) ఆకాశతత్త్వాలలాగా ఒకే సూత్రానికి కట్టుబడ్డ దాంపత్యబంధంతో విశ్వవ్యాప్తమైనదే సీతా రామకల్యాణం.

**ప్ర) అనంతాచార్యుల గునపంకథ ఏమిటి?**

**జ)** వేంకటేశ్వరునికి పుష్పకైంకర్యం చేయాలనుకుని తిరుమలకొండమీద ఒక నందనోద్యానవనాన్ని నిర్మించదలచారు అనంతాచార్యులవారు. ఆ వనాన్ని పెంచడానికి ఒకసరోవరం కావలసివచ్చింది. ఎవరి సహాయం తీసుకోకుండా తన భార్యతో కలిసి ఆ పని ఆరంభించారు. అనంతాచార్యులభార్య గర్భవతి అయినప్పటికీ ఆమె తనవంతు సహాయం చేస్తోంది. ఆమెపై జాలితో స్వామి బాలునిరూపంలో వచ్చి ఆమెకు సహాయం చేస్తూండగా అనంతాచార్యులు మందలించటానికి ప్రయత్నించాడు. ఆ బాలుడపుడు ఆలయం వైపు పరుగుతీయగా అనంతాచార్యులు తన చేతనున్న గునపాన్ని బాలునిపైకి విసిరాడు. అదిపోయి బాలకునివేషంలో ఉన్న స్వామి చుబుకానికి తగలగా రక్తం కారడం మొదలయ్యింది. వానివెనుకే పరిగెత్తుకొచ్చిన ఆచార్యులవారికి బాలుడు కనపడలేదు. ఆలయంలోకివెళ్లి చూస్తే స్వామివారి చుబుకంనుండి కారుతున్న రక్తాన్ని చూసి స్వామినేనా తాను గునపంతో కొట్టానని బాధపడ్డాడు. అంత స్వామిని బుజ్జగిస్తూ ఆ గాయానికి పుప్పొడి పెట్టాడు. ఆతని బాధ చూసిన స్వామి ఆ గాయపుమచ్చను శ్రీవత్సచిహ్నంగా ఉంచుకుంటానని అతనికి వరమిచ్చాడు.

**ప్ర) జీవనదులు ఎన్ని? అవి ఏవి?**

**జ)** హిమాలయపర్వతాలనుంచి మంచు కరిగి నీరుగా మారడంవల్ల జీవనదుల ఉనికికి అవకాశం ఏర్పడింది. సింధూనది, గంగానది, యమునానది, గోదావరినది, కృష్ణానది, నర్మదానది, కావేరినది అను ఈ ఏడునదులు జీవనదులుగా ప్రసిద్ధి వహించాయి. ఏ కాలమందైనా ఈ సప్తనదుల్లో నీరు ప్రవహిస్తూనే ఉంటుంది.

# సందేహాలు సమాధానాలు



**- శ్రీమతి యం.గీతాకుమారి**

**ప్ర) వివాహసమయంలో కన్యను వరునికి దానమిస్తూ వధువు తండ్రి వరునితో "ధర్మే చ అర్థే చ కామే చ మోక్షే చ నాతిచరితవ్య" అను మంత్రాన్ని చెప్తాడు. అప్పుడు వరుడు "నాతిచరామి" అని అంటాడు. వివాహసమయంలో కన్యాదాత వరునిచే పలికించే ఈ మంత్రాలకు అర్థం ఏమిటి?**

**జ) 1) "ధర్మే చ ఏషా నాతిచరితవ్య"** అంటే ధర్మాచరణమున నీవు ఈమెను అతిక్రమించరాదు. నీవు చేసే ఏ కార్యమైనా ఆమెని సంప్రదించే చేయాలి. ఉదాహరణకు నీవుచేసే దానమైనా, అతిథిసత్కారాలైనా, యజ్ఞయాగాదిక్రతువులైనా, ఏ ధర్మకార్యమైనా ఈమెతో మాత్రమే ధర్మబద్ధంగా చేయాలి అని అర్థం.

**2) "అర్థే త్వయా ఏషా నాతిచరితవ్య"** అంటే అర్థాచరణమునందు ఈమెను నీవు అతిక్రమించరాదు. అనగా నీవు ధనం ఏ విధంగా సంపాదిస్తున్నావో అది న్యాయబద్ధమా? కాదా? అన్న విషయం ఆమెకు చెప్పాలి. నీవు సంపాదించే ధనం ఎంతో కూడా తెలియజేయాలి. ఆ డబ్బులు ఎలా ఖర్చుపెట్టాలో, ఎంత దాచుకోవాలోకూడా ఇద్దరూ కలిసి నిర్ణయించుకోవాలి. దంపతులీవిధంగా నడుచుకుంటే అర్థవిభేదాలు ఉండవు అని అర్థం.

**3)"కామే చ త్వయా ఏషా నాతిచరితవ్య"** అంటే కామం అంటే కోరిక. అవి లౌకికం, అలౌకికం అని రెండురకాలు. లౌకికములంటే కుటుంబ, సంతాన, సంసారాదివిషయాల్లో ధర్మబద్ధంగా చరించటం. అంతేకాక భగవంతునిపూజ, దీక్షలవంటి అలౌకికవిషయాల్లోకూడా ఆమె అనుమతిని తప్పక తీసుకోవాలి. అప్పుడే ఆ దాంపత్యం అనురాగవంతంగా నిలబడుతుంది అని అర్థం.

**4) "మోక్షే చ ఏషా నాతిచరితవ్య"** అంటే ధర్మార్థ కామ మోక్షములను చతుర్విధ పురుషార్థాల్లో మోక్షం వ్యక్తిగతమైనది. ఐనా ఇద్దరూ ఒకరికిఒకరుగా, ఒకే మాటగా జీవితాన్ని పంచుకోవాలనేదే దీని అర్థం. ఒకరు లేకపోతే మాలో మరొకరం ఉండలేం అన్న భార్యాభర్తల అభేదతత్త్వాన్ని తెలియజెప్తుంది. మోక్షంలోకూడా మేమిద్దరం సహచరులం అని చెప్పడమే ఇందలి గూఢార్థం.

వివాహసమయంలో చెప్పే ఈ మంత్రాలు మానవజీవన సేవాభాగ్యానికి, ఆనందకరజీవితానికి, జాతిసంప్రదాయానికి మేలిమిబంతులని చెప్పవచ్చు.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



## గత సంచిక విశేషార్థం..

బ్రహ్మర్షి ముఖ్యులను చూచిన హరి వారిని కరుణార్ద్రదృష్టితో చూస్తూ-

“వనజగర్భ! ఏ పనిమీద నీవు ఇక్కడికి వచ్చావు? విశదంగా చెప్పండని ఆనతి చ్చాడు. బ్రహ్మ చేతులు జోడిస్తూ-

దేవదేవ! దీనరక్షక! మా విన్నపాన్ని దయతో ఆలకించండి. విశ్రవఃపుత్రుడైన రావణుడు ఘోరతపస్సు కొనసాగించి సుర యక్ష గరుడ గంధర్వ ప్రముఖులెవ్వరు గాని తన్ను సంహరించని వరాలివ్వ వలసిందిగా కోరుకున్నాడు. నేను సరేనని అనుగ్రహించాను. ఆత్మరక్షణకోసం ఇచ్చిన వరాన్ని రావణుడు దుర్వినియోగం చేస్తున్నాడు. గర్విష్ఠుడయి తనకెదురులేదని విజృంభిస్తున్నాడు. శ్రీశైలంప్రాంతం లోని అమాయకసాధువులను హింసిం చడం మొదలెట్టాడు.

స్వామి! రావణుడు దేవజాతివారి వలన ప్రాణభయం లేకుండా వరమడి గాడు గాని మానవులు తన్నేమి చేయ లేరనే ధైర్యంతో మానవమాత్రులనుండి తనకు మరణం రాకూడదని అడగలేదు. విర్రవీగుతున్న రావణుడు అంత్యకాలంలో సామాన్యమానవునిచేతిలో సంహరింప బడతాడని నేను ఆనాడు భావించాను.

బ్రహ్మమాటలను విన్న హరి ఆపై అగస్త్యాదులను చూచి మునివరులారా! మీరందరు ఇక్కడికి ఎందుకు వచ్చారని ప్రశ్నించాడు.

అగస్త్యుడు కమలాక్షుని కీర్తిస్తూ స్వామి! పదిమొగములవాడు, పరమమూర్ఖుడు రావణుడు మర్త్యుల్ని అనేకరీతుల పీడిస్తున్నాడు. భూలోకంలోని మానవ మాత్రుల దుర్దశలను చూడలేక వారి బాధలను మీతో విన్నవించడానికి ఇదొక అవకాశమని మేమూ చతుర్ముఖునితో వచ్చామన్నారు.

స్వామి! పంక్తికంఠుని వధించి ప్రజ లను రక్షించండి. లోకసంక్షేమంకోరే మాలాంటివారిని కరుణించండి అని ప్రార్థిస్తుంటే హరి నవ్వుతూ సనకసనంద నాదులను చూచి-

మీరే పనిమీద వచ్చారు? మీరు ఆది యోగులు. సదా ఆనందస్వరూపులు. అలాంటివారు ఇక్కడికి రావడానికి కారణ మేమిటని వారిని ప్రశ్నించాడు.

స్వామి! అంతరంగంలోని జ్ఞాననేత్రాల ద్వారా సదా దర్శిస్తున్న మీ కమనీయా కారాన్ని కర్మచక్షువులు ఎలా దర్శిస్తాయో చూద్దామని వచ్చామన్నారు-

హరి అంతటితో ఆగక దేవేంద్రుని చూచి నీ రాకకు కారణమేమిటని ప్రశ్నిం చాడు.

స్వర్గాధిపతి దేవేంద్రుడు “నిర్మలాత్మ! మాధవా! బ్రహ్మ, అగస్త్యాదిమునులు మనవి చేసినట్లుగా రావణుడు ఇచ్ఛా విహారం చేస్తూ తనకెవరూ ఎదురులేరని శ్రీశైలప్రాంతాల్లో మునుల్ని, మానవుల్ని రకరకాలుగా వేధిస్తున్నాడు. ఆ రాక్షసుణ్ణి అణచేవారెవరూ మాకు కనబడలేదు.

దేవా! మీరే సమర్థులు. ఇప్పటికే ఎన్నో బాధలు పడ్డాం. మీరు రావణుని విశృం ఖలత్వానికి అడ్డువేయండి. భూలోకవాసుల్ని రక్షించండి. మౌనుల తపశ్చర్యకు వీలుగా నిర్ణయం తీసుకోండి. మాలాంటివారిపట్ల దయచూపండి. మీ శక్తియుక్తులు మాకు తెలిసినవే. మీరే రావణవధకు సమర్థులు. మీతో మా బాధలను చెప్పుకోవడానికి, మీ దర్శనార్థం ఎక్కడెక్కడో తిరిగాం. అన్వేషించాం. చివరకు మా పుణ్యవిశేషం కారణంగా ఇక్కడ మాకు మీ దర్శనభాగ్యం కలిగింది.

స్వామి! సామాన్యజనులు దర్శింపలేని మీ పాదాలను పుణ్యవిశేషంకారణంగా దర్శింపగలిగాం. సకలభూతదయతో రావణుణ్ణి తప్పక సంహరించండి అని దైన్యంగా వేడుకొన్నాడు.

స్వామి! దివ్యదేశాలైన క్షీరసాగరం, శ్రీవైకుంఠం వదలి శేషపర్వతంలో ఉండడానికి కారణమేమిటో తెలుసుకోలేక పోతున్నాం. అంతేకాదు, సామాన్య మానవమాత్రులకుకూడా కనిపించకుండా ఈ పర్వతాల్లో విహరించడమేమిటి? భూలోక వాసులయిన రావణుడు విగ్రవీగడమేమిటి? స్వామి మమ్మల్ని క్షమించండి. దుష్టశిక్షణ. శిష్టరక్షణ చేయగలిగినవాడనే సత్కీర్తి మీరే మరచిపోవడమేమిటి?

స్వామి! మీరు కర్తవ్యోన్ముఖులై, స్థితికారకులై మా అందరిని రక్షించాలి. పంక్తికంఠుణ్ణి సంహరించాలి అని ప్రార్థిస్తున్నవారిని చూచి స్వామి– "బ్రహ్మాదిముఖ్యులారా! అధైర్య పడకండి. మీ అందరి బాగోగులను చూడడమే నా కర్తవ్యం. నేను మిమ్మల్ని తప్పక కాపాడతాను. ఆ దుష్టదానవుని అంత్య కాలంకోసం నేనూ వేచి ఉన్నాను. సముద్రం దాటి ఈ కొండల్లో, ఈ వనభూముల్లో అడుగుపెట్టగానే ఆ పదిమొగములవాని వినాశనానికి పథకాలు వేస్తాను అని భరోసా ఇస్తుంటే అక్కడికి కైలాసవాసుడు వచ్చాడు.

స్వామి! వైకుంఠాన్ని వదలిపెట్టారు. శేషగిరిని వాసంగా చేసుకున్నారు. అయినా భూలోకవాసులు ఇంకా బాధలు భరించవలసిందేనా?

సామాన్యమానవులకు రాక్షసులపీడ ఏమాత్రమూ లేకుండా ఉండడానికోసం మీరు శేషాద్రిలో ప్రత్యక్షమై ఉండడం మంచిదే. మీరుండగా రాక్షసులు ఈ దిక్కుకేసి చూడరు. అంతేకాదు మానవులు ఆత్మవిశ్వాసంతో నిన్ను సేవిస్తుంటారు. ఈ కారణంతో ఈ ప్రదేశం భూలోకవైకుంఠంగా విఖ్యాత మవుతుంది. మిమ్మల్ని వదలక మీకు దూరంగా వాసం చేయక నేను భూలోకవాసుణ్ణి అవుతాను. నాకు తగినచోటును మీరు నిర్దేశించరాదూ. ఇరువురము భూలోకవాసులమవుదాం అన్నాడు. ఆ విన్నపానికి స్పందించిన హరి–

పరమేశా! నీవు నాతో ఉండాలనుకోవడం మంచి ఆలోచనే. నాకూ ఇష్టమే. ఈ సర్వపరలోకానికి క్రిందిభాగాన నీవుండు. నా ఆశ్రమంలో నీవున్నావనే ధైర్యంతో నన్నూ అందరూ సేవిస్తారు.

ఈ సంభాషణ అంతా వింటున్న దేవేంద్రాదులు పరమానందభరితులయ్యారు.

వాసుదేవుడు తదనంతరం దశరథునికేసి చూస్తూ, దశరథా! తాపసులతో నీవు ఇక్కడికి తరచూ రావడానికి కారణమేమిటి? అని ప్రశ్నించగా– దశరథుడు చేతులు జోడించి–

దశరథుని స్తుతి

ఆనందవిగ్రహా విశ్వాకారక! విశ్వాత్మా! మీ దర్శనం చేసుకోవాలని కోరికోరి వచ్చా. స్వామి! బ్రహ్మాదులు ఎవరి దర్శనార్థం తపస్సు కొనసాగిస్తారో, ఎవరెవరికి తగిన ఇష్ట సూక్తులు వినబడతాయో, ఎవరి దర్శనంకోసం పరితపిస్తారో అలాంటి గురుడవు నీవే. సృష్టికర్తవు. మీ చలువతో అష్ట దిక్పాలురు, గ్రహాదులు, దేవతలు తమరు అప్పగించిన విధుల్ని సక్రమంగా నిర్వహిస్తున్నారు. మీరే సర్వాధికారులు. మీ నివాసం పరమపదం. మీ సర్వోన్నతత్వాన్ని కీర్తించే శక్తి నాకు లేదు.

స్వామి! దేవదేవ! దీనుడైన నా విన్నపం ఆలకించండి. మీరు ప్రసాదించిన భోగభాగ్యాలున్నాయి. కాని వంశగౌరవం నిలుపగలిగే సంతానం నాకు లేదు. తీరని చింత. వ్రతహీనునికి సత్పుణ్యలోకాలు లేవని వేదం చెబుతుంది. ఈ తాపంతో నేను మీ పాదాలే శరణ్యమని వచ్చాను. స్వామీ! నామీద దయతో సత్యధర్మపరాక్రమశక్తిమతులయిన కుమారులను నాకు ప్రసా దించండి అని ప్రార్థించాడు. *(ఇంకా ఉంది)*

## వైకుంఠపాళి

### :: 99 – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 వ | సం | 2 త | బు | తు | వు | | 3 తా | | 4 వా | |
| రూ | | క్ష | | | | 5 కా | ల | కే | యు | లు |
| ధి | | 6 కు | శ | ధ్వ | జు | డు | | | దే | |
| 7 నీ | లు | డు | | | | | 8 మే | రు | వు | |
| | | | | | 9 శ్రీ | | ఘ | | డు | |
| 10 భ | ర | 11 ద్వా | జా | శ్ర | మం | | 12 నా | రి | | |
| ర | | ర | | | తం | | ఘు | | 13 క్రో | ధి |
| ణి | | 14 క | 15 న | కం | | 16 వా | డు | | ధ | |
| | 17 త | | ల | | 18 కా | | | 19 అ | హం | |
| 20 త | ప | స్వి | | 21 తా | మ | సు | డు | | 22 తు | ష్టి |
| | స్య | | | | దా | | | 23 వీ | డు | |

**09-04-2024న**
**తిరుమల శ్రీవారి ఉగాదిఆస్థానం**
**సందర్భంగా...**



# ఉగాది ఆస్థానం

**- శ్రీ యం.వి.యస్.రామశేషు**

***ఆ**కులురాల్చి శిశిరఋతువు తరలివెళ్ళగా చిగురించిన చెట్లతో ప్రకృతికి అందాలు నింపుతూ ఆనందంగా ఆమని వచ్చింది. షడ్రుచుల సమ్మేళనమే ఉగాది.*

దక్షిణాయనం వెళ్ళినతరువాత ఉత్తరాయణంలో వచ్చే పండుగ ఉగాది లేదా యుగాది. ఇది తెలుగువారు జరుపుకునే ముఖ్యమైనపండుగ ఉగాది. **'ఉగస్య ఆది ఉగాది'** అంటారు. **'ఉగ' అనగా నక్షత్రగమనము. 'యుగము' అంటే రెండు లేక జంట అని అర్థం.** సంవత్సరంలో ఉత్తరాయణం, దక్షిణాయనం అని రెండుభాగాలుగా చెబుతారు. ఆ ద్వయానికి ఆది యుగాది లేదా సంవత్సరాది అయింది. ఇది తెలుగు నెలలో మొదటినెల చైత్రమాసంలో మొదటిదైన పాడ్యమిరోజు అశ్వినీనక్షత్రంలో అపుడే వచ్చిన కొత్తమామిడి, వేపపూత, చెరకు, చింతపండు, లవణం, మిరియాలు అన్నీ కలగలిపిన షడ్రుచుల ప్రసాదమీ పండుగప్రత్యేకత. ఈ ఆరింటినీ అరిషడ్వర్గాలకు ప్రతీకగా చెబుతారు. ఈ అరిషడ్వర్గాలను జయించి, మనిషి మనీషిగా ఎదగాలన్నదే ఈ పండుగ ఉద్దేశ్యం. ఈ ఉగాది గురించిన అనేకగాథలు మనకు కనిపిస్తాయి. సోమకుడనే రాక్షసుడు వేదాలను అపహరించగా శ్రీమహావిష్ణువు మత్స్యావతారమును ధరించి సోమకుని సంహరించి, వేదాలను బ్రహ్మకు అప్పగించిన శుభతరుణమే ఉగాది.

చైత్రశుక్లపాడ్యమినాడు బ్రహ్మ సృష్టిని ప్రారంభించిన రోజని, శాలివాహన శకయుగకర్త శాలివాహనుడు పట్టాభిషిక్తుడయినదీరోజే. మహావిష్ణువు నాభికమలం నుంచి ఉద్భవించిన బ్రహ్మ సృష్టిని ప్రారంభించబోతూ మహావిష్ణువు తనవద్ద ఉండు మని కోరగా, విష్ణువు తాను పాలకడలిలో ఆదిశేషునిపై శయనించి ఉన్న విగ్రహాన్నిచ్చి దాన్ని అర్చించుమన్నాడు. ఆ తరువాత అది సూర్యునివద్దకు, అంచె లంచెలుగా చివరకు సూర్యవంశమువాడైన శ్రీరామచంద్రునివద్దకు చేరింది. రామపట్టాభిషేకం తరువాత విభీషణుడు కోరగా శ్రీరామచంద్రుడు దానిని ఆతనికిచ్చాడు. ఆ విగ్రహాన్ని లంకకు తీసుకునిపోతూ దారిలో కావేరినదిఒడ్డున నేలపై పెట్టగానే అది అక్కడే ప్రతిష్ఠితమయ్యింది. అదే **శ్రీరంగనాథుడు వెలసిన శ్రీరంగక్షేత్రం.** ఆ రోజు చైత్రశుక్లపాడ్యమి. ఇన్ని ప్రత్యేకతలను సంతరించుకున్న ఉగాది అత్యంత ముఖ్యమైనపండుగ.

ఈ రోజున ఇళ్ళల్లోనేకాదు, ఆలయాల్లోకూడా ఉగాదిపండుగ జరుపబడు తుంది. ఆలయాల్లో పంచాంగపఠనం ప్రధానంగా జరుపబడుతుంది. పంచాంగంలో ఐదు అంగాలుంటాయి. అవే తిథి, వార, నక్షత్రం, యోగం, కరణం. ఇందులో తిథి- ఆదాయాన్ని, వారం- ఆయువును, నక్షత్రం- పాపప్రక్షాళనను, యోగం- వ్యాధి నివారణలను, కరణం- పవిత్రగంగానదిలో స్నానం చేసిన పుణ్యఫలాన్ని అందిస్తుం దని నమ్ముతారు. ఈ పంచాంగం కాలపురుషుడైన మహావిష్ణువుకు ప్రతిరూపం. ఈ పంచాంగశ్రవణంవల్ల నవగ్రహాలు సకలసౌఖ్యాలను కలుగజేస్తాయని, దైవా నుగ్రహం కలుగుతుందని పండితవాక్కు. ఈ ఐదింటిని లెక్కవేసి దేశభవిష్యత్తు, మానవుడి మంచిచెడులనుగురించి పండితులు వివరించి చెబుతారు. దీనినే పంచాంగశ్రవణం అంటారు.

ఉగాదిపండుగరోజున తిరుమలలో ఉగాదిఆస్థానం నిర్వహింపబడుతుంది. ఈ ఆస్థానం శ్రీవారిసన్నిధిలో జరుపబడుతుంది. ఉగాదిరోజున స్వామికి తిరుమంజనం చేసి, సహస్రనామార్చనం తరువాత పట్టుపీతాంబ రాలతో, వజ్రాభరణాలతో అలంకరించి సర్వ భూపాలవాహనంమీద వేంచేపు చేస్తారు. విశేషమైన పిండివంటలు నివేదన చేస్తారు. ఆ తరువాత శ్రీశ్రీశ్రీ పెద్దజియ్యంగారు



అంతేకాక మిగిలిన 27 నక్షత్రజాతకుల కందాయ ఫలాలను, ఆదాయవ్యయాలను, రాజపూజ్యత, అవమానాలనుగురించికూడా పంచాంగపఠనంలో వినిపిస్తారు. స్వామి పంచాంగశ్రవణంవలన లోక క్షేమాన్ని కాంక్షించి ఈవిధంగా చేస్తారు.

ఆ తరువాత ఆస్థాన సిద్ధాంతి శ్రీదేవిభూదేవులకు వారి నక్షత్రాలైన ఉత్తర ఫల్గుణి, రేవతీనక్షత్రాల ఫలితాలను వివరించి, ఆలయాధికారుల నక్షత్రఫలితాలను వివరించటం జరుగుతుంది. ఖజానా అధికారులు స్వామికి నమస్కరించి హుండీరాబడిని, ఆదాయవ్యయాలను, ఉత్సవ విశేషాలను, ఇతర ఆలయాల విశేషాలను స్వామివారికి వినిపిస్తారు.

పట్టువస్త్రాలను తలమీద పెట్టుకొని మంగళవాద్యాలు మ్రోగుతుండగా దేవస్థాన అధికారులందరూ కలసి స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. స్వామిని ఊరేగింపుగా తీసుకువచ్చి బంగారువాకిలివద్ద ఆగమపండితులు, అర్చకులు ఉగాది ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆ రోజు ఆర్జిత సేవలుండవు.

సర్వభూపాలవాహనంలో శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి, సర్వసైన్యాధిపతి విష్వక్సేనులవారు పరివేష్టించి ఉంటారు. ఆ సమయంలో నూతనసంవత్సరపంచాంగాన్ని అర్చకులు ముందుగా స్వామివారికి నమస్కరిస్తూ దేవస్థాన సిద్ధాంతికి అందజేస్తారు. దానిని అందుకున్న సిద్ధాంతి స్వామి అనుగ్రహంతో శ్రీవారి ఉత్సవమూర్తులకు ఆనాటి తిథి, వార, నక్షత్రాలతోపాటు, నూతనసంవత్సరఫలితాలను తెలియజేస్తారు. అందులో దేశక్షేమాన్నిగురించి, లాభనష్టాలు, నవగ్రహాల సంచారం, సస్యవృద్ధి, పశువృద్ధి, కాలంలో జరిగే మార్పులను, ఆదాయవ్యయాలనుగురించి వివరిస్తారు. స్వామివారికి నివేదిస్తే స్వామిదయతో ఎట్టివిపత్తులనైనా దాటవచ్చుని సిద్ధాంతుల ఈ పంచాంగపఠన ప్రత్యేకత కావచ్చు.

అంతేకాక ఇవన్నీ దేవరవారు చిత్తగించవలెను అని స్వామికి సాష్టాంగనమస్కారం చేసి, హారతితో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తారు.

ఆర్తరక్షకుడైన స్వామి ఆస్థానసిద్ధాంతి చెప్పిన పంచాంగ ఫలితాలను విని భక్తులు స్వామి అనుగ్రహాన్ని పొందుతారని విశ్వాసం. అర్చకులు హారతినిచ్చిన అనంతరం తాళ్లపాక, తరిగొండ, మహంతు, మైసూరువారి ప్రత్యేకహారతులు సమర్పించబడతాయి. ఆ తరువాత అక్కడ చేరిన భక్తులనుండి ఒక్కొక్కరూపాయి సేకరించి అందరిపక్షాన **"రూపాయిహారతి"**ని ఇవ్వడం జరుగుతుంది. ఈ విధంగా స్వామి పంచాంగశ్రవణం నివేదన హారతులతో ఉగాదిదర్బార్ ముగుస్తుంది. అందుకే ఆలయాల్లో ఉగాదినాడు పంచాంగశ్రవణం నిర్వహించటం ఒక గొప్పఉత్సవంగా జరుపుతారు. ఈ పంచాంగశ్రవణంను భక్తి శ్రద్ధలతో విని భక్తులు భగవదనుగ్రహాన్ని పొందుతారు. ఇదే పంచాంగశ్రవణ ప్రత్యేకత.

శ్రియః కాంతాయ కల్యాణనిధయే నిధయేర్థినామ్ ।
శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥


జీవితానికి విశ్వాసం పునాదిలా ఉండాలి

# ఒంటిమిట్ట శ్రీకోదండరామాలయం

- డా॥ మైలవరపు లలితకుమారి

**17-04-2024నుండి 25-04-2024వరకు ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా...**

"శ్రీరామచంద్రుడు కొలువైనచోటు
భాగవతమ్ము వెలసిన ఏకశిలానగరము
భక్తకవి పోతనామాత్యుని జన్మస్థలి
భక్తుల కోరికలనీడేర్చు కొంగుబంగారం"

నేటి వై.యస్.ఆర్. కడపజిల్లాకు 22 కి.మీ. దూరంలో ఒంటిమిట్ట అను పుణ్యక్షేత్రం కలదు. ఇది తపోధనులకు, యజ్ఞ యాగాదులకు త్రేతాయుగంలో ప్రసిద్ధి పొందిన భూమి. ఇక్కడి దైవం కోదండరాముడు. విశాలప్రాంగణంలో మూడువైపులా ఎత్తైనగోపురాలతో అత్యంతసుందరంగా కనిపిస్తుంది ఆలయం. గాలిగోపురంనుంచి లోపలికి ప్రవేశించగానే విశాలప్రాంగణం, 32స్తంభాలమండపం మనకు దర్శనమిస్తాయి. ఈ ఆలయంలోని గోపురంపైనున్న శిల్పాలు, మంటపంలోని స్తంభాలు అన్నీ చోళుల శిల్పకళావైభవాన్ని గుర్తుకుతెస్తాయి. మంటపంలోని స్తంభాలపై రామాయణ, భారతకథలు చెక్కబడి ఉన్నాయి.

సీతారామకల్యాణం జరిగిన తర్వాత శృంగి, మృకండు మహర్షుల ప్రార్థనమేరకు దుష్టశిక్షణ, శిష్టరక్షణకై, యజ్ఞ యాగాదిసంరక్షణకై శ్రీరామచంద్రుడు పిడిబాకు, అమ్ములపొది, కోదండమును ధరించి ఈ ప్రాంతానికి వచ్చినట్లు కథనం. ఆ తరువాత ఒకేరాతిపై సీతాలక్ష్మణసహితంగా శ్రీరాముని విగ్రహాన్ని మహర్షులు చెక్కించారేగాని ప్రతిష్ఠించినట్లుగా కన బడదు. జాంబవంతుడీ ప్రాంతాన్ని దర్శించినపుడు ఆయన కలలో ఆ విగ్రహం కనిపించగా, అతడు దానిని అన్వేషించి ఇక్కడ ప్రతిష్ఠించినట్లు ఐతిహ్యం. అందువల్ల దీనికి జాంబవంత ప్రతిష్ఠ అనే పేరొచ్చింది.

సీతారామలక్ష్మణవిగ్రహాలు ఏకశిలలో ఉన్నందువల్ల దీనికి ఏకశిలానగరమనే పేరు వచ్చి ఉండవచ్చు. అదే కాల క్రమేణ ఒంటిమిట్ట అనుపేర ప్రసిద్ధిచెందిన అద్భుతమైన పుణ్య స్థలి. సీతాదేవి దాహం తీర్చటానికి ఇక్కడ రామలక్ష్మణులు శరసంధానం చేసి పాతాళగంగను పైకి తెచ్చారట. ఆ బాణపు దెబ్బవల్ల ఏర్పడిన బావులను రామతీర్థం, లక్ష్మణతీర్థంగా నేటికి వ్యవహరిస్తారు.

ఇక్కడ ఆలయంలో సీతారాములతో ఆంజనేయుడు దర్శనమివ్వడు. దేవాలయ ముఖద్వారానికి ఎదురుగుండా సంజీవరాయస్వామి భక్తులను కరుణిస్తాడు. ఆంధ్రావాల్మీకిగా ప్రసిద్ధిపొందిన వావిలికొలను సుబ్బారావుగారు ఈ ఆలయ నిర్మాణానికి అవిరళకృషిచేయడమేకాక టెంకాయచిప్ప చేత పట్టి భిక్షాటన చేసి వచ్చిన సొమ్ముతో స్వామికి ఆభరణాలు కూడా ఏర్పరచారు. ఈ సంజీవరాయఆలయంప్రక్కనే-




పలికెడిది భాగవతమట
పలికించెడివాడు రామభద్రుండట నే
బలికిన భవహరమగునట
పలికెద వేరుండగాథపలుకగనేలా

అన్న ఆంధ్రమహాభాగవతకర్త బమ్మెర పోతనామాత్యుని విగ్రహం మనకు కనిపిస్తుంది. ఒకసారి ఇమాంబేగ్ అను ముస్లిం అధికారి ఈ ఆలయానికి వచ్చిన భక్తులను మీ స్వామి పిలిస్తే పలుకుతాడా అని ప్రశ్నించాడట. అప్పుడు వారు



చిత్తశుద్ధితో పిలిస్తే తప్పక పలుకుతాడనగా ఆయన ఆ రామ చంద్రుని మూడుసార్లు పిలువగా **"ఓయ్"** అని పలికిన శబ్దం వినిపించిందట. దాంతో ఆయన స్వామిభక్తునిగా మారిపోయాడు. అక్కడి ప్రజల నీటి అవసరాలను తీర్చటానికి ఒకబావిని త్రవ్వించాడు. అదే నేటికి **'ఇమాంబేగ్‌బావి'** పేరుతో ప్రసిద్ధి పొందింది. ఆయనేకాక **ఓబన్న** స్వామికృపకు పాత్రుడైనాడు. ఆయనపేర **ఓబన్నస్తంభం** అని నిర్మించబడింది.

అక్కడి బోయరాజులయిన **ఒంటడు మిట్టడు** అనేవారు అక్కడి రామతీర్థనీటితో బాటసారుల దప్పిక తీర్చేవారు. శిథిలమైన ఆ గుడిని కంపరాయల సహాయంతో వారు పునరుద్ధరించారు. ఒంటిమిట్టఆలయంతో ఇలా ఎన్నో కథలు ముడిపడిఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ విడిపోకపూర్వం భద్రాచలంలో శ్రీరామ నవమిఉత్సవాలు వైభవంగా జరిగేవి. అక్కడ చైత్రశుద్ధనవమి నాడు సీతారాముల కల్యాణం వైభవోపేతంగా జరిగేది. కాని ఇప్పుడు భద్రాచలం తెలంగాణలో భాగంగా మారినందువల్ల, ఆంధ్రదేశంలోని ఒంటిమిట్టలో శ్రీరామనవమి ఉత్సవాలు జరుపు తున్నారు. నవ్యాంధ్ర ఏర్పడిన తరువాత ఈ ప్రాంతం ఆంధ్ర భద్రాచలంగా పేరుపొందింది. 16వశతాబ్దిలో ఈ ఆలయాన్ని దర్శించిన ఫ్రెంచియాత్రికుడు భారతదేశంలోని పెద్దగోపురా లలో రామాలయగోపురం ఒకటి అన్నారు. ఇక్కడ చైత్రశుద్ధ నవమినుండి చైత్రబహుళవిదియదాకా తొమ్మిదిరోజులు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. కోదండరామునికల్యాణం కన్నులపండువుగా జరుపుతారు. ఇక్కడైతే నవమి రోజునకాకుండా చైత్రపున్నమివెలుగులలో జరుగుతుందీ కల్యాణం. పెళ్లికి ముందు సకలగుణసంపన్నుడైన శ్రీరాముని, లోకోత్తర సౌందర్యవతి సీతమ్మను అందంగా అలంకరించి ఎదురుకోలుకు సన్నాహం చేస్తారు. తూర్పు పడమరలలో అలంకరించిన పల్లకీలలో ఎదు రెదురు మండపాలలో సీతారాములను కొలువు దీర్చి ఈ ఎదురుకోలుఉత్సవాన్ని జరపడం ఇక్కడి ఆనవాయితీ. ఆ తరువాత ఆలయానికి సమీపాన ఉన్న మిథిలాఆవరణంలో పున్నమి వెన్నెలవెలుగులలో అంగరంగవైభవంగా కల్యాణం జరుపుతారు. ఇలా రాత్రిపూట కల్యాణం జరపటానికి పురాణాల్లో ఒకకథ ఉన్నది.

విష్ణుమూర్తి, లక్ష్మీదేవిల కల్యాణాన్ని సాగరుడు పగటి పూట నిర్వహించాడు. అప్పుడు లక్ష్మీదేవి సోదరుడు చంద్రుడు సోదరికల్యాణాన్ని తాను చూడలేకపోతున్నానన్న బాధను మహా విష్ణువుతో పంచుకున్నాడు. అప్పుడు ఆర్తత్రాణపరాయణుడు విష్ణువు నీ కోరిక త్రేతాయుగంలో రామావతారంలో తప్పక తీరుతుందని వరమిచ్చాడు. ఆ కారణంగా ఒంటిమిట్టలోని కోదండరామునికల్యాణం నవమిరోజునకాకుండా పున్నమిరోజున వెండివెన్నెలలో జరుపబడుతున్నదని పండితవాక్కు. ఆ మరునాడు రథోత్సవాన్ని జరుపుతారు. ఈ ఉత్సవాలను చూచి తరించటానికి భక్తులు శ్రమకోర్చి తండోపతండాలుగా తరలివస్తారు.

ప్రస్తుతం తిరుమలతిరుపతిదేవస్థానంవారి ఆధ్వర్యంలో ఈ ఆలయనిర్వహణ జరుగుతోంది.

నీ నామస్మరణమే పాపహరణము
నీ చరణములే కాపాడునన్ను
నిన్ను చూసిన కన్నుల చూపులే ధన్యము
నా మనసున నిలిచి మమ్ము కరుణచూడు
ఓ రామా! ఒంటిమిట్ట కోదండరామా!

భక్తులకు కొంగుబంగారమైన కోదండరాముడు సీతా లక్ష్మణసమేతుడై భక్తులను రక్షిస్తూ ఒంటిమిట్టలో కొలువైన ఆ స్వామిని దర్శించుకుందాం.

"లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు"

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే



# ప్రణోదేవి

-శ్రీ చాకిచర్ల నాగసుదర్శనరావు, 97013 85006

బంగారుతల్లి సరస్వతీదేవి మనకు జ్ఞానప్రదాత మరియు విద్యాప్రదాత. జగద్గురువులు ఆదిశంకరులు వక్కాణించినట్లుగా జంతూనాం నరజన్మ దుర్లభం అనే మాటలు సద్వినియోగం అవ్వాలంటే పూర్ణేందుబింబానన అయిన ఆ జ్ఞానసరస్వతికటాక్షం మనమీద ప్రసరించాలి. ఆ జ్ఞాన వెలుగుల స్పర్శ ఎల్లప్పుడూ మనం కలిగి ఉండాలి.

తెలుపురంగు అంటే ఆ తల్లికి ఇష్టం. అందుకే ఆ తల్లికి మరోపేరు హంసవాహిని. గుణపరంగా తెలుపు స్వచ్ఛతని సూచిస్తుంది. స్వచ్ఛత మనిషి చిత్తశుద్ధికి కొలబద్ద! చిత్తశుద్ధికి జ్ఞానం ఆలంబనమై ఉంటుంది. ఆ జ్ఞానాన్ని పొందటానికే దేవతలు సైతం ఆ సరస్వతీదేవిని నిరంతరం ఉపాసిస్తూంటారు. అందుకే మహాభాగవతాన్ని ఆంధ్రీకరిస్తూ బమ్మెర పోతనామాత్యుడు ముందుగా వినాయకస్వామిని స్మరించి, ఆ శారదామాతను ఈ విధంగా ప్రార్థించాడు:

ఓ భారతీదేవి! తెల్లనికాంతులు వెల్లివిరిసే శరత్కాలమేఘాలు, శరదృతుచంద్రబింబం, పచ్చకర్పూరం, మంచిగంధం, రాజహంసలు, జాజిపూల దండలు, కురిసేమంచు, తెల్లనినురుగు, వెండికొండ, రెల్లుపూలు, ఆదిశేషుడు, మల్లెపూలు, కల్పవృక్షం, పాలసముద్రం, తెల్లతామరలు, ఆకాశగంగా నీ ఉజ్జ్వల శుభంకర ఆకారానికి ఉపమానాలు కదమ్మా! అంతటి స్వచ్ఛధవళసుందరమూర్తివైన నీ దర్శనం కన్నులార మనసుదీర ఎప్పుడు అనుగ్రహిస్తావు తల్లీ!

శారదామాతకు మరోనామం జగత్ఖ్యాతి, పరాశక్తి. తొలిగా ధరించిన ఐదురూపాల్లో సరస్వతీదేవిది ఒకరూపం. ఆ మాత కేవలం చదువులనే కాదు సర్వశక్తిసామర్థ్యాలను తన భక్తులకు ప్రసాదిస్తుందని దేవీభాగవతం నవమస్కంధం ఐదోఅధ్యాయం వివరిస్తోంది. మహామాయ, భాషాజ్యోతిర్మయి, కళారస హృదయగాకూడా సరస్వతీదేవిని కొలుస్తారు. సరస్వతీదేవి ఆద్యంతరహితశక్తిస్వరూపిణి అని వివిధస్తోత్రాల్లో స్తుతిస్తారు.

పూర్వం ఓసారి సనత్కుమారుడు బ్రహ్మ దగ్గరికెళ్ళి జ్ఞానాన్నిగురించి బోధించుమన్నాడు. శ్రీకృష్ణ పరమాత్మ సూచనమేరకు బ్రహ్మ సరస్వతిని స్తుతించి బ్రహ్మజ్ఞాన విషయాన్ని తెలుసుకుని, ఆ తర్వాత బ్రహ్మజ్ఞానసిద్ధాంతాన్ని సనత్కుమారునికి ఉపదేశించాడు. అలాగే పూర్వం భూదేవి అనంతుడిని తనకు జ్ఞానాన్ని ఉపదేశించుమంది. అనంతుడు కశ్యపుడిఆజ్ఞతో పలుకులతల్లిని స్తుతించాడు. ఆ తర్వాతనే అనంతుడు నిర్మలమైన జ్ఞానాన్ని సిద్ధాంతీకరించి భూమాతకు చెప్పగలిగాడు.

పూర్వం వ్యాసభగవానుడు పురాణసూత్రాలగురించి వాల్మీకిని అడిగాడు. వాల్మీకి జగదాంబను స్మరించాడు. అలా అతను సరస్వతీదేవిదయను పొంది పురాణసూత్రజ్ఞానాన్ని



వ్యాసునికి తెలిపాడు. వ్యాసుడుకూడా నూరేళ్ళపాటు పుష్కర తీర్థంలో సరస్వతినిగురించి తపస్సుచేసి వరాన్నిపొంది సత్క వీంద్రుడయ్యాడు. ఆ తర్వాతే అతను వేదవిభాగాన్ని, పురాణ రచనను చేశాడు.

ఓసారి ఇంద్రుడు తనకు తత్త్వజ్ఞానాన్ని ఉపదేశించు మని శివుణ్ణి అడిగాడు. అప్పుడు శివుడు దివ్యవాణిని తలచుకొని ఆ శక్తిప్రభావంతో ఇంద్రుడికి జ్ఞానోపదేశం చేశాడు. మరో సందర్భంలో ఇంద్రుడు బృహస్పతిదగ్గరకెళ్ళి శబ్దశాస్త్రాన్ని తెలియ జేయమన్నాడు. అప్పుడు బృహస్పతి వెంటనే పుష్కరక్షేత్రానికెళ్ళి వేయిదివ్యసంవత్సరాలపాటు సరస్వతిని ధ్యానించి శబ్దశాస్త్రం పొంది, ఇంద్రుడికి, మరికొంతమంది శిష్యులకి బోధించ గలిగాడు.

అలాగే యాజ్ఞవల్క్యుడు గురుశాపకారణంగా తాను నేర్చుకున్న వేదవిద్యలన్నీ మర్చిపోయాడు. అప్పుడు సూర్యభగ వానుని అనుగ్రహంతో వాణీస్తుతి చేసి, తాను మర్చిపోయిన విద్యలన్నీ మరలా స్మృతిలోనికి తెచ్చుకున్నాడు.

మనంకూడా ఆ శారదాంబ అనుగ్రహాన్ని పొందటా నికి ఋగ్వేదాంతర్గతమైన సరస్వతీసూక్తంలోని ఒక ముఖ్యమైన మంత్రాన్ని తెలియచేయటమైంది. ఈ మంత్రాన్ని నిత్యం జపిద్దాం.ఆ జ్ఞానసరస్వతీకటాక్షంతో అష్టైశ్వర్యాలను పొందుదాం.

**మంత్రం :**

**"ఓం ప్రణోదేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ ధీనాం అవిత్ర్యవతు"**

**భావం :**

తల్లీ! సరస్వతీదేవి! మమ్మల్ని అన్ని ఐశ్వర్యాలతో రక్షించు. అంతేకాదు మా బుద్ధులనూ కాపాడు తల్లీ!

అత్యంత శక్తివంతమైన సరస్వతీదేవి ద్వాదశనామాలు:

1)భారతి 2)సరస్వతి 3)శారద 4)హంసవాహిని 5)జగత్ఖ్యాతి 6)వాగీశ్వరి 7)కౌమారి 8)బ్రహ్మచారిణి 9)బుద్ధి ధాత్రి 10)వరదాయిని 11)క్షుద్రఘంట 12) భువనేశ్వరి

పరమేశ్వరస్వరూపమైన ఆదిశంకరులు మన భారత దేశంలో నాలుగుదిక్కుల స్థాపించిన పీఠాల్లో దక్షిణామ్నాయ శ్రీశారదాపీఠంలో ఇప్పటి జగద్గురువులైన శ్రీశ్రీశ్రీ భారతీస్వామి మరియు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీస్వాములసేవలో ఆ తల్లి విరాజిల్లుతూ భక్తులందరిని అనుగ్రహిస్తోంది.

మాఘమాసంలో వచ్చే పర్వదినాల్లో శ్రేష్ఠమైనది వసంత పంచమి. అందుకే జ్ఞానప్రదాయిని సరస్వతీదేవి జన్మదినంగా ఈ పంచమిని జరుపుకొంటాం. పర్వాలన్నీ మాఘమాసంలోనే వస్తాయి. ఋతువులరాణి వసంతానికిది ముందస్తు ఆహ్వానం అన్నమాట.

అలాగే వసంతఋతువులో వచ్చే చైత్రశుద్ధపంచమిని శ్రీపంచమి అంటారు. 'శ్రీ' అంటే లక్ష్మి, సంపద, శుభంవంటి అనేక అర్థాలున్నాయి. సంపదలలోకెల్లా శ్రేష్ఠమైన సంపద జ్ఞాన సంపద కదా! సరస్వతి అంటే అంతర్వాహిని. గంగా యమునా నదులతోపాటుగా త్రివేణీసంగమంలో సరస్వతీనది అంత ర్వాహిని. ప్రతివ్యక్తిలో అంతర్గతంగా ఉండే జ్ఞానవాహినికూడా సరస్వతీదేవే. పుస్తకాలు జ్ఞానభాండాగారాలు. సరస్వతీదేవి స్వరూపాలు. కాబట్టి, శ్రీపంచమిసందర్భంగా ఈ రోజు పుస్తక రూపంలో సరస్వతిని అర్చిస్తారు. బాలబాలికలకు అక్షరా భ్యాసాలు చేయించి ఈ క్రిందిశ్లోకాన్ని చెప్పిస్తారు :

**తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్ నీవు నా యుల్లంబందున నిల్చి జృంభణముగా నుక్తుల్ సుశబ్దంబు శో భిల్లన్ బల్కుము నాదు వాక్కునను సంప్రీతిన్ జగన్మోహినీ! ఫుల్లబ్జాక్షి! సరస్వతీ! భగవతీ! పూర్ణేందుబింబాననా!**

అమ్మా సరస్వతీమాత! పుస్తకం పట్టుకోడానికి ముందు నిన్ను మనసున స్మరించి,పిమ్మట చదువు మొదలుపెడుతున్నాను. తల్లీ! ఓ వికసించిన కలువలవంటి విజ్ఞానం ప్రసరించే కన్నులున్న తల్లీ! నిండుచంద్రునివంటి మోముకల చల్లనితల్లీ! జగన్మోహిని! నా హృదయమునందు ఉండి, నా పలుకులు జృంభణంతో శోభిల్లేట్లుగా మంచివాక్కులను ప్రసాదించు తల్లీ!!, అని వేడుకుంటారు.

మనమందరం మన చిరంజీవులతోకూడి పైన తెలిపిన విధంగా ఆ జ్ఞానసరస్వతిని, చదువులతల్లిని ప్రార్థించి జ్ఞానంతో కూడిన యశస్సును, విద్యాబుద్ధులను పొందుదాం. సుసంపన్న మైన జీవితాలను గడుపుదాం!!



# వసంతశోభ

ఏప్రిల్ 9
ఉగాది సందర్భంగా...

- శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

ప్రకృతివిలసనంతో మరో ఉగాది (ఉగస్య ఆదిః)పర్వం ప్రభవించింది. శ్రీకరసోయగాలతో నవనవోన్మేషలావణ్యంతో ప్రకృతిమాత పరిమళించగా పులకరిస్తుంది.

కవులకలాల చిందుల పరిష్వంగంతో తనువెల్లా తన్మయత్వం చెందిన కళామతల్లి చిత్రకారుల కుంచెలతో సమ్మేళనం పొంది పరిఢవిల్లుతుంది. ఈ తరుణం వసంతాగమనంతో నవచైతన్యపుశోభలతో ప్రకృతి పునర్జన్మనెత్తి సర్వజనాహ్లాదిఅవుతుంది.

మానవమనుగడకు సాకారమై పులకరించిన గుండెలలో కోయిలకూస్తుంది. మధురానురాగమమతలకు శ్రీకారమై పరిమళించినగంధాలతో మావి పూస్తుంది ఆశావహభవితల పరంపరాకృతమై పలవరించిన మనసుతో మల్లెలు విరుస్తాయి.

పుడమితల్లిపై ఉషస్సులకు నిలయమై పరిఢవిల్లిన మధువులు కురుస్తాయి. నవపల్లవలాస్యమృదుహేలతో స్నిగ్ధారావ ప్రమోదాలు పూస్తాయి.

ప్రభవించిన ప్రమాదాన్ని నిర్మూలించి విరిసిందీ చైత్ర మాసారంభ ఉగాది. ఇది నవజీవనకు నాందీయై క్రొత్తఆశల విరజాజుల్ని విరబూయిస్తుంది. భవితాశలకు పునాదియై ఆమని సోయగాలతో కొత్తభాష్యం నేర్పుతుందీ ఉగాది. సమతా మమతల ద్యుతులతో వనదేవత సాక్షాత్కారమై విన్యాసలీలల ఊసుల్ని నింపుతుంది. అంతులేని ఆశలసవ్వడియై వసంతకాంత సోయగాల్ని నింపుకుని మానవాళికి జాగృతులతో అవతరిస్తుంది.

నిరాశానిస్పృహల నైమిశారణ్యంలో జీవించే మానవాళికి క్రొత్తమనుగడను కల్పించే భవిష్యదాశలపునాదియై సర్వజనులను ఆహ్లాదపరిచేదే తెనుగుసంవత్సరాది. ఆంధ్ర సంస్కృతికి ప్రతీకగా విరాజిల్లుతూ మొత్తం ప్రపంచానికి మూలాధారమైంది.

భవిష్యత్ ఆశలతీపితో చేదుఅనుభవాలను మేళవింపజేసి అభిరుచులవగరుతో పొత్తు కలిపి, కఠిననియమప్రవర్తనల కారాన్ని చేర్చి చింతపులుపుతో రంగరించి, వింత వింత పోకడల ఉత్పాతాలఉప్పుతో నిగూఢపరచి, పరమార్థతత్వాన్ని చూపించి జీవితానికి సాధికార్యాన్ని కలిగింపచేసేదే ఉగాది.

అంతేగాక, ఈ ఉగాది నవ్యమై సుఖదుఃఖాల్ని సమం చేసి, జీవితంలో ఆశలచివుళ్ళను చివురింపచేసి నవనవోన్మేషంగా ప్రకాశిస్తూంటుంది. మరియు మానవత్వంతో పరిమళిస్తుంది.

హైందవసంస్కృతికి, ధర్మానికి సంబంధించిన పర్వాల్లో ఎంతో పరమార్థతత్త్వం ప్రాముఖ్యత ఉంది. భారతీయ జాతి సంస్కృతిసంప్రదాయాలకు ప్రతీకలై విలసిల్లేవే మనపండగలు. అలాంటి పండుగల్లో ప్రకృతికి సంబంధించిందే ఉగాది.

## ఉగాది ఎప్పుడు వస్తుంది..?

ప్రకృతిపరంగా ఆలోచిస్తే శిశిరఋతువులో చెట్లన్నీ ఆకులు రాలుస్తాయి. వసంతఋతువు రాగానే ఎండినమోడులు సైతం చిగిర్చి, పుష్పించి నవనవోన్మేషంగా విలసిల్లుతాయి. ఇందులో దాగిన పరమార్థమేమిటంటే...! సకల రుగ్మతలతో బాధపడి నిరాశానిస్పృహలకు లోనయ్యే జీవుడు వసంతాగమనంతో సంతోషం, ఆనందమనే చిగుళ్ళు తొడుక్కుని హాయిగా విరాజిల్లుతూ, సకలరుగ్మతల్ని విస్మరించి, భవిష్యదాశలపై దృష్టిని సారించి ముందుకు నడుస్తాడు. అలా ధర్మమార్గంలో నడిచే నడకకే ఉగాది అనిపేరు.

ఈ 'యుగ' శబ్దానికి దేవుడు, వేదము, రథము, బండికాడి అనే అర్థాలుండటంవల్ల సహజంగా వివాహ సమయంలో లగ్నంకాగానే వెంటనే వివాహప్రక్రియయుగం (బండికాడి)లో ప్రారంభమవుతుంది. వరుడు వధువు తలమీద యుగాన్ని (బండికాడి) ఉంచి ఆ కాడి రంధ్రాలద్వారా ఆవుపాలతో అభిషేకించి ఆమెను పవిత్రురాల్ని చేస్తాడు.

ఈ యుగం (బండికాడి)లో ఉన్న రెండురంధ్రాలు ఆది కామాలని విజ్ఞులు వివరిస్తున్నారు కదా! లగ్నసమయంలో వరుడు– "ధర్మే చ, అర్థే చ, కామే చ, మోక్షే చ– నాతిచరామి, నాతిచరితవ్యా"– అని అంటాడు. అంటే ధర్మార్థకామమోక్షాలను నేనతిక్రమించను. నీవతిక్రమించకు అని ప్రమాణం చేస్తాడు. దీనికి గుర్తుగానే యుగం(బండికాడి) యొక్క రెండుకొనలనుంచి గోక్షీరధారలతో వధువును అభిషేకిస్తున్నాడు. ధర్మబద్ధమైన అర్థ కామాలు వర్షించుగాక! అనే పరమార్థతత్త్వానికి ఇది ప్రతీక.

ఈ విధంగా ధర్మార్థకామాలను వర్షించు దైవస్వరూప మైనయుగంతో ప్రారంభమైంది కాబట్టే వివాహం ఇంత మంగళ ప్రదమైంది మన హిందువులకు. ఈ యుగారంభమే వివాహానికి యుగాది– ఉగాది అయ్యిందన్నమాట!

వేపపూతపచ్చడిని సేవించడంవల్ల సర్వారిష్టాలు తొలగి సర్వసంపదలు కలిగించే అదృష్టం పెరిగి, దీర్ఘాయువు, వజ్రం లాంటి దేహదారుఢ్యం, శాంతి కలుగుతాయి. అయితే ఈ వేపపూవు షడ్రుచులతో కలిపి ఉగాదిపచ్చడిగా సేవిస్తారు. దీని అంతరార్థం జీవితంలో వచ్చే ఒడుదుడుకులు, ఆటుపోట్లు, సుఖ దుఃఖాలను ఎదుర్కొనే స్థైర్యంకొరకు ఈ ఉగాదిపచ్చడిని సేవిస్తారు. ఇది త్రిగుణాత్మకగుణాలను సమంచేసి తాత్త్విక దృష్టికి ప్రతీకగా షడ్రుచుల ఉగాదిపచ్చడిని సేవించాలి. అందుకే ధర్మసింధువు ఇలా చెప్పింది.

నూతనసంవత్సర(ఉగాది) ప్రారంభంరోజున ప్రతి ఇంటికి తోరణాలు కట్టి వేపపూత కల్గిన ఉగాదిపచ్చడిని సేవించి, సంవత్సరఫలం (పంచాంగశ్రవణం) వినాలి. ఆ తర్వాత



ఉగాదినుండి నవమివరకు శ్రీరామనవరాత్రులు జరపాలి. తర్వాత పంచాంగశ్రవణం చేసినవారికి సూర్యభగవానుడు శౌర్యాన్ని, చంద్రుడు ఇంద్రసమానమైన వైభవాన్ని, కుజుడు శుభాన్ని, బుధుడు బుద్ధిని, శుకుడు సుఖాన్ని, శని ఐశ్వర్యాన్ని, రాహువు బాహుబలాన్ని, కేతువు వంశాభివృద్ధిని కలుగజేస్తారని శాస్త్రప్రమాణవచనం.



పంచాంగశ్రవణం ఉగాదిరోజునే చేయాలి. అలా చేస్తే శుభప్రదం, శత్రుసంహారం, గంగాస్నానపుణ్యప్రదం, ఆయు ర్దాయకం, అనేక కర్మలసుసాధనం అని జ్యోతిషశాస్త్రవేత్తలు ఘోషిస్తున్నారు.

## 2024, మే నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | మే డే, నర్మదానది పుష్కరప్రారంభం |
| 10 | పరశురామజయంతి, అక్షయతృతీయ |
| 12 | శ్రీరామానుజజయంతి, శ్రీ శంకరజయంతి |
| 13 | శ్రీరామజయంతి |
| 14 | తిరుపతి గంగజాతర |
| 16-24 | తిరుపతి, శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం |
| 21-23 | తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి వసంతోత్సవం |
| 21-29 | హృషీకేశ్, నారాయణవనం- శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామివార్ల బ్రహ్మోత్సవాలు |
| 22 | శ్రీనృసింహజయంతి, తరిగొండవెంగమాంబజయంతి |
| 23 | శ్రీఅన్నమాచార్యజయంతి, శ్రీకూర్మజయంతి |
| 29నుండి జూన్ 06వరకు | కార్వేటినగరం, శ్రీవేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవం |



ఎవడు తండ్రివలె విశ్వసింపదగినవాడో వాడే మిత్రుడు



# పట్టాభిషేకం

- డా॥ ఎన్.సి.హెచ్.సుధామైథిలి, 82475 78748

ఒక రాజు, రాణి లేదా ఇతర సార్వభౌమాధికారికి రాజ్యాన్ని అప్పగించేటప్పుడు జరిగే వేడుక కార్యక్రమాన్ని పట్టాభిషేకం అంటారు.

పట్టాభిషేకం అనగా మహారాజు తన పెద్ద కుమారునికి (యువరాజు) రాజ్యనిర్వహణ బాధ్యతలను అప్పగించడం. దీనికి చిహ్నంగా రాజమకుటాన్ని అలంకరింపజేయడం, సింహాసనం అధిరోహించడం, ఖడ్గాన్ని బహూకరించడం మొదలైనవి ఘనంగా జరిపిస్తారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని పట్టాభిషేకం అంటారు. ఈ పదం సాధారణంగా భౌతికకిరీటాన్ని మాత్రమే కాకుండా, కిరీట ప్రదానం చేసే చర్య జరిగే మొత్తం వేడుకను సూచిస్తుంది. రాజ్యాధికారంతోపాటు రాజలాంఛనాలప్రకారం ఇతరవస్తువులను ప్రదర్శించడంతోపాటు, అధికారశక్తితో ఒక చక్రవర్తి అధికారికసమూహాన్ని సూచిస్తుంది. కిరీటం పక్కన పెడితే, పట్టాభిషేకవేడుకలో రాజు ప్రత్యేకప్రమాణాలు చేయడం, చక్రవర్తికి రాజ్యాధికారం అప్పగించడం. సైన్యప్రదర్శన, కొత్త పాలకుడు ప్రజలచే కొనియాడబడడం ఇతర కర్మపనుల పనితీరు వంటి అనేక ఆచారాలు ఉండవచ్చు. ఇది ఒక్కోదేశంలో ఆ దేశ సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలుబట్టి మారుతుంటాయి.

పట్టాభిషేకం అనగానే మనకు గుర్తుకు వచ్చేది.. ఆదర్శ పురుషుడు, సుగుణాభిరాముడు శ్రీరామచంద్రుని పట్టాభిషేకమే.

పద్నాలుగేళ్ల అరణ్యవాసం ముగించుకుని రాముడు తిరిగి వస్తున్నాడన్న విషయం తెలుసుకున్న అయోధ్యవాసులు పరుగుపరుగున నందిగ్రామానికి వచ్చారు. రాముడు పుష్పక విమానంనుంచి క్రిందికి దిగగానే భరతుడు పరిగెత్తుకుంటూ వెళ్ళి అన్నగారి పాదాలకి పాదుకలు తొడిగాడు. నువ్వు నాకు రాజ్యాన్ని ఎలా ఇచ్చావో, అలాగే ఆ రాజ్యాన్ని తీసుకొచ్చి నీ పాదాల దగ్గర పెట్టేస్తున్నాను అన్నాడు. భరతుడి మాటలకి సంతోషించిన రాముడు తిరిగి రాజ్యాన్ని స్వీకరించడానికి అంగీకరించాడు. రాముడి పట్టాభిషేకానికి నాలుగు సముద్రజలాలు, ఐదువందల నదుల జలాలని వానరాలు తీసుకొచ్చాయి. వానరాలు తీసుకొచ్చిన ఆ జలాలని రాముడి మీద పోసి కిరీటాన్ని తీసుకొచ్చి రాముడిశిరస్సున అలంకరించారు. ఇంద్రుడు నూరుబంగారుపూసలమాలని రాముడికి బహూకరించాడు.

ధర్మాత్ముడైన రాముడి పాలనలో ప్రజలకు దొంగల భయం, శత్రుభయం లేదు. నెలకి మూడువానలు పడుతుండేవి. భూమి సస్యశ్యామలంగా పంటలని ఇచ్చేది. చెట్లన్నీ ఫలపుష్పాలతో నిండిపోయి ఉండేవి. అందరూ సంతోషంగా ఉండేవారు. అందుకే ఇన్నేళ్లు గడిచినా ప్రజలు ఇప్పటికీ రామరాజ్యం కావాలనే కోరుకుంటారు.



**12-04-2024 నుండి 20-04-2024 వరకు వాయల్పాడు, శ్రీపట్టాభిరామస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా...**

అటువంటి పట్టాభిరాముణ్ణి మనమందరం ఆనాడు దర్శించుకోలేకపోయినా, భక్తవరదుడైన రాముడు మనలను అనుగ్రహించడానికై వాయల్పాడుక్షేత్రంలో అవతరించారు.

**క్షేత్రవైశిష్ట్యం-** పూర్వం వాల్మీకిమహర్షి ఇక్కడ నూరుకొప్పుల కొండదరిలో ఆశ్రమం నిర్మించుకొని తపం ఆచరించాడని ప్రతీతి. అందుకే ఆ గ్రామానికి వాల్మీకిపురం అని పేరుకూడా ఉంది.

వాల్మీకిపురం(వాయల్పాడు) ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోని అన్నమయ్యజిల్లాలోని ఒక పట్టణం. ఇది మండల ప్రధాన కార్యాలయం. ఈ పట్టణం త్రేతాయుగంలో జాంబవంతునిచే నిర్మించబడిన "శ్రీపట్టాభిరామదేవాలయం"గా ప్రసిద్ధి చెందింది. త్రేతాయుగంలో శ్రీరామునిపట్ల తనకున్న గౌరవానికి గుర్తుగా జాంబవంతుడు కోదండరామాలయం నిర్మించాడు. ఈ ఆలయం ప్రత్యేకత ఏంటంటే శ్రీరాముడు పట్టాభిషేకభంగిమలో సీతాదేవి మరియు లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు మరియు ఆంజనేయుడు కూడా అధిష్ఠించినదేవతగా కనిపిస్తాడు. ఇక్కడ శ్రీరాముడు ఖడ్గం పట్టుకుని ఉండటంవల్ల 'ప్రతాపరాముడు' అనికూడా పిలుస్తారు. ఇక్కడ వీరభద్రునిగుడితో కూడిన 'వీరన్నకొండ' అనే కొండ కూడా ఉంది. వాల్మీకిమహర్షి రామాయణం వ్రాసేటప్పుడు ఈ కొండపై కూర్చున్నాడని చెబుతారు. ఈ ఆలయవిగ్రహం మరొక ప్రత్యేకత ఉత్తరాభిముఖంగా ఉంటుంది మరియు ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాభిముఖంగా ఉన్న ఏకైక ఆలయం ఇదేనని స్థానికులు చెబుతారు. తాళ్లపాక అన్నమాచార్యులు ఇక్కడి పట్టాభిరాముణ్ణి స్తుతిస్తూ 21 సంకీర్తనలు రచించారు. కోదండరామస్వామి దేవాలయం 500సంవత్సరాల చరిత్ర కలిగి ఉంది. ఈ ఆలయం కృష్ణదేవరాయలకాలం మరియు చోళులకాలంలో వెలుగొందింది. 1999లో, తిరుమలతిరుపతిదేవస్థానం దత్తత తీసుకున్ననాటినుంచి ఈ ఆలయం మరింత ప్రాభవాన్ని పొందింది.

ప్రధాన ఆలయం పట్టాభిరామాలయంలోకి ప్రవేశిస్తే వరుసగా మహామంటపం, ముఖమంటపం, అంతరాలయం, గర్భగుడి వస్తాయి. ఆలయంలో విజయనగరసామ్రాజ్య, చోళరాజ్య శిల్పకళాచాతుర్యం తేటతెల్లమౌతాయి. మహామంటపం పైకప్పుపై పద్మం ఉంటుంది. వీరాంజనేయస్వామివిగ్రహం పశ్చిమంవైపుగా ప్రతిష్ఠించబడి ఉంటుంది.

**దేవతామూర్తులు-** శ్రీరాముడు ప్రధానదైవం. స్వామికి కుడివైపు సీత, వామభాగంలో ధనుర్బాణాలతో లక్ష్మణుడు ఉంటారు. వింజామరతో భరతశత్రుఘ్నులు ఉంటారు. శ్రీరామచంద్రమూర్తి ఒకేమాట, ఒకేబాణం, ఒకేపత్ని అని తనవ్రతాన్ని చాటుతున్నట్లు కుడిచూపుడువేలు పైకెత్తి సూచీముఖహస్తముద్రతో, శంఖుముద్రతో, సంహారముద్రతో కనిపిస్తాడు. సాధారణంగా సీతమ్మ



తల్లి స్వామికి వామభాగంలో ఉంటుంది. కాని ఇక్కడ కుడివైపు ఉండడం విశేషం. సీతారామభరతశత్రుఘ్నులు ప్రత్యేక విగ్రహాలైతే ఆంజనేయస్వామివారు ముఖమంటపంలో ప్రత్యేకమూర్తిగా ఉంటారు. జాంబవంతుడు సీతారామచంద్రులను శ్రీరామ పట్టాభిషేకసమయంలో ఈ విధంగానే దర్శనం చేసుకొన్నారని చెబుతారు. పట్టాభిరామాలయానికి పశ్చిమదిశలో దక్షిణ ముఖంగా శ్రీరంగనాథునిఆలయం ఉంది. రంగనాథుడు శ్రీదేవి, భూదేవిసమేతుడై, శయనమూర్తుడై ఉంటాడు. విఠలేశ్వరుడు ఆలయానికి వెలుపల పశ్చిమముఖంగా ఉంటాడు. పుష్కరిణి తూర్పుదిక్కున కొద్దిదూరంలోనే ఉంది. ఇక్కడే స్వామి తెప్పోత్సవాలు జరుగుతాయి.

**పండుగలు విశేషాలు:** శ్రీరామ జన్మనక్షత్రమైన ప్రతి పునర్వసు నక్షత్రంరోజున సీతారామకల్యాణం జరుపుతారు. ప్రతి శనివారం ఏకాదశినాడు అభిషేకోత్సవం జరుగుతుంది. ఇటువంటి అద్భుతమైన విశేషాలు కలిగిన ఈ క్షేత్రాన్ని దర్శించి, శ్రీరామచంద్రుని అనుగ్రహానికి పాత్రులమవుదాం. జన్మను తరింపచేసుకుందాం.



ఎప్పుడూ శాంతంగా, ప్రసన్నంగా ఉండటమే గొప్పలక్షణం

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా|| ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

ఇట్లు గోవిందరాజస్వామి అధ్యయనోత్సవమును స్వీకరించిన తరువాత ఒకదినమున (అనంతగరుడాది) నిత్యసూరులతోడను పరాంకుశ పరకాలాది ముక్తులతోడను ఆళ్వారుతీర్థమునకు విజయముచేసి, అచ్చట అభిషేకము చేయించుకొని పూర్ణమగు ఆరగింపైనతరువాత వినియోగమైనపిమ్మట సమస్త పరిజనములతోడను నిత్యముక్తులతోడను మరలి దేవాలయమునకు విజయము చేయునట్లొనర్చవలెనని మునుపటి పెద్దలు నియమమును కల్పించిరి.

శ్రీగోవిందరాజస్వామి చిన్న అధ్యయనోత్సవము (పగల్ పత్తు)లోని నాలుగవదినమున రాత్రి 'విణ్ణీలమేలాప్పు' ఆకర్ణించునపుడు, ఆళ్వారులతోడను, ఆచార్యులతోడను, ఆళ్వారు శ్రీపుత్రికను (గోదాదేవిని) గోవిందరాజస్వామితోడ సింహాసనముపై ఒక్కచోట చేర్చి విజయము చేయింపవలెనని పెద్దల నియమనము.

ఈ తీరుగ గోవిందరాజస్వామి చాలకాలము భగవద్రామానుజుల ఏర్పాటుప్రకారమే అధ్యయనోత్సవము స్వీకరించుచుండిరి. ఇట్లు కొంతకాలము గడవగ అప్పటి పెద్దలు ఇట్టి ఉత్సవమున ఏదైన నొక విశేషముండవలెనని తలచి, మునుపటివలె గోవిందరాజస్వామి అధ్యయనోత్సవము ముగిసిన తరువాత నిత్యముక్తులతోబాటు ఆళ్వార్‌తీర్థమునకు వేంచేసి మరలి శ్రీవీథిప్రదక్షిణముగా విజయముచేసి శ్రీగోపురము వాకిట గోవర్ధనోత్సవ శ్రీమండపమునునుండగ నిత్యముక్తులు, ఆళ్వారులు, ఆచార్యులును స్వామివారికి ఇరుప్రక్కలను సేవించుచు నిలచియుండగ అప్పుడు వీరికి దివ్యమాలిక, శ్రీశఠకోపము మొదలగు మర్యాదలు ప్రసాదించినతరువాత ప్రబంధగాయకులు ఆళ్వారుల, ఆచార్యుల విషయమున ఒక్కొక్క తనియ(ప్రశస్తిగీతము)ను, వారు ప్రసాదించిన ప్రబంధములనుండి మొదటి గీతములను అనుసంధించునట్లుగను, కట్టియమును (ప్రశస్తి ప్రబంధమును) విన్నవించువారు ఆళ్వారుల ఆచార్యుల విషయమైన ఒక్కొక్కశ్లోకమును అనుసంధించి సెలవు పుచ్చుకొనవలెనని కట్టడి ఏర్పరచిరి.

### వీడ్కోలుక్రమము - గీతములవరుస - శ్లోకములక్రమము

మొట్టమొదట శ్రీమన్నాథమునులకు శేషాంశుకమును, శ్రీమాలను శ్రీశఠకోపమును ప్రసాదించి వారితోడ ప్రబంధగాయకులకును ప్రసాదించిన తరువాత, ప్రబంధగాయకులు శ్రీశఠకోపమును, శ్రీమాలికను... శేషాంశుకమును బంగారు తట్టలో పెట్టి తలపై నిడుకొనియుండగ అప్పుడు నిత్యముక్తులెల్లరకు క్రమరీతిగ అర్చకులు శ్రీశఠకోపము మున్నగువానిని ప్రసాదించినతరువాత ప్రబంధగాయకులు నిత్యముక్తవిషయకమైనవారి ప్రశస్తిగీతములను మొదట అనుసంధించి వారు గానము చేసిన ప్రథమప్రబంధములందలి మొదటిగీతమును దేవగానపద్ధతిలో అనుసంధింపగా అప్పుడు కట్టియము విన్నవించువారు నిత్యముక్తులకందరికిని క్రమముచొప్పున తత్తద్విషయకములగు శ్లోకములను అనుసంధించి వీడ్కోలుప, అంతట ఎల్లరును వీడ్కోలు పొంది, కృతార్థులై తమ తమ కోవెలలకు విజయము చేయుదురు. *(ఇంకా ఉంది)*

భగవద్గీత సందేశం

# ఆనందం

- శ్రీ నీలంరాజు రాధాకృష్ణమూర్తి,
99638 03015

సర్వజీవుల్లోనూ పరమాత్మను చూస్తూ, అలాగే నేను, నాది అనే భావాలు ఎవరికి అర్థరహితాలో, అతడే బ్రహ్మజ్ఞాని ఔతాడు. అలాంటివానిలో భగవత్సుఖమెంత అధికమైతే అతనిలో అంతంత తేజస్సు పెరుగుతూ ఉంటుంది. విజ్ఞానయోగంలో శ్రీకృష్ణుడు ఈ విధంగా చెప్పాడు.

చతుర్విధా భజన్తే మాం జనాస్సుకృతినోఽర్జున।
ఆర్తో, జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ॥ (7–16)

అనగా ఆర్తుడు, జిజ్ఞాసువు, ధనార్తి, జ్ఞాని అనే నాలుగురకాలవారు పరమాత్ముని ఆనందంతో ఆశ్రయిస్తారు. ఆర్తితో గజేంద్రుడు, జిజ్ఞాసతో పరీక్షిత్తు, ఉద్ధవుడు; అర్థార్థితో సుగ్రీవుడు, జ్ఞానులుగా శుక, సనక, నారద, భీష్మ, ప్రహ్లాదులు తమజీవితాల్లో పరమార్థాన్ని సాధించారు.




ఎవరివల్ల ఈ సర్వజగత్తు అభిన్నమైనదో అట్టి మంగళదాతయైన శ్రీమన్నారాయణునిగురించి వారందరూ తెలుసుకున్నారు.

మన ధ్యాస, ధ్యానం, తపస్సు అన్నీ ఆ పరమాత్ముని చేరుకోగల ఆనందంకోసమే జరగాలి. కష్టనష్టాలు, సుఖదుఃఖాలు ఐహికమైనవి కావున, ఇవేవి మనిషికి పరమార్థాన్ని ఇవ్వవు. మానవునికి కావలసినవి సత్యం, శౌచం, దయ, ధైర్యం, మౌనం, బుద్ధి, సిగ్గు, క్షమ, యశస్సు మరియు ఇంద్రియనిగ్రహం మొదలైనవి ఉత్తమగుణాలు. వీటితో పరమాత్ముని వెదుకుటలో గల ఆనందం భక్తునికిగల నిజమైన లక్ష్యం కావాలి. కేవలం దేవాది దేవుడే నిత్యుడు మరియు చేతనుడు. ఆయన ధ్యానంవల్ల జీవిత పరమార్థమేమిటో తెలుసుకోవాలి. అలాంటి జగదీశ్వరుడు జగత్తును లయబద్ధంగా నిర్వహించే కాలరూపుడు. ప్రతిక్షణంలో, ప్రతి మాసంలో, ప్రతిఋతువులో, ప్రతిసంవత్సరంలో అనేకప్రత్యేకతలను సృష్టించి మనకందించాడు. కనుక, అట్టి దేవదేవునికి నమస్కరించి మమ్ములను ధన్యులుగా చేయమని కోరుకోవాలి.

ఆనందం ఎక్కడో ఉండదు. అది ప్రతిమనిషిలోను ఉంటుంది. ఎప్పుడూ సంతృప్తి, విజ్ఞతను మనిషి అలవర్చుకుంటే అంతకన్నా ఆనందం మరేం కావాలి? లభించినంతలో సంతృప్తిగా ఉండేవారు పొందే ఆనందం వర్ణనాతీతం. మనిషి తృప్తితో ఉండే ఆనందమే బ్రహ్మానందం. మనకు లభించిన దైవానుగ్రహమే ఒక పరమానందం. అరిషడ్వర్గాలనగా కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే శత్రువులను దగ్గరికి రాకుండా చూసుకుంటే, అన్నీ మంచివేననిపిస్తాయి. మనమంతా ఆనందాన్నే చూడవచ్చు.

మనిషి ప్రతీక్షణం కోరుకొనేది ఆనందమే! అమ్మప్రేమలో ఆనందం ఉంటుంది. మనల్ని కన్న తల్లిదండ్రులే ప్రత్యక్ష భగవత్ స్వరూపాలుగా భావించి వారికి ఎలాంటి కష్టం కలుగకుండా చూచు కుంటే చాలు. అదే ప్రత్యక్ష ఆనందం. చిత్తశుద్ధితో ఇతరులకు మేలు చేయాలనుకోవడం, దేవాలయానికి వెళ్లి భగవంతుని మంచి మనస్సుతో ధ్యానించుకోవడం, ఇవ్వన్నీ అనుక్షణమూ ఆనందా న్నిచ్చేవే. ఆనందం మనలో మనచుట్టూ ఉన్న ప్రపంచంలోనే ఉంది. మరెక్కడో లేదు సుమా!

సర్వప్రాణుల్లో శ్రేష్ఠుడైన మనిషి నీతికోవిదుడిగా జీవించి సత్‌పురుషులసాంగత్యంలో సంస్కారాన్ని నేర్చుకొని, తమ జీవితాలకి ఉజ్జ్వలమైన శోభను చేకూర్చుకోవాలి.

108 దివ్యదేశాలు

# తిరుక్కావళంబాడి

## (తిరునాంగూర్)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

తిరుమంగైఆళ్వారులచేత మంగళాశాసనం చేసినటువంటి దివ్యదేశాల్లో తిరునాంగూర్ అని ప్రసిద్ధిచెందిన కొన్ని దివ్య దేశాలు పక్కపక్కనే వెలసిల్లి ఉన్నాయి. దాదాపు 11 దివ్యదేశాలు ఇందులో ఇమిడిఉన్నాయి. దీనికొక ఐతిహ్యం క్షేత్రమాహాత్మ్యంలో కనిపిస్తుంది.

దక్షప్రజాపతి తానుచేసిన యాగానికి పార్వతీపరమే శ్వరులను పిలవక అవమానించాడు. ఈ విషయాన్ని ఉమా మహేశ్వరులు దక్షప్రజాపతిని అడగ్గా తిరిగి వాళ్ళని అవమా నించాడు. పార్వతీదేవి ఆ అవమానాన్ని భరించలేక ఆ హోమాగ్నిలో తనను దహించుకున్నది. ఈ దుష్కర్మను చూసి పరమశివుడు దక్షప్రజాపతి యాగశాలలో 11సార్లు రుద్ర తాండవాన్ని చేశాడు. ఆ సమయంలో 11సార్లు శివుని జటాజూటం భూమిని స్పృశించి 11 (పదకొండు) రూపాల్లో శివుడు కన్పించగా అందరూకూడా రుద్రతాండవం చేశారు. దీనిని చూసి భయపడి అందరూ శ్రీమన్నారాయణుని శరణాగతి చేయగా లక్ష్మీవల్లభుడు 11దివ్యక్షేత్రాల్లో వేంచేసి పదకొండు రూపాల్లో ఉన్న పరమశివుణ్ణి ఒకేమూర్తిగా కనిపింపజేసి



దాక్షాయణి అయిన పార్వతిని తిరిగి పునర్జీవనం చేశాడు. పరమశివుడు శ్రీమన్నారాయణునియందు 11దివ్యక్షేత్రాల్లో తమరు ఇలాగే వేంచేసి భక్తులను అనుగ్రహించాలని ప్రార్థించగా శ్రియఃపతి పార్వతీశుని ప్రార్థనను అంగీకరించి ఇలా దివ్య క్షేత్రాల్లో వేంచేసి భక్తులను అనుగ్రహిస్తున్నాడు. అదే తిరు నాంగూర్ దివ్యదేశములుగా ప్రసిద్ధిగాంచినది.

అట్టి దివ్యదేశాల్లో ద్వారకకు సమానంగా నందన వనానికి సదృశంగా అద్భుతమైనటువంటి ప్రకృతిరామణీయ కతతో శోభిల్లుతున్నటువంటి దివ్యదేశమే తిరుక్కావళంబాడి. మూలమూర్తి గోపాలకృష్ణుడిగా రుక్మిణీసత్యభామాసమేతుడై తూర్పుదిక్కున నిలుచున్నభంగిమలో భక్తులను అనుగ్రహిస్తు న్నాడు. ఉత్సవమూర్తి రాజగోపాలన్‌స్వామి, అమ్మవారు మడ వలర్‌మంగై, శంకమలనాట్యార్, రుక్మిణీసత్యభామ అనేపేర్లతో పిలువబడుతున్నారు. హేమాబ్జపుష్కరిణితీర్థం, స్వయంభూ విమానం, వేదామోదవిమానం, రుద్రుడు, విష్వక్సేనుడు, దేవతలు మొదలగువారికి ప్రత్యక్షం. పురాణానుసారం పారిజాతం స్థల వృక్షంగా ఉన్నది.

### స్థలపురాణం

శ్రీకృష్ణపరమాత్మ మరియు సత్యభామకు జన్మించినటు వంటి కుమారుడైన నరకాసురుడు భూలోకవాసులని భయ పెడుతూ, అలాగే దేవలోకవాసులను భయపెడుతూ అన్నింటిని తన వశం చేసుకున్నాడు. ఇలా దేవలోకాన్ని నరకాసురుడు వశం చేసుకోగా దేవేంద్రుడు శ్రీమన్నారాయణుణ్ణి మిగతా దేవతలతోపాటు వెళ్ళి నరకాసురునిబారినుండి మమ్మల్ని రక్షించి దేవలోకాన్ని తిరిగి తమవశం చేయాలని ప్రార్థించాడు. ఇంద్రుని (దేవేంద్రుని) ప్రార్థనతో శ్రీకృష్ణుడు సత్యభామతో వెళ్ళి నరకాసురునితో యుద్ధం చేసి అతణ్ణి సంహరించి, దేవలోకాన్ని



తిరిగి ఇంద్రునికి అనుగ్రహించాడు. యుద్ధం తరువాత ఇంద్రుడు కృతజ్ఞతాపూర్వకంగా భగవంతునికి నమస్కరించాడు. అక్కడ అందమైన పారిజాతవృక్షాన్ని చూసి సత్యభామ ఆశపడి శ్రీకృష్ణునికి తెలిపింది. పారిజాతవృక్షాన్ని ద్వారకకు తీసుకుని వెళ్ళడానికి ఇంద్రుణ్ణి కోరాడు. దేవేంద్రుడు దాన్ని నిరాకరించాడు. శ్రీకృష్ణుడు ఇంద్రునితో యుద్ధం చేశాడు. నందనందనుడు ఆ యుద్ధంలో గెలిచి పారిజాతవృక్షాన్ని ద్వారకకు తీసుకునివెళ్ళడం జరిగింది. ఈ అద్భుతవృత్తాంతాన్ని తిరుమంగైఆళ్వారులు పెరియతిరుమొళి అనే దివ్యప్రబంధంలో నాలుగవ శతకంలో ఐదవదశకంలో వర్ణించిఉన్నారు. సాక్షాత్తు ద్వారకాధీశుడుగా శ్రీమన్నారాయణుడు ఈ కావళంబాడిక్షేత్రంలో విలసిల్లి ఉన్నాడని ఒకవిశేషం.

మరియొక ప్రత్యేకతేంటంటే రుక్మిణీ సత్యభామలకి పారిజాతవిషయంలో చిన్న గొడవ ఏర్పడగా ఈక్షేత్రంలోనే వసుదేవసుతుడు వారిరువురిని సమాధానపరచాడని ఒకకథ.

హరిమిత్రుడనే భక్తుడు మోక్షాన్ని ఉద్దేశించి ఈ క్షేత్రం లోనే తపస్సు చేశాడు. తపస్సుకు మెచ్చిన దేవకీతనయుడైన కృష్ణుడు రుక్మిణీ సత్యభామాసమేతంగా గోవులను మేపేటటువంటి కర్రను ధరించి ఉన్నట్లు దర్శనాన్ని ఇచ్చి అతణ్ణి అనుగ్రహించాడు. అలాగే విష్వక్సేనులవారికికూడా రాజగోపాలస్వామిగా ఈ క్షేత్రంలో దర్శనాన్ని కలిగించాడు. ఇలా ఎన్నో విషయవిశేషాలతో ఈ క్షేత్రం విరాజిల్లుతోంది. తిరుమంగై ఆళ్వారులు విశేషంగా ఈ క్షేత్రాన్ని, క్షేత్రాధీశున్నికూడా వర్ణించి ఉన్నారు. పాంచరాత్రాగమోక్తంగా సకలపూజాదికార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. భక్తులు ఈ గోపాలకృష్ణుణ్ణి సేవించుకొన్నయెడల సకలసౌభాగ్యాలు కలుగుతాయని ఆర్యోక్తి.

**ప్రఖ్యాతే శివగీతనామని పురే శ్రీకృష్ణదేవః ప్రభుః**
**తద్దేవీ మృగచాపకాంతనయనా హేమాబ్జరాజత్కరః ।**
**వేదామోద విమాన రాజనిలయః పూర్వాబ్ధి సేవీక్షణః**
**సాన్నిధ్యం కృతవాన్ సుదర్శనగణైః సాకం భవానీపతేః॥**

# శ్రీకృష్ణామృతం..

**హేకృష్ణ మాధవ నగుమోము మదిమెదల**
**నోరార నుతిసేతు నన్నుకావూ॥**

**నడిరాత్రివేళలో భీతిలిన పాపని**
**అక్కునచేర్చేటి తల్లివినీవూ॥**

**తుంటరిబాలుని తెంపరితనమంతా**
**తీర్చేటితండ్రివే నాకూనీవూ॥**

**దిక్కుతోచనివేళ దన్నుగా నిలబడి**
**ధైర్యమునొసగేటి బంధువునీవూ॥**



**తెరిపెరుగని తలపులతో తిరుగాడే మనసుకు**
**స్వాంతనకూర్చేటి సఖుడవునీవూ॥**

**తల్లీవీతండ్రివీ బంధువువూ సఖుడవూ**
**ప్రభువువూ ఏలికవూ నాకూనీవూ॥**

**ప్రతిఘడియ విడువకనే అణువణువూ తానిండి(నుండి)**
**చైతన్యమౌ శ్వాసే నాకూనీవూ॥**

**మధురతేనెల రుచిమఱగిన తుమ్మెద**
**వనమువీడనితీరు నాకూనీవూ॥**

**హే కృష్ణ మాధవ పదములు పట్టితి**
**ననువీడి వెడలకు నన్నుకావూ॥**

***–'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు, 99103 10594***



స్త్రీని గౌరవించేవాడే ఇతరుల చేత గౌరవించబడతాడు

తిరుమలలో 16-02-2024న **రథసప్తమిపండుగ** సందర్భంగా
శ్రీవారికి జరిగిన **సప్తవాహనసేవల వైభవోత్సవ దృశ్యాలు.**



తిరుమల తిరుపతి దేవస్థానములు



తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారికి
01-03-2024నుండి 10-03-2024వరకు వైభవంగా జరిగిన
వార్షిక బ్రహ్మోత్సవాల దృశ్యమాలిక.










## తిరుమల తిరుపతి దేవస్థానములు



**శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారికి 29-02-2024నుండి 08-03-2024వరకు వైభవంగా జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాల దృశ్యమాలిక.**





















తిరుపతి, శ్రీ గోవిందరాజస్వామివారికి 17-02-2024 నుండి 23-02-2024వరకు
జరిగిన కమనీయ తెప్పోత్సవం



తిరుమలలో
09-02-2024 న జరిగిన
శ్రీపురందరదాసులవారి ఆరాధనోత్సవం



తిరుపతి, శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా
09-03-2024 న వైభవంగా జరిగిన
శివపార్వతుల కమనీయ కల్యాణోత్సవం



శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవవాల సందర్భంగా
శ్రీ జ్ఞానప్రసూనాంబ, శ్రీకాళహస్తీశ్వరస్వామివారి
కల్యాణోత్సవం సందర్భంగా 10-03-2024న
తి.తి.దే. వారి తరపున పట్టువస్త్రాలు సమర్పించిన
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.



శ్రీశైలంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామివారి
బ్రహ్మోత్సవాల సందర్భంగా 04-03-2024న
తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి తరపున
పట్టువస్త్రాలు సమర్పించిన తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.



# తాళ్లపాక అన్నమయ్యకు- శ్రీనివాస సాక్షాత్కారం

- డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ,
98662 34482

భక్తిసామ్రాజ్యం అపార రత్నాకరంలాంటిది. ఇష్టదైవ సాక్షాత్కారంకోసం, అనుగ్రహాదులకోసం తపించే భక్తుల వైఖరులుకూడా భిన్నమే. జపం కొందరికి ఫలసిద్ధిమార్గం కావచ్చు. మరి కొందరికి అరణ్యవాసం, తపం, యోగం మార్గదర్శకత్వం కావచ్చు. కాని కలి యుగంలో నామస్మరణ, ధ్యానం- దైవాను గ్రహానికి సులభోపాయమని పెద్దలే సూచించారు. అన్నిటికన్న సంగీతమార్గం కామితార్థసిద్ధికి మిన్న. ఆపాత మధురమయిన సంగీతజ్ఞుల సాధనలోను, కీర్తనల్లోను తానుంటానని, వైకుంఠవాసంకన్న సంగీత ప్రపంచం తనకు ఇష్టమని వైకుంఠనాథుడే స్పష్టం చేశాడు. కనుక వాగ్గేయకారులు భక్తి సంకీర్తనమార్గాన్నే ఎంపిక చేసుకున్నారు. అలాంటి వారికి ఇష్టదైవసాక్షాత్కారం కరతలామలకం.

వివిధరూపాలలో కనిపించే విశ్వమంతా భగవంతుని స్వరూపమే. కానీ ఆ పరమాత్మని తేజోరూపంగా హృదయంలోకానీ, చర్మచక్షువులతోకానీ చూడాలని పురాణాలు ప్రబోధిస్తున్నాయి. అదే మానవ జీవితానికి ముఖ్యప్రయోజనం. ఆ భగవత్సాక్షాత్కారానికి ముఖ్యసాధనం భక్తి. భగవంతునిపై భక్తిని పెంపొందించని కర్మ, జ్ఞానాదులు వ్యర్థములే. అందువల్ల అన్నమయ్య భక్తిహీనుని జాతి, శాస్త్రవైదుష్యం, జపం, తపం మొదలైనవి శవాలంకరణ ప్రాయమని భావించాడు.

పురాణాలను పరిశీలిస్తే ధ్రువునికి వాసుదేవనామ స్మరణే శ్రీమహావిష్ణువు సాక్షాత్కారానికి దారిచూపింది. అలాగే ప్రహ్లాదునికి మహావిష్ణువు నారసింహరూపంలో సాక్షాత్కరించాడు. వీరు బాలభక్తులు. మరి అన్నమయ్యకు వేంకటేశ్వర మంత్రమే శరణ్యమయింది. ఈ అంశాన్ని అన్నమయ్య 'అన్ని మంత్రములిందే యావహించెను' అనే కీర్తనలో వెన్నతో నాకు కలిగిందని- అన్ని దేవతల సమన్వయశక్తి శ్రీనివాసుడు కనుక, అన్ని మంత్రములమహిమ వింగడమై "వేంకటేశమంత్రం"గా నాకు జన్మసాఫల్యానికి ఉపకరించిందని స్పష్టం చేశాడు.

అన్నమయ్యకు బాల్యంలోనే 'పరమజ్ఞాన సంపద పొదలగ' తిరుమలప్పని ప్రసాదమంటేగాని ఆరగింపని పక్వస్థితి. అలాగే 'వేంకటపతి పేరు వివరించి పాడే పాట' గాని విననిదే నిదుర రాకపోకపోవడం జరిగింది. ఈ అదృష్టం అన్నమయ్య బాల్యావస్థలోని భక్తిబీజస్థితిని సువ్యక్తం చేస్తుంది. అయినా అన్నమయ్యకు శ్రీనివాససాక్షాత్కారం ఎప్పుడనడానికి ఖచ్చితమయిన తామ్రఫలకసంకీర్తనల తొలివచనాలే సాక్ష్యమిస్తున్నాయి.

తొలి రాగిరేకుల మొదట-

**"స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహనశక పరుషంబులు
౧౩౪౬ అగు నేంటి క్రోధిసంవత్సరమందు
తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదునారు
యేండ్లకు తిరువేంకటనాథుండు ప్రత్యక్షమైతేను......"**



అనే రాగిరేకుపై ఉన్న సాక్ష్యాన్నిబట్టి 16వఏట అన్నమయ్యకు స్వామి సాక్షాత్కారమయిందని స్పష్టం. ఈ వాక్యాలను సమన్వయించుకొని చారిత్రకులు అన్నమయ్య క్రీ.శ.1408లో జన్మించినట్లు, 16వఏట క్రోధి 1424సం॥నాడు స్వామి సాక్షాత్కారం అయినట్లు సమన్వయించారు. రోజుకొక్క కీర్తన తక్కువకాకుండా రచన చేసినాడనడానికి ఈ సమన్వయం బలీయం.

ఉపచారాలలో 'షోడశ'సంఖ్యకు ప్రాధాన్యం. మానవుల శారీరకదశలో 16వఏడు చాల ముఖ్యమయినది. సంస్కారాలలో షోడశసంస్కారాలున్నాయి. సంభావనలలో 16, 116, 1116లకు తగిన గౌరవముంది. జీవనంలో అన్నమయ్యకు 16వఏడు శ్రీవేంకటేశ్వరసాక్షాత్కారం అదృష్టవిశేషం కదా!

అన్నమయ్య సంకీర్తనలను నిశితంగా పరిశీలిస్తే ఆ వాగ్గేయకారునికి తిరుమలేశుడు మూడురకాలదశలలో సాక్షాత్కరించాడనడం సమంజసం. మొదటిది **స్వప్నసాక్షాత్కారం.**

స్వప్నసాక్షాత్కారానికి పెద్దలవలన విన్న అంశాలు, శ్రవణాదులవల్ల కలిగిన అనుభవైక సమన్వయం కారణం కావచ్చు.

**దృశ్యతే భగవాన్యస్య, స్వప్నే సర్వశుభావహః,**
**తస్మిన్నేవ దృఢాభక్తిః, జాయతే నాత్ర సంశయః.**

అని ఆగమములు స్వప్నంలో కనిపించిన దైవంపట్ల అనన్యభక్తి కలుగుతుందని వివరిస్తున్నాయి. అయితే అన్నమయ్యకు స్వామిసాక్షాత్కారంకంటెముందు మోకాలిమిట్టదగ్గర అలమేలుమంగఅమ్మవారి సాక్షాత్కారం లభించింది. ఆళ్వారులకు స్వామి ప్రత్యక్షమయితే 'తిరుక్కండేన్'ముందు అమ్మవారిని చూచామన్నారు. ఇప్పటికి శ్రీవైష్ణవులు అలర్మేల్ మంగమ్మను దర్శించి ఆపై స్వామిని దర్శించేవారున్నారు. అన్నమయ్య కాలినడక మార్గంలో అలసినవేళ, సొమ్మసిల్లినవేళ అలర్మేల్మంగమ్మ శ్రీవారిప్రసాదం ఇచ్చి అలసటతీర్చి నడకమార్గనియమాలు చెప్పిందని అన్నమాచార్యచరిత్ర చెబుతుంది.



ఆ సందర్భంలో అన్నమయ్య ఆశువుగా 'వేంకటేశ్వర' శతకం చెప్పాడని కథనముంది. ఆ శతకంలోనే స్వామివారి లీలావిశేషాలు వర్ణితమయ్యాయి. అంతేకాదు స్వామిని కలలో దర్శించినాడనడానికి–

**ఇప్పు డిటు కలగంటి నెల్లలోకములకు**
**నప్పఁడగు తిరువెంకటాద్రీశుఁ గంటి**

ఈ ఒక్క కీర్తన చాలు స్వప్నసాక్షాత్కారవైభవదర్శనానికి చక్కని ఉదాహరణ.

రెండవది అర్చావతారదర్శనం. అన్నమయ్య తిరుమలకు వెళ్లే యాత్రికులవలన స్వామి అంగరంగవైభోగాదులు విని ఆనందించాడు. కాని తిరుమలలోని స్వామి స్వయంభువ మూర్తి. అలాంటి అర్చామూర్తి సర్వావయవసౌందర్యవర్ణన అన్నమయ్యకీర్తనల్లో అనేకం. ప్రత్యేకించి వరదహస్తవర్ణన, శ్రీవారి పాదముల వర్ణనలున్నాయి. మచ్చుకు–

"ఇందరికినభయంబు లిచ్చు చేయి
కందువగు మంచి బంగారుచేయి...."

"బ్రహ్మకడిగిన పాదము
బ్రహ్మము దా నీ పాదము...."

అర్చావతారదర్శనంతోబాటు ఉత్సవమూర్తులకు జరిగే నిత్య, వార, మాసాది ఉత్సవవర్ణనలుకూడా స్వామి సాక్షాత్కారంలో భాగమే. అన్నమయ్య ఆలయకవి. కనుకనే తను దర్శించిన ప్రతిఉత్సవంలోను, స్వామి సాక్షాత్కార అనుభవం పొందినవాడు. వీటిలో ఆలయంలో జరిగే అభిషేకోత్సవం ప్రధానమయింది. అలాగే కళ్యాణోత్సవం, బ్రహ్మోత్సవాదులలో మలయప్పదర్శనభాగ్యం అన్నమయ్యకు దక్కింది.

'ఒకపరి నొకపరి' అన్న కీర్తనలో అన్నమయ్య దర్శనానుభూతి చదివేవారికి, పాడేవారికి, వినేవారికి దివ్యానుభవం కలిగించేది. ఇవి అర్చామూర్తి దర్శనభాగ్యస్పందనకు తగిన ఉదాహరణ.

అన్నమయ్య తన పదునారవయేట స్వామి సాక్షాత్కార వేళలో ఏ కీర్తనలు పాడారో ఖచ్చితంగా తెలియదు. కాని ఇందుకు రెండు మూడు ఉపమానాలున్నాయి. కురుక్షేత్రంలో అర్జునునికి శ్రీకృష్ణుడు విశ్వరూపుడుగా కనిపించినవేళ భయ వినయభక్తితో ఆశ్చర్యచకితుడయినట్లు అన్నమయ్యకూడా పరవశుడయి ఉండవచ్చు. సాధారణంగా స్వామి సాక్షాత్కారవేళ ప్రార్థనలో, నుతిలో సంబోధనలు దొర్లుతుంటాయి. అలాగే సేవించేది విష్ణ్వవతారాలయినా ప్రధానమయినది నారాయణాంశం. అన్నమయ్య రచించిన నారాయణకీర్తనలన్నీ అలాంటి వేళల్లో పాడబడినవని ఊహించవచ్చు-

నమో నారాయణాయ
నారాయణాయ సగుణబ్రహ్మణే సర్వ-
పారాయణాయ శోభనమూర్తయే నమో

అన్నమయ్య బాల్యంనుండి వరదుడయిన స్వామి భక్తుడు. కనుక స్వామి సాక్షాత్కరించినవేళ ఆ వరదుని సేవించిన పౌరాణికపాత్రలే గుర్తుకు వచ్చాయేమో

ధ్రువవరదా సంస్తుతవరదా
నవమైన యార్తుని నన్నుకావవా.....

అనే కీర్తనలో కరిరాజును, కాకాసురుని, విభీషణుని, అక్రూరుని, అంబరీషుని, ద్రౌపదిని, అర్జునుని పేర్కొంటూ 'ప్రహ్లాదవరదా' అనడం భక్తిపతాకను ఎత్తినట్లుగా భావించడం తప్పుకాదు.

అన్నమయ్య కలం పట్టిన కత్తి. శ్రీహరినందకఖడ్గాంశ సంభూతుడు. అన్నమయ్యకీర్తనలగానంతో తిరుమలేశ సాక్షాత్కారం సామాన్యునికైనా సుకరమే. ఎందరో పరిశోధకులదృష్టిలో అన్నమయ్య స్వామి సాక్షాత్కారదర్శనకాలంలో పాడినపాట-

కంటిఁగంటి నిలువుచక్కనిమేను దండలును
నంటుఁజూపులను జూచేనవ్వు మోముదేవుని

నిలుచున్నమూర్తిని పాదాలనుండి సేవించాలనే పెద్దల నియమంమేరకు ఈ కీర్తన రచన సాగింది. 'శరణు శరణు' లాంటి కీర్తనలుకూడా సాక్షాత్కారసమయంలో పాడినవని భావించవచ్చు-

శరణు శరణు సురేంద్రసన్నుత శరణు శ్రీసతివల్లభా
శరణు రాక్షసగర్వసంహార శరణు వేంకటనాయకా.....

ఇలా అన్నమయ్య స్వప్న, అర్చాస్వరూప, ప్రత్యక్ష భగవత్సాక్షాత్కారాలను పొందాడని ఈ క్రోధినామసంవత్సర నేపథ్యంలో స్మరించడం ముదావహం.





# పుష్పయాగం

- డా॥ యస్.పద్మావతి, 96762 69300

శ్రీవేంకటేశ్వరునికి అత్యధికపుష్పాలతో చేసే కైంకర్యం పుష్పయాగం. శ్రీనివాసమంగాపురంలో శ్రీకల్యాణవెంకటేశ్వర స్వామిగా వెలసిన వెంకన్నకు ప్రతిసంవత్సరం బ్రహ్మోత్సవాల అనంతరం ఈ పుష్పయాగం జరుగుతుంది. పదిరోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో ఏవైనా లోటుపాట్లు, దోషాలు, పొరపాట్లు ఉంటే క్షమించమని వేడుతూ పరిహారార్థంగా చేసే యాగమే పుష్పయాగం.

పుష్పయాగంరోజున ఆలయంలో రెండవ అర్చన, నైవేద్యం అనంతరం దేవేరుల సమేతంగా స్వామివారి ఉత్సవర్లను కల్యాణమండపానికి వేంచేపు చేసి స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితరద్రవ్యాలతో అభిషేకం చేస్తారు.

మధ్యాహ్నం 1గంటనుంచి సాయంత్రం 5గంటలవరకు వివిధ రకాలపుష్పాలతో, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు.

ఉభయదేవేరులసహిత శ్రీవేంకటేశ్వరునికి పాదాలనుండి హృదయందాకా తాకేవరకు పుష్పాలతో అర్చన చేస్తారు. తరువాత ధూప, దీప, నీరాజనాలు సమర్పించి పుష్పాలను తొలగిస్తారు. ఇలా పలుమార్లు పలురకాల పుష్పాలతో పుష్పకైంకర్యాలను నిర్వహిస్తారు. చివరగా పుష్పార్చన చేసి హారతి సమర్పించడంతో పుష్పయాగం పూర్తవుతుంది. ఈ పుష్పయాగ కైంకర్యంలో వివిధరకాల పుష్పాలు, పత్రులు ఉపయోగిస్తారు. వాటి విశేషాలివి:

**చామంతులు:** ప్రకాశవంతమైన పసుపుపచ్చని వర్ణంతో గుండ్రని చిన్నపళ్లెంఆకారంలో సీతమ్మవారి చూడామణిలా సొగసుగా ఉంటుంది చామంతిపువ్వు. పసుపురంగు విజయానికి సంకేతం. వీటితో స్వామిని, అమ్మవార్లను అర్చించడంవల్ల మనం చేసే మంచిపనులన్నీ సఫలమై విజయాలు కలుగుతాయి.

**గన్నేరులు:** లేతఎరుపురంగులో ఐదురేకులతో, అతిసన్నని కేసరాలతో అందంగా ఉంటుంది గన్నేరుపువ్వు. అలమేలు మంగమ్మకు ప్రీతికరమైంది. వీటితో స్వామిని, అమ్మవార్లను అర్చించటంవల్ల సంపదలు, సుఖసంతోషాలు కలుగుతాయి.









సహృదయం, కరుణ ఉన్న వ్యక్తి సమాజాన్ని జయిస్తాడు

**సన్నజాజులు:** తెలుపురంగులో సన్నగా, నాజూగ్గా, ముత్యాల్లాగా అందంగా ఉంటాయి. మంచి సువాసన కలిగి ఉంటాయి. తెలుపురంగు స్వచ్ఛతకు చిహ్నం. వీటితో స్వామిని, అమ్మవార్లను అర్చించడంవల్ల మనలోని దురాలోచనలు పోయి మనసులు స్వచ్ఛమవుతాయి. మనశ్శాంతి చేకూరుతుంది.

**మల్లెలు:** ఇవి తెలుపురంగులో ఉండి అత్యంత సువాసన వెద జల్లుతూ రసానుభూతిని కలిగిస్తాయి. వీటితో స్వామిని, అమ్మ వార్లను అర్చించడంవల్ల దాంపత్యజీవితంలో ఒడుదుడుకులు లేకుండా జీవితం సాఫీగా సాగుతుంది. సంతానంలేనివారికి సత్సంతానభాగ్యం కలుగుతుంది.

**మొల్లలు:** ఇవి తెలుపురంగులో అందంగా ఉంటాయి. ఉష్ణాన్ని తగ్గించి చలువచేసే గుణం వీటిల్లో ఉంది. అట్టి మొల్లలతో స్వామిని, అమ్మవార్లను అర్చించడంవల్ల జీవితం ప్రశాంతంగా, సంతోషంగా సాగుతుంది.

**గుండుమల్లెలు:** ఇవియును మల్లెల్లో ఒకరకం. వీటినే 'బొండుమల్లెలు' అనికూడా అంటారు. వీటి సువాసన మామూలు మల్లెల సువాసన వలె ఉంటుంది. కాని ఆకారం భిన్నంగా ఉంటుంది. చిన్నచిన్నరేకులు వర్తులంగా, ఒత్తుగా ఉండి చిన్న చిట్టి తెల్లగులాబీలాగా ఉంటుంది. అత్యంత సువాసన కలిగి రసాను భూతిని కలిగిస్తుంది. వీటితో ఆ ఆదిదంపతులను అర్చించడంవల్ల మనస్సులలో కల్మషాలు తొలగి మనసు ఉత్తేజితమవుతుంది. దంపతులమధ్య ఏవైనా అరమరికలు ఉన్నా తొలగిపోయి అన్యోన్యత చేకూరుతుంది. ఆయురారో గ్యాలు, సంపదలు కలుగుతాయి.

**గులాబీలు:** అందంగా ఉండి, సువాసన వెదజల్లుతూ ఉంటాయి గులాబీలు. అందానికి, ఆధిక్యతకూ, హుందాతనానికి ప్రతీక గులాబీ. సోయగం సువాసనలతోపాటు రక్తాన్ని శుభ్రపరచి, రక్తవృద్ధిచేసి, శరీరకాంతిని, తేజస్సునూ పెంపొందించే గొప్ప ఔషధగుణాలు ఇందులో ఉన్నాయి. వీటితో స్వామిని, అమ్మ వార్లను అర్చించడంవల్ల మనకు మంచి ఆరోగ్యం, ఉత్సాహం కలుగుతాయి. కుటుంబంలోనూ, సమాజంలోనూ ఆదరణ, గౌరవం కలుగుతాయి.

**04-04-2024న శ్రీనివాసమంగాపురం, శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామివారి పుష్పయాగం సందర్భంగా...**

**తెల్లతామర:** తామరలు వివిధవర్ణాలలో ఉంటాయి. ఎన్ని ఉన్నా తెల్లతామర, ఎఱ్ఱతామర శ్రేష్ఠమైనవి. స్వచ్ఛతకూ, నిర్మలత్వానికి, శాంతికి చిహ్నం తెల్లతామర. సరస్వతీదేవికి అత్యంత ప్రీతికర మైనది తెల్లతామర. ఆ దేవి ఎల్లప్పుడూ తెల్లతామరమీద ఆసీనురాలై ఉంటుంది. సకలవిద్యలకూ, సకలకళలకూ అధి దేవత శ్రీసరస్వతీదేవి. సరస్వతీదేవికి ప్రీతికరమైన తెల్లతామర్లతో స్వామిని, అమ్మవార్లను అర్చించడంవల్ల మనలోని దురా లోచనలు, దుర్బుద్ధులు తొలగిపోయి మనస్సు స్వచ్ఛమవుతుంది. మనలోని అవివేకం తొలగి వివేకం కలుగుతుంది. విద్యలు, కళలు మనకు బాగా అబ్బుతాయి. మనం చేసే వృత్తిపనుల్లో మనకు మంచి నైపుణ్యం కలిగి పనులను చాకచక్యంగా, సమర్థవంతంగా చేసి సత్ఫలితాలు పొందుతాం.

**ఎఱ్ఱతామర:** ఇది లేతఎరుపురంగులో అంటే గన్నేరులరంగులో ఉంటుంది. దీని సొగసు, సౌకుమార్యం మాటల కందనిది. ఈ తామరంటే క్షీరాబ్ధికన్యక శ్రీమహాలక్ష్మికి ఎంతో ప్రీతి. ఆ దేవి ఎల్లప్పుడూ ఈ తామరపై ఆసీనురాలై హస్తములందు ఈ తామర్లను ధరించి ఉంటుంది. అందుకే లక్ష్మీదేవిని మనం "పద్మాసనే, పద్మనయనే, పద్మహస్తే" అంటూ కీర్తిస్తాం. లక్ష్మీస్వరూపమైన శ్రీపద్మావతిదేవికి కూడా ప్రీతికరం ఈ ఎఱ్ఱతామర. పద్మావతిఅమ్మవారు అవతరించింది పద్మసరోవరంలో పద్మమునుండే కదా! ఐశ్వర్యా నికి, ఆధిక్యతకూ, హుందాతనానికి ప్రతీక ఎఱ్ఱతామర. శ్రీమన్నారాయణునికికూడా ఎంతో ప్రీతికరం ఎఱ్ఱతామర. అందుకే స్వామి హస్తములందు శంఖచక్రాలతోపాటు పద్మమును కూడా ధరించి ఉంటాడు. కాబట్టి నారాయణుని అవతారమైన శ్రీవేంకటేశ్వరునికి ఈ తామర ప్రీతికరమే. అట్టి ఎఱ్ఱతామర లతో స్వామిని, దేవేరులను అర్చించడంవల్ల అష్టైశ్వర్యాలు కలుగుతాయి. బుద్ధి ప్రక్షాళనమై హుందాగా, నిజాయితీగా నడుచుకుంటాం. ఉన్నతగౌరవాలు పొందుతాం. ఆయురారో గ్యాలు, సంపదలు సిద్ధిస్తాయి. ప్రశాంతత చేకూరుతుంది. దేశం సుభిక్షంగా ఉంటుంది.

**కలువలు:** ఇవి రాత్రిపూట చంద్రకాంతిలో వికసించి పగలు ముడుచుకుంటాయి. కాబట్టి చంద్రుడు కలువల మిత్రుడు. కలువలు చంద్రునికి ప్రీతికరములు. బ్రహ్మోత్సవవేడుకల్లో స్వామి, అమ్మవార్లు చంద్రప్రభవాహనంలో దర్శనమిస్తారు కదా! అలా వీరిని సేవించే చంద్రునికి ప్రీతికరమైన కలువలు వీరికీ ప్రీతికరములే. చంద్రుడు అమృతకరుడు. అట్టి చంద్రకాంతిలో వికసించే కలువలు అమృతమయములై గొప్ప ఔషధగుణాలను కలిగి ఉంటాయి. చల్లదనాన్ని కలిగిస్తాయి. శాంతికి, ప్రశాంతతకు చిహ్నములు కలువలు. అట్టి కలువలతో స్వామిని, అమ్మవార్లను అర్చించడంవల్ల ఆయురారోగ్యాలు కలుగుతాయి. మనస్సు, బుద్ధి నియంత్రించబడి ధర్మవంతంగా నడుచుకుంటాం. ప్రశాంతత, సంతోషం కలుగుతాయి. పైరుపంటలు వృద్ధి చెందుతాయి.

**కనకాంబరాలు:** ఇవి కాషాయరంగులో ఉండి మధుపూరితాలై ఉంటాయి. వీటి సొగసు, సౌకుమార్యం అపురూపం. సుకుమారంగా ఉన్నా తొందరగా వాడవు. వాడినా వన్నె తగ్గవు. మల్లెలతో కలిపి అల్లితే వీటి అందం ద్విగుణీకృతమవుతుంది. అందానికి, సున్నితత్వానికి, హుందాతనానికి ప్రతిరూపాలు కనకాంబరాలు. వీటితో స్వామిని, అమ్మవార్లను అర్చించటం వల్ల శరీరసౌష్ఠవం, ఆరోగ్యం కలుగుతాయి.

**మరువం :** ఇది మంచి సువాసన, ఔషధగుణాలు కలిగి ఉంటుంది. మానసికఒత్తిడిని తగ్గించి ఉత్తేజాన్ని కలిగిస్తుంది. క్రిమిసంహారిణిగాకూడా పనిచేస్తుంది. దీనిని ఇతరపువ్వులతో కలిపి కదంబమాల తయారుచేసి స్వామికి సమర్పిస్తారు. కదంబమాల ధరించడమంటే స్వామికి చాలా ఇష్టం. అట్టి మరువంతో స్వామిని, అమ్మవార్లను అర్చించడంవల్ల ఒంట్లో రుగ్మతలు నశించి ఆరోగ్యం కలుగుతుంది. అంటువ్యాధులు ప్రబలవు. శాంతిసౌభాగ్యాలతో దేశం సుభిక్షంగా ఉంటుంది.

**దవనం :** ఇదికూడా పువ్వులతో కలిపేందుకు ఉపయోగించే ఒకపత్రి. ఇది మానసికఒత్తిడిని తగ్గించి ఉపశమనం కలిగిస్తుంది. దీనినికూడా కదంబంలో ఉపయోగిస్తారు. దవనంతో స్వామిని, అమ్మవార్లను అర్చించడంవల్ల మంచి ఆరోగ్యం, ఉత్సాహం కలుగుతాయి. మనస్సు ఉత్తేజితమవుతుంది. ప్రశాంతత లభిస్తుంది. మనుషులమధ్య ఆదరాభిమానాలు, ఐక్యత పెంపొందుతాయి. శాంతిసౌభాగ్యాలతో దేశం సుభిక్షంగా ఉంటుంది.

**తులసి:** ఈ బ్రహ్మాండంలో పూజార్హతగల వృక్షాలలో/ మొక్కలలో అగ్రగామి తులసి. చిన్న చిన్న ఆకులతో ఘాటైన సువాసన కలిగి ఉంటుంది. తులసి ఆ శ్రీమన్నారాయణస్వరూపులైన శ్రీకృష్ణునికి, శ్రీవేంకటేశ్వరునికి ఎంత ప్రీతికరమో జగద్విదితమే. ఒక్క తులసిదళం శ్రీకృష్ణులవారితో సమానమై తులతూగి భక్తియొక్క గొప్పదనాన్ని నిరూపించింది. మనదేశంలో ప్రతి ఇంట్లోనూ తులసిమొక్క ఉంటుంది. తులసిలో అద్భుతమైన ఔషధగుణాలున్నాయి. తులసిరెమ్మలతో పూసలు తయారుచేసి జపమాలలు చేస్తారు. తులసి స్వామివారికి అత్యంత ప్రీతికరం. కాబట్టి అమ్మవారికికూడా ప్రీతికరమే. అట్టి తులసిదళములతో స్వామిని, అమ్మవార్లను అర్చించడంవల్ల తనువు, మనస్సు ప్రక్షాళనమై చిత్తశుద్ధి, మంచిఆరోగ్యం కలుగుతాయి. రోగాలు నయమై ఒంట్లో ఉత్సాహం, తేజస్సు, శక్తి వృద్ధిచెందుతాయి. అంటువ్యాధులు నివారించబడతాయి. పైరుపంటలు వృద్ధిచెంది దేశం సుభిక్షంగా ఉంటుంది.

**మాచీపత్రం :** ఈ పత్రంలో సువాసన పెద్దగా ఉండదుగాని ఔషధగుణాలున్నాయి. దైవారాధనకు అర్హతగల పత్రం. ఇది మాధవునికి ప్రీతికరమైంది. దీంతో స్వామిని, అమ్మవార్లను అర్చిస్తే సకలశుభాలు కలుగుతాయి.

**మారేడుపత్రం :** మారేడుపత్రంలో సువాసన, సోయగంవంటివి పెద్దగా ఉండవుగాని ఔషధగుణాలున్నాయి. మారేడుదళములు శివునికి అత్యంత ప్రీతికరములు. శివకేశవులు సదా పరస్పరారాధకులు. మాధవుని అర్చనలో మారేడుదళములు ఉపయోగించడంలో శివకేశవ అభేదం వెల్లడవుతుంది. మారేడు దళములతో స్వామిని, అమ్మవార్లను అర్చించడంవల్ల మనలో అసూయ, అహంకారం, ద్వేషంవంటి దుర్గుణాలు పోయి సద్గుణాలు అలవడతాయి. సర్వసంపదలు సిద్ధిస్తాయి. ప్రకృతి వైపరీత్యాలు, కరువుకాటకాలువంటివి లేకుండా దేశం సుభిక్షంగా ఉంటుంది.

ఈ విధంగా పలురకాలపుష్పాలతో, పత్రులతో స్వామిని, అమ్మవార్లను పలుమార్లు అర్చించడంతో పుష్పయాగం పరిపూర్ణమవుతుంది. దేశం సుభిక్షంగా ఉండాలని, అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని చేసే పుష్పకైంకర్యమే పుష్పయాగం.

## శ్రీవేంకటేశ్వరలీలలు



# అరటిపండుప్రసాదం

- శ్రీమతి వారణాశి అనసూయ

శ్రీవేంకటేశ్వరస్వామి మన కలియుగదైవం. వేంకటేశ్వరునిలీలలు చెప్పటానికి మానవమాత్రులకు సాధ్యంకానిపని. మేము మధ్యతరగతి కుటుంబీకులం. మాకు ఒక్కడే కుమారుడు. నేను ప్రభుత్వఉద్యోగిని. నా భర్త ప్రైవేటుసంస్థలో పనిచేసి రిటైర్ అయ్యారు.

తర్వాత మాకు అనుకోని పరిస్థితులు ఎదురయ్యాయి. మా వారికి అనారోగ్యం సంభవించింది. విపరీతమైన కడుపునొప్పితో బాధపడటం జరిగింది. వైద్యులపర్యవేక్షణలో వివిధ రక్తపరీక్షలు, మూత్రపరీక్షలు, సీ.టి.స్కాన్ మొదలైన పరీక్షల అనంతరం క్లోమంక్యాన్సర్ (పాంక్రియాటిక్‌క్యాన్సర్) రెండవదశ అని ధృవీకరించారు. చివరిరిపోర్ట్‌లో (బయాప్సీ) ఒకటి రెండు నెలలకంటే ఎక్కువకాలం జీవించరని చెప్పారు.

బలమైన ఆహారం ఇస్తూ ఆసుపత్రిలోనే ఉంచమన్నారు. అయితే, ఆ రోగతీవ్రతవల్ల మనుష్యులను గుర్తుపట్టలేక పోయేవారు. బంధుమిత్రులు పరామర్శకు రావటం మొదలు పెట్టారు. వైద్యులు ఆయనను ఇంటికి తీసుకువెళ్లమని కొన్ని జాగ్రత్తలు సూచించారు.

రోగి చివరిదశలో రక్తం కక్కుకోవటం, జుట్టుపీక్కోవటం, నేలమీదపడి దొర్లటం, బాధతో ఏడవటంవంటి విపరీత చేష్టలు చేసే అవకాశం ఉంటుందనీ, అలాంటిలక్షణాలు కనిపించినట్లైతే వెంటనే వైద్యుని పిలిపించమని చెప్పారు.

పైన సూచించిన విపరీతచర్యలేమీ లేక ఆయన పరిస్థితి స్థిరంగానే ఉంది. ఆ రోజు ఏకాదశి, శనివారం. నేనూ, మా అబ్బాయి మావారిని ఇంట్లోనే ఉంచి, బయట తాళం వేసుకొని భగవంతునిపై భారంవేసి దగ్గరలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లాం. ఆ గుడిలో స్వామి దర్శనానంతరం, పద్మావతిఅమ్మవారి దగ్గర పూజారిగారు మాకు ఇద్దరికీ చెరి ఒక అరటిపండు ప్రసాదం ఇచ్చారు. నా అరటిపండును దారిలో నన్ను పలకరించిన నా మిత్రురాలిచేతిలో ఉంచాను. మా అబ్బాయి చేతిలోని అరటిపండుప్రసాదాన్ని ఇంటికెళ్లి తండ్రికిచ్చాడు.

ఆశ్చర్యం! రెండునెలలనుండి ఘనపదార్థం ఏమీ తినని వారు, అరటిపండుప్రసాదం మొత్తాన్ని ఒకేసారి తిన్నారు. మా అబ్బాయి ఆశతో వెంటనే మార్కెట్‌నుంచి తండ్రికోసం అరటి పళ్లు తెచ్చాడు. కానీ, ఆయన ఒక్కటికూడా ముట్టలేదు.

ఆ తర్వాత మా ఆయన పరిస్థితిలో తేడా వచ్చింది. వైద్యులు చెప్పిన లక్షణాలనుబట్టి మాకు ఆయన పరిస్థితిపై సందేహం కలిగింది. వెంటనే, నేను, మా అబ్బాయి తలస్నానం చేసి, శ్రీవేంకటేశ్వరస్వామికి పసుపుగుడ్డలో ముడుపుకట్టి వారికి అనాయాసమరణం ప్రసాదించమని కోరుకున్నాం.

ముడుపుకట్టిన క్షణంలోనే వారు దాహం అన్నారు. మా అబ్బాయి వెంటనే నీళ్లుతెచ్చి మెల్లగా ఆయననులేపి త్రాగించాడు.

ఆ వెంటనే మా వారికి గురకవచ్చి మా అబ్బాయి ఒడిలో వాలిపోయాడు. తర్వాత వైద్యుణ్ణి పిలువగా వారు మరణించినట్లు ధృవపరిచారు.

ఆపదమొక్కులవాడైన శ్రీవేంకటేశ్వరస్వామి మా మొరనాలకించి వెంటనే సునాయాసమరణాన్ని ఆయనకు ప్రసాదించారు. మాపట్ల స్వామిదయకు ఇంతకంటే వేరొక నిదర్శనం ఉండదని మేము నమ్మాం. ఆయనపట్ల సదా భక్తి, కృతజ్ఞతా భావాలతో అర్చిస్తున్నాం. మావంటి ఎంతోమంది దీనులను కడతేర్చే కలియుగదైవం ఆ గోవిందుడే!

పతంజలి యోగసూత్రములు



# ధ్యానం

–శ్రీ జె.నరసింహారావు, 98857 04685

**యో**గం అనగా "కలయిక". పతంజలి మహర్షియొక్క యోగసూత్రాలఆధారంగా మానవుడు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదులనే అరిషడ్వర్గాలను తన అదుపులో ఉంచుకొను ఒక ప్రక్రియ. అరిషడ్వర్గాలను ఎవరు అదుపులో ఉంచ గలరో వారికి వారి మనసును అదుపు చేసుకొనే ఏకాగ్రస్థితి కలుగుతుంది. చంచలమైనమనసుతో మానవుడు ఏ స్థిరనిర్ణయం తీసుకోలేడు. ప్రస్తుత యాంత్రికయుగంలో మానవునికి ప్రశాంతచిత్తం కలగటం కల్లే. కానీ ధ్యానం చేసినచో ప్రతి మాన వుడు శాంతిని పొందుతాడు. పొందగలడు.

ధ్యానంద్వారా మానవుడు ఇంద్రియాలను తన అదుపులో ఉంచగలడు. తన జన్మ లక్ష్యాన్ని తెలుసుకోవటానికి ''ధ్యానం'' ఒక మార్గం. మానవుడు ఇంద్రియాలకు లొంగి ఉంటాడు. కనుక తాను జీవిస్తున్న బాహ్యాప్రపంచం అతనికి వాస్తవంగా తోచడంతో అతడు దీనిని సత్యమని, శాశ్వతమని భావిస్తాడు. ఇంద్రియాలతో సుఖిస్తున్నాడు కాబట్టి ఈ జీవితమే శాశ్వతమనుకొంటాడు. కానీ అతనికి తన కళ్ళముందే తనవారు చనిపోవటం, తనకు ఎంతో దగ్గరగా ఉన్నవారు ఒక్కసారిగా తనకు శాశ్వతంగా దూరం కావడం జరుగుతాయి. అప్పుడు మానవుడు సత్యాన్వేషి అవుతాడు.

మానవుడు తరించే దానికి ఒకే ఒక మార్గం "ధ్యానం సాధన". మానవుడు కేవలం దీనివల్లనే సత్యాన్ని తెలుసుకొనగలడు. అంతఃప్రయాణం చేయగలడు. అంతఃప్రయాణం చేయనిదే మానవుడు తన మనసులో కలిగే వివిధ మానసిక అలజడులను గుర్తించలేడు. దీనికోసం తీవ్రమైన సాధనకూడా అవసరం. ఈ యోగాన్ని చాలామంది మహర్షులు తపస్సు ద్వారా, రాజయోగంద్వారా, మంత్రయోగంద్వారా "యోగాన్ని" సాధించారు. కానీ మానవుడు తరించటానికి "రాజయోగమే" సులభతరమైన మార్గం. ఇంద్రియాలు ఆత్మకు పూర్తిగా లొంగిపోయి మనస్సును చలింపజేసే శక్తిని కోల్పోయినప్పుడు ఇక యోగం సిద్ధించినట్లే. హృదయంలో నెలకొని ఉండే వ్యర్థకోరికలన్నీ ఎప్పుడు నశిస్తాయో అప్పుడు మనిషి అమృతత్వాన్ని పొందుతాడు. ఈ శరీరం ఉండగానే బ్రహ్మైక్యాన్ని పొందుతాడు. ఈ స్థితి ఈ భూలోకంలోనే కలుగుతుంది. మరెక్కడో కాదు.

మహాశక్తివంతమైన యోగంవల్లనే మానవుడు మాధవుడై నాడు. శరీరమనే పేరుగల భౌతికపదార్థసముదాయానికి ఆత్మ, చింతాశక్తి మూలం. దీనిని పరికించటానికి మానవునికి ఒకే ఒక మార్గముంది. అదియే "తపస్సు" లేక "ధ్యానం".



హిందూధర్మం ఒక గొప్ప విశిష్టమైనమతం. ఈ ధర్మానుసారం లోకంలోని సర్వశక్తులు ఆదిశక్తినుండి ఉద్భవించాయి. ఈ విశ్వ మాతకు ఒక నిర్దిష్టరూపంలేదు. ఐతే ధ్యానశక్తితో ఆ రూపాన్ని దర్శించిన ఋషులు ఒక యంత్రరూపాన్ని మనకు ప్రసాదించారు. ఈ యంత్రం రేఖలు, వృత్తాలు, త్రిభుజాలుగా ఈ సువిశాలవిశ్వానికి ప్రతిబింబంగా రూపొందించారు.

యంత్రము అనగా ముందుకు వెళ్లేవి, మనలను ముందుకు నడిపించేవి అని అర్థం. అనగా, ఎవరైతే ఒక దైవ యంత్రాన్ని ఆరాధిస్తూంటారో వారికి తప్పక భగవదనుగ్రహం లభించి తీరుతుంది. అమ్మవారి లలితాసహస్రనామాలకు మహా మంత్ర, మహాయంత్ర, మహాతంత్ర, మహాసనాలని అమ్మవారి నామాలని చెప్పబడుతున్నాయి. అంటే అన్ని యంత్రాలకు ప్రతినిధి అమ్మవారే.

సకలవాస్తుదోషాలు పోగొట్టుకోవాలంటే గోడలు పగల గొట్టుకుని, ఇల్లు మళ్ళీ కట్టుకోనక్కర్లేదు. మత్స్యయంత్రం ఒకటి పూజించి ఇంట్లో పెట్టుకుంటే సమస్తవాస్తుదోషాలు నివారించ బడతాయి. కూర్మయంత్రం స్థిరత్వానికి చిహ్నం. నరఘోష యంత్రం కొంత దృష్టిదోషాన్ని నిర్మూలిస్తుంది. ప్రతి యంత్రం లోను వ్రాయబడిన బీజాక్షరాలు, త్రికోణ, వర్తుల, చతురస్ర నిర్మాణాలు ఆయాశక్తులని, దిక్పాలకులని, విశ్వంలో ఆ మూల ప్రకృతికి చెందిన ఆదిశక్తిని ప్రేరేపించి మంచియోచన, ఆనంద కరమైన వాతావరణాన్ని కలగచేస్తాయి. కొన్ని యంత్రాలని ధరిస్తారుకూడా. మరీ ఫొటోఫ్రేం అంతకాకుండా, చిన్న తాయెత్తుల్లో యంత్రాలని ధరించవచ్చు. దీర్ఘకాలవ్యాధులకి ఇవి బాగా పనిచేస్తాయి. మంత్రజపాలు చేయలేనివారు, యంత్రాల ద్వారా కార్యాన్ని సాధించవచ్చు. మంచియంత్రాన్ని అర్చించి, శక్తివంతం చేసుకుని, ఫలితాలను పొందవచ్చు అని మేరుతంత్రం లాంటిగ్రంథాలు తెలుపుతున్నాయి.

**మత్స్యయంత్రం-** మహావిష్ణువు ధర్మరక్షణకు ఎత్తిన దశావ తారాల్లో ఒకటి 'మత్స్యావతారం'. విష్ణువు దశావతారాల్లో మొట్టమొదటి అవతారమే మత్స్యావతారం. వేదసముద్ధరణకై అవతరించిన శ్రీమహావిష్ణువురూపం. ఈ యంత్రము, ఇతర యంత్రములకంటే చాలా విశిష్టమైనది. సమస్త వాస్తుదోష నివారణ యంత్రరాజమిది. ముఖ్యంగా విశేషించి ఈ యంత్రము- దాని ప్రస్తారమునందున్న సప్తావరణలలోను అతిముఖ్యము శక్తివంతమైన బీజాక్షరాలతో రూపొందించబడి, సర్వసాంప్రదాయానుకూలంగా నిర్మించబడింది.



# మత్స్యం

– శ్రీమతి ఎన్.సిహెచ్.శ్రీలక్ష్మి

**11-04-2024న శ్రీమత్స్యజయంతి సందర్భంగా...**

**పూజావిధి:** ఈ మత్స్యయంత్రాన్ని శాస్త్రానుసారంగా దైవజ్ఞులచే తయారుచేయించుకొని, యంత్రసంస్కార జీవకళాన్యాస, ప్రాణ ప్రతిష్ఠ జరిపించి, శుభసమయంలో యంత్రపూజ, జపాదులను ప్రారంభించాలి. ఈ యంత్రమును శక్తివంతంగా చేయుటకు విధివిధానమును మిగిలిన యంత్రములకన్న కొంచెం ఎక్కువ గానే నిర్దేశింపబడింది.

మత్స్యయంత్రంను ఐదుశేర్లధాన్యంలో ఒకదినం, పంచామృతములందు ఒకదినం, మంచినీటిలో ఒకదినం ఉంచి పూజించి సహస్రాష్టోత్తరశతగాయత్రీజపంచేసి మూలమంత్ర జపం పూర్తైన పిదప శంఖుస్థాపన చేసిన గృహస్థలంలో ఈ

యంత్రం ఏర్పాటు చేసుకోవాలి. ఈ యంత్రంను స్థాపన చేయటంవల్ల ద్వారదూష్యములు, కూపవేధలు, స్తంభవేధలు, వీధిశూలలు, ఆయుర్దాయము నశించిన గృహదోషాలు, శంఖుస్థాపన చేయక కట్టిన దోషం మొదలైనవన్నీ పరిహరించి మిక్కిలి శుభాలు కలిగిస్తాయి.

**మత్స్యజయంతి-** విష్ణునామస్మరణతో తరించే చైత్రమాస శుక్లపక్ష తృతీయను మత్స్యజయంతిగా, మహావిష్ణువు మత్స్యావతారం ధరించినరోజుగా మత్స్యపురాణం తెలిపింది.

**మత్స్యావతారం-** చైత్రమాసంలో మహావిష్ణువును పూజించడం చాలా విశేషం. మహావిష్ణువు ఈ సృష్టిని రక్షించడానికి అలాగే వేదాలను అందించడానికి అవతరించినటు వంటి అవతారమే మత్స్యావతారం.

వివస్వతుడు అనే సూర్యునిపుత్రుడు సత్యవ్రతుడు. అతనికి శ్రాద్ధదేవుడు అనే పేరుకూడా ఉంది. ఆ సత్యవ్రతుడు కృతమాలిక అనే నదిలో అర్ఘ్యం ఇస్తున్నాడు. ఆ సమయంలో ఆయన దోసిలిలోకి ఒక చిన్న చేపపిల్ల వచ్చింది. దాన్ని ఆయన నదీజలంలో పడవేయబోగా, ఓ రాజా! నీవు దయాత్ముడివి. నన్ను మింగేసే పెద్దచేపలు నదిలో ఉన్నాయని తప్పించుకోవ డానికి నేను నీ చేతిలోకి వచ్చాను అంది. దానితో ఆ రాజు తన కమండలంలోని నీటిలో చేపపిల్లను ఉంచి తన ఆశ్రమానికి తీసుకెళ్ళాడు. తరువాత ఆ చేపకు కమండలం సరిపడక నూతిలో వేయగా, అదీ సరిపోలేదు. క్రమక్రమంగా పెరిగిపోతోన్న ఆ చేపకు సరోవరంగానీ, నదిగానీ సరిపోక సముద్రంలో వేయగా, సముద్రంలోనూ లక్షలయోజనాలను ఆక్రమించేసింది. ఆశ్చర్య పడుతూ.. ఆ రాజు నీవెవరవు? అని ఆ చేపను ప్రార్థించగా, ఆ చేప తాను మత్స్యాకృతి దాల్చిన విష్ణువునని చెప్పింది.

దానికి కారణం ఆ మత్స్యం ఇలా చెప్పింది. రాజా! నేటికి ఏడవదినం బ్రహ్మదేవునకు ఒక పగలు పూర్తై రాత్రి కావస్తున్నది. అప్పుడు సకలప్రపంచమూ జలమయమైపోతుంది. నా మహిమవల్ల ఆ ప్రళయసాగరంలో ఒక నావ వస్తుంది. ఆ నావలో నిన్నూ, తపోమూర్తులైన మునులనూ, దివ్యఓషధులను తిరిగి సృష్టికోసం అవసరమైన మూలబీజాలనూ పదిలంచేసి నా శృంగం(ఒంటికొమ్ము)తో నావను లాగి ప్రళయాంబోధిని దాటిస్తాను అని చెప్పింది.

ప్రళయం సంభవించి, ధరిత్రి మొత్తం సముద్రంలో మునిగిపోయినప్పుడు లీలామానుషవేషధారి ఆ శ్రీమన్నారా యణుడు ధగధగమని కాంతులీనే సువర్ణవర్ణంతో పెద్దచేపగా అవతరించి, సత్యవ్రతునికి ఒక దేవనౌకను అనుగ్రహించాడు. స్వామి ఆదేశానుసారం సత్యవ్రతుడు ఆ నౌకలో సమస్తఔషధు లను, బీజాలను నింపడమేకాక, సప్తఋషులను అందులోనికి పంపి, వాసుకిని త్రాడుగా ఉపయోగించి, దివ్యకాంతులతో వెలిగిపోతున్న మత్స్యానికి ఉన్న కొమ్ముకు నౌకను కట్టాడు. ఆ రకంగా ప్రళయాన్ని దాటుతున్నసమయంలో నౌకలోనివారందరూ ఆయన నామామృతంతో తరించారని పురాణాలమాట.

సృష్టికార్యంలో అలసిన బ్రహ్మ ఆ కల్పాంత సాయం సంధ్యలో రవ్వంత కునుకు తీశాడు. ఇదే అదనుగా సోమకాసు రుడనే రాక్షసుడు బ్రహ్మదగ్గరనుండి వేదాలను చేజిక్కించుకొని మహాసముద్రంలోనికి పరుగెత్తాడు. శ్రీమన్నారాయణుడు మత్స్యరూపంలో ఆ రాక్షసుని వెదకి, చంపి వేదాలను తిరిగి తెచ్చి బ్రహ్మకిచ్చాడు.

మత్స్యనారాయణుడు తన అవతారంలో సమాజ హితానికి, అభివృద్ధికి మూలకందాలైన వేదవిజ్ఞానం భరతజాతి కందేలా అనుగ్రహించాడన్నది పురాణగాథల సారాంశం. చైత్ర శుద్ధ తదియనాడు మహావిష్ణువు మత్స్యావతారం ధరించినరోజు కనుక ఆనాటినుండి ఈనాటివరకు మత్స్యజయంతిని జరపడం ఆనవాయితీగా వస్తోంది.

**మత్స్యావతారంలోని విష్ణువు ఆలయం-** మత్స్యావ తారంలో విష్ణువు పూజలందుకునే ఏకైక దేవాలయం మన ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోనే ఉంది. నాగులాపురంలో స్వామిని వేదనారాయణుడిగా కొలుస్తారు. వేదరక్షణకు పారమార్థికభావన తోనేకాక మరోరకంగానూ విశ్లేషిస్తారు. ఉప్పునీటితో నిండిఉండే సముద్రంలో లోతుకు వెళ్ళినకొద్దీ ఆణిముత్యాలు, అరుదైన నిధులు లభ్యమౌతాయి. సముద్రానికి అట్టడుగునఉన్న వేదాలను శ్రీహరి తీసుకొచ్చి బ్రహ్మకందించాడు. సముద్రాన్ని అజ్ఞానానికి ప్రతీకగా తీసుకుంటే వేదాలు విజ్ఞానసర్వస్వం.

మత్స్యావతారసందేశం ఏమిటంటే అజ్ఞానపుతెరలు తొలగించుకొని లోపలికెళ్ళినకొద్దీ మనకు అత్యంత ఆవశ్యకమైన ఉపయుక్తమైన జ్ఞాననిధి సొంతమౌతుంది. ఈ విషయాన్ని ఆకళింపుచేసుకుని, మానవాళి అజ్ఞానపు తిమిరాన్ని తొలగించు కుని, విజ్ఞానపు దివ్వెలు వెలిగించుకోవడమే ఉత్తమధర్మం.




ధరణిని, ధర్మాన్ని, ధర్మసతిని రక్షించుకొనుటయే పురుషధర్మమని జగతికి చాటి చెప్పాడు రాముడు. ప్రజాక్షేమమే తన కర్తవ్యమని భావించి సర్వజనరంజకంగా పాలన సాగించాడు. ధర్మసారమంటే ఏమిటోకూడా బోధించి తానే దైవమని నిరూపించుకున్న నిరుపమాన దివ్యమూర్తి. తన గుణగణాలకారణంగానే ఆయన విశ్వవ్యాప్తుడయ్యాడు.

ధర్మసంస్థాపనార్థమై మానవుడిగా అవతరించి ధర్మమూర్తిగా నిలచిన శ్రీరామచంద్రుడు సర్వజ్ఞుడు. సర్వశక్తి సంపన్నుడు. సర్వవ్యాపకుడు. సర్వజన హృదయాలలో ఆత్మారాముడై ఉంటూ అనంతకోటి దీపకాంతులతో ఆత్మరూపునిగా ప్రకాశిస్తున్నాడు. ఆయన ఆచరణలు పాటించినవారికి అవి అమృతగుళికలుగా పనిచేస్తాయి. ఆయువును పొడిగిస్తాయి.

మానవత్వంలో దివ్యత్వం, దివ్యత్వంలో మానవత కలగలిపి ఉన్నదే రామతత్త్వం. రాముడు సర్వదా జనహితమే వాంఛించాడు. హితమును బోధించాడు. హితము చేకూర్చాడు. వివిధ పరిస్థితుల్లో మనిషి ఎలా ఆలోచించాలో, ఎలా మాట్లాడాలో, ఎలా ప్రవర్తించాలోకూడా బోధించాడు. సమైక్యతా విశిష్టతల్ని తెలియచెప్పి పరమాత్మునిగా నిలిచాడు.

శ్రీరాముడు సర్వజ్ఞుడు, సర్వశక్తమయుడు, దేవుడూ అయినప్పుడు అన్ని బాధలు, కష్టాలు ఎందుకు అనుభవించాల్సి వచ్చింది? అనే సందేహం వెలిబుచ్చుతూంటారు చాలామంది. ఎవరేం చెప్పినా రాముడు భగవంతుడేనని అర్థం చేసుకొని తీరాలి. దుష్టశిక్షణ, శిష్టరక్షణార్థమే మానవుడై ఈ లోకానికి వచ్చాడు. పంచభూతాత్మకమైన మానవశరీరంతో ఈ భూమ్మీదికి వచ్చిన ప్రతిఒక్కరూ ప్రకృతిధర్మాన్ని అనుసరించాల్సిందే తప్ప మరో మార్గం లేదు.

సత్యం రాముడైతే అసత్యం రావణుడు. ధర్మం రాముడైతే అధర్మం రావణుడు. నీతి రాముడైతే అవినీతి రావణుడు. రాముడు మనిషి. రావణుడు రాక్షసుడు. ఇలా ఈ మంచిచెడుల నడుమ జరిగిన సంఘర్షణే రామరావణయుద్ధం. ఓ వ్యక్తి మహాబలశాలి, గుణవంతుడు, మహాపురుషుడు ఐనా ప్రతికూలతలు ఎదురైనప్పుడు బలహీనపడి నిరుత్సాహానికి గురికాకూడదన్నది సహజం. కష్టాలు కారుచీకట్లై కమ్ముకొని వచ్చినా రాముడు ధైర్యంగా ఎదురొడ్డి ముందుకెళ్లాడే తప్ప భీరుడై పారిపోలేదు. ఇలా మనిషి ప్రతికూలసమయాల్లోకూడా ధైర్యంగా ఉండి ఎలా మసలుకోవాలో లోకులకు నిరూపించిన ఎన్నెన్నో మహత్తరఘట్టాలు రామాయణకావ్యంలో పొందు పరచబడ్డాయి.

మనిషి కష్టాలకడలిలో నిండా మునిగిపోయి బాధలు అనుభవిస్తున్నాకూడా నిరుత్సాహపడకూడదు. ప్రేమ, విశ్వాసం పదుగురికి పంచిపెట్టే తత్త్వం అలవరచుకోవాలి. దుర్మార్గంగా, దురుసుగా ప్రవర్తించకూడదు. ఈ నీతినే రామాయణమహాకావ్యం ఆదినుంచీ అంత్యంవరకు తెలియజేస్తూ వచ్చింది. మనిషి త్యాగమే పట్టుకొమ్మ అనే నిజాన్ని రామతత్త్వం తెలియ పరుస్తుంది. శత్రువర్గానికి ఆయన అనుసరించిన ధర్మం సర్వులకూ శిరోధార్యం. సత్పరిపాలనాదక్షునిగా కీర్తి స్వంతం చేసుకున్న సకలగుణాభిరాముడాయన. రామరాజ్యస్థాపకునిగా శ్రీరామచంద్రుడు సకలలోకపూజితుడు. కుమారుడు తండ్రిపట్ల ఎలా మసలుకోవాలి? శిష్యుడిగా గురువుకు సేవలు ఎలా చేయాలి? ప్రజలందరికీ ఆమోదపూర్వకమైన పాలన ఎలా అందించవచ్చు? మొదలైన ధర్మసూక్ష్మాలన్నీ తరతరాలవారికీ ఉపయోగపడేలా తెలియచేసిన ధర్మప్రభువు. రామాయణం సోదరప్రేమను పెంచుతుంది. సద్బుద్ధిని ప్రసాదిస్తుంది. అభ్యుదయం కోరినవారికి రామనామం ఓ దిక్సూచి. యావత్ భారత జాతికే గుండెవంటిది. ఈ గుండెను పదిలపరచుకోవడం మనందరి బాధ్యత.



# అరివేణికుండలు

– శ్రీమతి వావిలాల నాగవల్లి

కల్యాణం కమనీయం
దాంపత్యానికి తొలిఅడుగు
జీవనసౌభాగ్యానికి మేలిమలుపు
దేశసౌభాగ్యానికి జయకేతనం

వేదకాలంనుండి హిందూసంప్రదాయం వివాహ వ్యవస్థకు పెద్దపీట వేసింది. కుటుంబజీవనానికి పునాది వివాహ బంధం. హిందూవివాహవ్యవస్థ, కుటుంబవ్యవస్థ అత్యంత పటిష్ఠమైనవి. వివాహసంప్రదాయంలో మంగళస్నానాలు, అంకురార్పణ, స్నాతకం, వరపూజ, గౌరీపూజ, వివాహం, తలంబ్రాలు, నాగవల్లి మొదలగు అనేక మంగళప్రదమైన సంస్కారాలు ఉన్నాయి. అయితే అరివేణికుండలనుకూడా విశేషంగా చెప్పొచ్చు. కానీ ఇవి వారి వారి ప్రాంతీయ ఆచారాలనుబట్టి కొందరిఇళ్లలో మాత్రమే ఉంటాయి. వీనికి గరికముంతలు అను పేరుకూడా ఉన్నది.

వివాహసంప్రదాయంలో ఈ గరికముంతలను వాడుతారు. ఆంధ్రప్రదేశ్, రాయలసీమ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో వీనిని 'గరగ' అని పిలుస్తారు. తమిళనాడులో గరగం అంటారు. గరగ అంటే కుండ అని అర్థం. దీనిని కొన్ని ప్రాంతాల్లో గరికముంతలు అనికూడా అంటారు. వీనిని పెళ్లిళ్ల సమయంలో ఇరుపక్షాలవారు కుమ్మరివారి ఇంటినుండి తీసుకు వస్తారు. అలా తెచ్చిన కుండలకు పసుపు, కుంకుమలు పెట్టి రకరకాల రంగవల్లులతో అందంగా అలంకరిస్తారు. దానిలో పసుపునీరు, తమలపాకు వేసి గౌరీదేవిగా భావించి పూజ చేస్తారు. తర్వాత ఆ రెండుకుండలను మగపెళ్లివారు ఆడపెళ్లి వారు ఒకరికి ఒకరు మార్చుకుంటారు. తలంబ్రాలసమయంలో ఒకరిచేతిపై మరొకరిచేతినుంచి ఒకముంతను వారిచేతులపై పెట్టి మంత్రోచ్చారణ తరువాత పెళ్లికుమారుడు పెళ్లికుమార్తె ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకుంటారు. ఆ తర్వాత ఆ ముంతలో ఏదైనా తీపిపదార్థాన్ని పెట్టి పెళ్లికుమార్తెకు ఇస్తారు.

కొన్నిప్రదేశాల్లో పెండ్లికూతురిచే ఆ ముంతకు పూజ చేయించి, దానిపై కొబ్బరికాయని పెట్టి దానితోసహా పెళ్లి కూతురును పీటలమీదికి తీసుకువచ్చే ఆచారం ఉంది. కొందరు రెండు లేక నాలుగుముంతలను తీసుకువస్తారు. మరికొందరు పెండ్లిమంటపానికి నాలుగువైపులా ఏడేసికుండలు పెద్దకుండనుంచి చిన్నకుండదాకా ఒకదానిపై ఒకటి వరుసగా పేర్చి పెడతారు. ఈ ఆచారం మనకన్న ఉత్తరహిందుస్థాన్‌లో ఎక్కువగా కనిపిస్తుంది. ఒకప్పుడు ఈ కుండలను పసుపు,



కుంకుమ, రంగవల్లులతో అలంకరించేవారు. కానీ నేడు వారి వారి అభిరుచులకు తగినట్లుగా రకరకాలరంగులతో, పూసలతో, అద్దాలతో వివిధరకాలుగా అలంకరిస్తున్నారు. ఆడపెళ్లివారింట వధూవరులకు మంగళస్నానాలు చేయించి, మడివేలు తెచ్చిన చలువబట్టలను కడతారు. ఆ తర్వాత కుమ్మరివారి ఇంటినుంచి ఈ గరికముంతలను తెచ్చి వానిని పెద్దకుండనుంచి చిన్నకుండ దాకా ఒకదానిపై ఒకటిగా వరుసగా పేర్చి అప్పుడు ఇరుపక్షాల పెళ్ళివారు దంపతీసమేతంగా మంత్రపూతంగా వానిచుట్టూ వలయాకారంగా తిరుగుతూ, పసుపు రాసిన నూలుదారాన్ని చుడుతూ వాటికి కొంతకార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అయితే ఈ ఆచారం అందరిలో లేదు. మంత్రపూరితమైన ఆ దారం శుభం కలిగిస్తుందని వారి నమ్మకం. దానిలో మంగళసూత్రాలను కట్టడం కొందరికి ఆనవాయితీ.

కొన్నిప్రాంతాల్లో ఆడపెళ్ళివారు మగపెళ్లివారు చెరొక గరికముంతను తెస్తారు. పెళ్లిలో వధూవరులకు అరుంధతీ నక్షత్రాన్ని చూపించేసమయంలో వాటిని మార్చుకుంటారు. కొందరు నాగవల్లిసమయంలో అందులో ఖర్జూరాలు, పసుపు, కుంకుమ, దక్షిణలను ఉంచుతారు. పెళ్లికూతురుకి మగపెళ్లి వారిచ్చిన గరికముంతను తనతోపాటుగా తీసుకుని వెళుతుంది. కొన్నిప్రాంతాల్లో దానిలోని బియ్యంతో పొంగలినికూడా చేసు కుంటారు. ఆ గరికముంతను అత్యంతపవిత్రంగా భావిస్తారు. ఈ గరికముంతలను సేవించడం అంటే గౌరీదేవిని పూజించి నట్లేనని అంటారు.

ఈ విధంగా కరగం, గరిక, గరిగ, గరగా, గరిగే, అలివేణికుండలు, ఐరేనికుండలు అని రకరకాలపేర్లతో వీటిని పిలుస్తారు. ఎలా పిలిచినప్పటికీ వివాహప్రారంభంనుండి పెళ్లికుమార్తెను అత్తవారింటికి పంపించేదాకా ప్రతిఘట్టంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నవి. అలా ఈ గరిక ముంత వివాహసంప్రదాయాల్లో శాశ్వతంగా నిలిచిపోయింది. దేవాలయాల్లో స్వామివారి కల్యాణసమయాల్లోకూడా ఇవి వాడ బడటం అత్యంత విశేషమని చెప్పవచ్చు. ఏది ఏమైనా సనాతన సంప్రదాయాలు మన జాతి జీవనానికి మూలస్తంభాలు కదా.

సంప్రదాయమే జాతికి జీవనం
ఆనందకరమైన జీవితానికి
మన నమ్ముకున్న ఆచారాలే
ఆయువుపట్టని చెప్పవచ్చు.

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## అన్నదానం దానాల్లో ఉత్తమం

ఇంచుకంత బోన మీశ్వరార్పణ మన్న,
పుణ్యలోకమునకు బోవు నతడు;
అన్నదానమునకు నధికదానము లేదు;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** బోనము= ఆహారం; ఈశ్వరార్పణము= దేవునికి అర్పించితిని; పుణ్యలోకము= స్వర్గం.

**భావం:** కొద్దిగానైనా ఆహారాన్ని ఈశ్వరార్పణం అంటూ పరమాత్మకు సమర్పణం చేసినవాడు పుణ్య లోకాలకు పోతాడు. అన్నదానాన్ని మించిన దానం లేదు.

**వివరణ:** పరమాత్మకు కొంచెం అన్నం నివేదన చేస్తే ఆయన సంతోషిస్తాడు. ఆయనకు ఆకలిబాధ లేదు కాబట్టి అన్నం అవసరం లేదు. నివే దించిన అన్నం ఆయన తినడు. ఆయన ప్రసాదంగా భక్తితో మనమే తింటాం. అయినా అనుగ్రహించి పుణ్యలోకాలు ఇస్తాడు. లోకంలో ఆకలితో బాధపడుతున్నవాడికి అన్నదానం చేయగా, తిన్నవాడికి ఆకలిబాధ తీరడం అనే ప్రయోజనం ఉంది. అవసరం లేని భగవంతుడు అన్నాన్ని చూసినమాత్రంచేత, అన్నం పెట్టాలనే బుద్ధికే ప్రతిఫలం ఇస్తుంటే, అవసరం ఉన్న వాడికి పెట్టడం,ఆర్తి తీర్చడం ఇంకా ప్రయో జనవంతమే కదా. ఇంక ఏ దానంలోనూ లేని సంతృప్తిని ఇచ్చే అన్నదానం దానాలన్నింటికంటె అధికం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

ఆయుర్వేదం

# ఉగాదిపచ్చడి

-డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

నిరోధాలనిమిత్తం ఈ ఉగాదిపచ్చడి సేవనప్రక్రియ సంప్రదాయవిధానాన్ని ఏర్పాటు గావించినట్లు ద్యోతకమవుతోంది.

ఉగాది చైత్రమాసంలో వస్తుంది. ఉష్ణం, వేడి, తాప తీవ్రత సూర్యతాపం రోజురోజుకు క్రమంగా అధికం కావటం జరుగుతూంటుంది. వాటినుంచి రక్షణ పొందేందుకు పాటించాల్సిన ఆహారవిధివిధానాలను తెలియజేయడమే ఈ పండుగ జరుపుకోవటంలోని పరమార్థం, నిగూఢార్థం.

సంవత్సరంపొడవునా ఎదురయ్యే మంచిచెడులు, కష్టసుఖాలు, జయాపజయాలు, సాధకబాధలన్నింటినికూడా మనోనిగ్రహంతో,సంయమనంతో యథాతథంగా స్వీకరించాలన్న సందేశాత్మకమైన అంతరార్థంకూడ ఇందులో ఇమిడి ఉంది.

### సంప్రదాయపద్ధతిలో ఉగాదిపచ్చడి

ఒక మట్టిపాత్రలో తొడిమలు లేకుండ తీసుకున్న వేప పువ్వు ఒకభాగం, మామిడిపిందెలముక్కలు రెండుభాగాలు, మిరియాలపొడి మూడుభాగాలు, చింతపులుసు (పూర్వం ఉసిరి లేదా నిమ్మరసం వాడేవారు) నాలుగుభాగాలు, ఉప్పు ఐదు భాగాలు, బెల్లంతురుము ఆరుభాగాలను వేసి తగినంత నీరు చేర్చాలి. ఇదే ఉగాదిపచ్చడి. ఇలా ఒక నిష్పత్తిప్రకారం శాస్త్రీయ పద్ధతిలో తయారుచేసుకొని పరగడుపున సేవిస్తే అరిషడ్వర్గాలుగా పేర్కొనే కామక్రోధలోభమోహమదమాత్సర్యాలనే అంతశ్శత్రువులను జయించేందుకుకూడా ఇది తోడ్పడుతుందని చెప్తారు.

వేప క్రిమిసంహారిణి. రక్తశుద్ధి చేస్తుంది. చర్మవ్యాధుల్ని నివారిస్తుంది. శ్లేష్మదోషాలను తగ్గిస్తుంది. మామిడి జీర్ణరసాలను ఉత్పత్తిచేస్తుంది. ఆకలి కలిగిస్తుంది. నోటికి రుచినిస్తుంది. కాలేయం పనితీరును మెరుగుపరుస్తుంది.

మిరియాలు ఘాటుగా ఉండి శ్లేష్మవాతాదిప్రకోపాలకు విరుగుడుగా పనిచేస్తాయి. ఆస్త్మా, దగ్గు, శ్వాసవ్యాధులకు మంచిది. మన శరీరంలోని, ఆహారంలోని, హానికారక అంశాలను నిర్వీర్యం చేయటమేకాక మనం తీసుకున్న ఆహారం చక్కగా వంటబట్టేట్లు చేస్తాయి.

చింతపులుసు విరేచనకారిగా పనిచేస్తుంది. ప్రేవులను శుభ్రపరుస్తుంది. ఆహారంపై ఆసక్తిని పెంచుతుంది. నోటికి రుచిని కల్గిస్తుంది.

ఉప్పు శరీరానికి శక్తిని ప్రసాదిస్తుంది. ఆహారానికి రుచిని కల్గిస్తుంది. అజీర్ణదోషాలను, కడుపునొప్పిని తగ్గిస్తుంది.

బెల్లం మనసును ఆహ్లాదపరుస్తుంది. మానసిక ప్రశాంతతను కల్గిస్తుంది. రక్తహీనత రాకుండా కాపాడుతుంది. తక్షణ శక్తినిస్తుంది. వ్యాధినిరోధకశక్తి పెరిగేందుకు ఉపయోగపడుతుంది.

ఆధునికకాలంలో చాలామంది ఒకపాత్రలో ఒక టేబుల్‌స్పూన్ వేపపువ్వు (కాడలు తీసిన) తాజా కొబ్బరితురుము, సన్నగా తరిగిన సగం అరటిపండుముక్కలు, రెండు టేబుల్ స్పూన్ల చింతపండుగుజ్జు, ముక్కలుగా తరిగిన ఒకపచ్చిమిరపకాయ, కప్పుబెల్లంతురుము, కప్పుమామిడిముక్కలు తగినన్ని చెరుకుముక్కలు, చిటికెడుఉప్పు అవసరమైతే కొద్దినీరు చేర్చి పచ్చడిని సిద్ధం చేయటం పరిపాటి.

ఏది ఏమైనప్పటికి భగవత్ప్రసాదితమైన ప్రకృతిలో లభ్యమయ్యే వివిధరకాల పదార్థాలను పరిచయం చేస్తూ మన ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో, వాటి ప్రయోజనాలేమిటో తెలియజేస్తూ గుర్తు చేయటమే తరతరాలుగా కొనసాగుతున్న ఇలాంటి పండుగల పరమార్థం.



# ఏప్రిల్, 2024 రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం–** వాక్చాతుర్యంతో సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఈ మాసంలో ఆర్థికస్థితిగతులు సామాన్యం. ఉద్యోగస్తులకు ఉన్నతాధికారులతో సత్సంబంధాలుంటాయి, సైన్స్ ఇంజినీరింగ్‌రంగాల్లో విద్యార్థులు రాణిస్తారు.

**వృషభం–** అన్నింటా మంచిఫలితాలు కల్గుతాయి. ధనలాభం కీర్తి, శరీరారోగ్యం, ద్రవ్యలాభం, వృత్తి, వ్యాపారాల్లో ధనలాభాలు కల్గుతాయి.

**మిథునం–** అన్నిరంగాలవారికి అనుకూల ఫలితాలుంటాయి. గృహంలో ఉత్సవవాతావరణం, మధుర పదార్థాల భోగం, ధనలాభాలు కల్గుతాయి.

**కర్కాటకం–** ఆరోగ్యస్థితిని కాపాడుకోవటం ఎంతో అవసరం. నిత్యం సూర్య, సుబ్రహ్మణ్య ఆరాధన, అశ్వినిదేవతలకు, వైద్యనాథ, ధన్వంతరి మొదలగు విష్ణుదేవతాకమైన దేవతలను పూజించటం మంచిది.

**సింహం–** దూరప్రాంతాలకు వెళ్లవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలు అనుకూలం కాదు. కొన్ని చట్టపరమైన సమస్యలకు, కోర్టువ్యవహారాలకు పరిష్కారదిశలో వెళ్తే మంచిది. ఆరోగ్యాన్నికూడా జాగ్రత్తగా చూసుకోవాలి.

**కన్య–** అనారోగ్య రుగ్మతలు, ప్రయాణంలో సమస్యలు, జీవిత భాగస్వామికి బాధ ఉంటాయి. ఈ కాలంలో అధికారం లేదా ప్రభుత్వంనుండి గుర్తింపు లేదా ప్రతిఫలం లభిస్తుంది.

**తుల–** ఆర్థికవృద్ధి, ఇతరులపై పట్టు సాధించటం, వృత్తివ్యాపారాలు కలిసివస్తాయి. ఉద్యోగస్తులకు అనుకూల సమయం. సమాజంలో ఆదరణ పెరుగుతుంది. సాంఘిక సంబంధాలు మెరుగవుతాయి.

**వృశ్చికం–** ఆరోగ్యవిషయాల్లో ఉపశమనం. అన్నింటా మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. కోర్టువ్యవహారాలు అనుకూలం. సాంఘికంగా మంచి పరిచయాలు ఏర్పరుచుకుంటారు. ఆనందకరమైన వాతావరణం.

**ధనుస్సు–** ధైర్యంతో ప్రణాళిక అమలుజేస్తారు. ప్రభుత్వం తరపునుండి సన్మానాలు జరుగుతాయి. గౌరవమర్యాదలు పెరుగుతాయి. కుటుంబగౌరవం పెరుగుతుంది.

**మకరం–** సంఘంలో పలుకుబడి, ఆరోగ్యంతో ధైర్యంగా కార్యభారాన్ని వహిస్తారు. ఉద్యోగస్తులకు పదోన్నతి. వ్యాపారస్తులకు ధనలాభం కలుగుతుంది. దూరప్రయాణాలు కలిసివస్తాయి.

**కుంభం–** వృథాగా కాలయాపన చేస్తూ చేతికి చిక్కిన అవకాశాలను జారవిడుచుకుంటారు. ప్రతిబంధకాలను అధిగమించటానికి శక్తియుక్తులను కూడగట్టుకునే ప్రయత్నం అవసరం.

**మీనం–** అసహనానికి, తొట్రుపాటుకి గురౌతారు. క్రమశిక్షణ, అవగాహనారాహిత్యం ఉంటుంది. తల్లిదండ్రులతోనూ, కుటుంబసభ్యులతోనూ వాగ్వివాదానికి దిగకుండా సంయమనం పాటించటం మంచిది.

**నవగ్రహ ప్రార్థన**

శ్లో॥ ఆదిత్యాయ చ సోమాయ। మంగళాయ బుధాయ చ।
గురు శుక్ర శనిభ్యశ్చ। రాహవే కేతవే నమః॥

సుమతీ శతకం

# పరమధర్మం

- శ్రీ అనంతాత్మకుల రంగారావు,
79894 62679

**"ఉపకారికి నుపకారము**
**విపరీతము గాదు సేయ వివరింపంగా**
**నపకారికి నుపకారము**
**నెపమెన్నగ సేయువాడు నేర్పరి సుమతీ!"**

అంటే మేలుచేసినవారికి తిరిగి మేలుచేయడం గొప్ప కాదు. కీడు చేసినవానికైనా తప్పులెంచక ఉపకారం చేయువాడే గొప్ప పురుషుడు.

పూర్వం కాశీనగరంలో "లుబ్ధకుడు" అనే వేటగాడు లేడిని చంపడానికి విషంపూసిన బాణాన్ని ప్రయోగించాడు. ఆ లేడి తప్పించుకు పారిపోయింది. కాని ఆ బాణం పచ్చని పూలతో, కాయలతో నిగనిగలాడేచెట్టుకు గుచ్చుకొంది. ఆ చెట్టుపై ఎన్నోపక్షులు నివసిస్తున్నాయి. చెట్టుతొర్రలో ఒకచిలుక తన పిల్లలతో నివసిస్తోంది. ఆ బాణం ఆ చెట్టుకు తగలగానే, విషంవల్ల నల్లగా మాడి, ఆకులు, కాయలు రాలిపోయాయి. చెట్టు మోడువారిపోయింది. చెట్టుపై ఉన్న పక్షులన్నీ ఎగిరి పోగా, తొర్రలో ఉన్న చిలుకమాత్రం ఎక్కడికి పోక అక్కడే ఉండిపోయింది. మిగిలినపక్షులన్నీ "ఎందుకు? ఆ చెట్టునే పట్టుకు వ్రేలాడతావు. ఈ అడవిలో చాలా పచ్చనిచెట్లున్నాయి కదా. ఎగిరిపోయి మరోచోట ఆశ్రయం పొందు అని ఒత్తిడి చేస్తూండేవి. ఐనా ఆ చిలుక అక్కడే ఉండిపోయింది.

ఒకరోజు, మిగిలిన కొన్నిపక్షులు చిలుకకు ఎగిరిపో! అని సలహా ఇస్తున్నసందర్భంలో, ఇంద్రుడు, నారదమహర్షి వనసంచారం చేస్తూ అక్కడికి వచ్చి, పక్షులసంభాషణ వింటున్నారు. చిలుక తోటిపక్షులకు సమాధానమిస్తూ, నేను, ఈ చెట్టుమీదే ఉంటాను. ఎక్కడికీ వెళ్ళను అని చెప్తుంటే, అది విని ఇంద్రుడు, "ఓ! చిలుకా! ఈ అడవిలో ఫలసమృద్ధిగల చెట్లు చాలా ఉన్నాయికదా! మోడువారిన ఈ చెట్టునే ఎందుకు ఆశ్రయించావు?" అని అడిగాడు. అప్పుడు చిలుక "శచీపతీ! దైవాన్ని ఎవరూ అతిక్రమించజాలరు. నేను మంచిగుణాలన్నీ ఈ చెట్టునుంచే నేర్చుకొన్నాను. నా వంశం వృద్ధిపొందింది. శత్రుబాధలేకుండా జీవిస్తున్నాను. ఈ చెట్టు పచ్చగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడు దీనిమీద ఉండడం, ఎండినప్పుడు విడిచిపెట్టి వెళ్ళిపోవడం కృతఘ్నత కాదా? మహేంద్రా!" అని పలికేసరికి ఈ చిలుక పూర్వజన్మవాసనవల్ల నన్ను గుర్తుపట్టింది. దానికి ఏదైనా మేలు చేయాలని ఇంద్రుడు భావించాడు.

అపుడు "ఓ చిలుకా! నీ మాటలు నాకు ఆనందాన్ని కలిగించాయి. ధర్మం చెప్పావు. నీకు ఏదైనా వరం ఇస్తాను కోరుకో!" అన్నాడు.

అపుడు చిలుక "స్వామి! ఈ చెట్టుకు పూర్వపు వైభవాన్ని అనుగ్రహించండి." అని కోరింది. అపుడు ఆ చెట్టుపై ఇంద్రుడు అమృతం చల్లి, పూర్వపువైభవంకంటే ఎక్కువ వైభవాన్ని కల్పించాడు. ఆ వృక్షం పచ్చని ఫలాలతోను, ఆకులతోను కళకళలాడుతూ కనపడింది.

**నీతి** ఉపకారబుద్ధితో ఉంటే భగవంతుని తోడ్పాటు ఉంటుంది. అందుకే మనం కొంచెం అయినా ఉపకారబుద్ధి కలిగి ఉందాం అనేదే పై కథానీతి.

## ఫిబ్రవరి నెల క్విజ్-19 సమాధానాలు

01) చొల్లంగి అమావాస్య
02) ఆదిలాబాద్
03) పన్నెండు
04) భీష్మపర్వం
05) ఈశ్వరుడు
06) సాయంసంధ్య
07) చిన్నన్న(తిరువేంగళనాథుడు)
08) శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామివారి ఆలయం, శ్రీనివాసమంగాపురం
09) శరణాగతి
10) హరినామచింతన
11) 27 మంది
12) సరస్వతి
13) మేస్త్రం వంశీయులు
14) పుష్పవతి
15) పావకవృత్త తారావళి

**సరైన సమాధానాలు వ్రాసినవారు-**

01) లికిల్‌కృష్ణ, తిరుపతి.
02) పి.చైతు, వరంగల్.
03) డి.ఎన్.శిరీష, కుప్పం.
04) ఎన్.సుహాంత్ అమర్త్య, తిరుపతి.
05) ఎస్.సిద్ధార్థసాయి, కుప్పం.
06) కె.సాకేత్, హైదరాబాదు.
07) పి.ఇశాన్వి, ఆళ్ళగడ్డ.


భగవంతుని సన్నిధిలో నీ కోర్కెలను బయటపెట్టడం ప్రార్థనకాదు

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-30

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య    నిర్వహణ- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ

| | | | | | |
|---|---|---|---|---|---|
| मया | = నా చేత, నాతో | इतः पूर्वम् | = ఇంతదాకా ఇంతకు | पश्यति | = చూచుచున్నాడు |
| अस्माभिः | = మా చేత, మాతో | इतः परम् | = ఇకమీద(ముందు) | द्रक्ष्यति | = చూడగలడు |
| त्वया | = నీ చేత, నీతో | इति | = అని | दर्शयति | = చూపించుచున్నాడు |

అ) ఈ క్రిందివాటిని తెలుగులోకి అనువాదం చేయండి?

01) यूयं मया आगच्छत।

02) वृक्षे फलानि न सन्ति।

03) सर्वाणि फलानि अपतन्।

04) तत्र गोविन्दः अस्ति किं वा? पश्य।

05) मम मञ्चं दर्शय।

06) तव जनकः श्वः अस्माभिः आगमिष्यति।

07) पाकः कथमस्ति न द्रक्ष्यसि किम्?

08) झटिति पाकं कुरुत। इति वद।

09) एतत् क्षीरं पातुं सम्यक् नास्ति।

10) एतत्क्षीरे लवणम् अपतत्।

అ) జవాబులు

01) మీరు నాతో రండి.

02) చెట్టునందు పండ్లు లేవు

03) అన్నిపండ్లు పడ్డాయి.

04) అక్కడ గోవిందుడు ఉన్నాడా ఏమి చూడు?

05) నా మంచం చూపించు.

06) నీ తండ్రి రేపు మాతో వస్తాడు.

07) వంట ఎలా ఉన్నదో చూడవా ఏమి?

08) వెంటనే వంట చెయ్యండి అని చెప్పు.

09) ఈ పాలు త్రాగటానికి బాగా లేవు.

10) ఈ పాలలో ఉప్పు పడింది.

ఆ) ఈ క్రిందివాటిని సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) ఈ పిల్లవాని ఇంటిని నాకు జూపుము.

02) వాడు మీ ఇంటికి వెళ్ళినాడెందుకు?

03) కొంచెము దూరముగా పొమ్ము.

04) నిన్న మంచమును మీ ఇంటిలో నేను చూచినా.

05) కానీ మాతో వత్తువా?

06) నేను వచ్చు నెడల నిచట మా ఇంటి నెవరు చూతురు?

07) మీ తమ్ములింటిలో నున్నారుగా.

08) వారు కొండలయందు నడచుచున్నారు.

09) నీవక్కడ ఎందుకు నడచుచున్నావు?

10) ఊరకయే

ఆ) జవాబులు

01) एतस्य बालकस्य गृहं मम दर्शय।

02) सः तव गृहं किमर्थं गतवान्। (अगच्छत्)

03) किञ्चित् दूरं गच्छ।

04) ह्यः अस्माकं मञ्चं युष्माकं गृहे अहं अपश्यम्।

05) तर्हि अस्माभिः आगच्छसि किम्?

06) अहम् आगच्छामि चेत् अत्र मम गृहं के पश्यन्ति?

07) तव अनुजाः गृहे सन्ति खलु।

08) ते पर्वतेषु चलन्ति।

09) त्वं तत्र किमर्थं चलसि?

10) तूष्णीमेव।

చిత్ర కథ

# అందరికీ మోక్షం!

కథ– డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు– కె.ద్వారకనాథ్





ఉపదేశం తర్వాత శ్రీరామానుజులు బాగా ఆలోచించారు. స్వార్థచింతన కంటే లోకశ్రేయస్సే గొప్పదని ఆయన భావించారు.
ఆర్తి కలిగిన వాళ్లందరికీ తిరుమంత్రాన్ని ఉపదేశిస్తాను. అందరికీ మోక్షం రావాలి.
మీ నిర్ణయం అపూర్వం ఆచార్యా!
వెంటనే ఆచార్యులు ఆలయగోపురం ఎక్కి ప్రజలందరినీ పిలిచారు. అష్టాక్షరీమంత్రార్థాన్ని ఉపదేశించారు శ్రీరామానుజులు.
ఓం నమో నారాయణాయ!
ఓం నమో నారాయణాయ!
తర్వాత గోష్ఠీపూర్ణులు రామానుజుల్ని పిలిచి కోపంతో మందలించారు...
యతిరాజా! నా ఆజ్ఞని తిరస్కరించిన నీకు నరకం తప్పదు.. తప్పదు
నాకు నరకం వచ్చినా బాధపడను. అందరికీ మోక్షం లభిస్తే చాలు ఆచార్యా!
శ్రీరామానుజుల మాటల్ని విన్న తర్వాత గోష్ఠీపూర్ణులు...
యతిరాజా! నువ్వు అవతారపురుషుడివి. నీ ఔదార్యం.. త్యాగం.. నిరుపమానమైనవి.
అంతా తమ సౌజన్యమే ఆచార్యా!
గోష్ఠీపూర్ణులు ఆనందంతో శ్రీరామానుజుల్ని కౌగిలించుకున్నారు.
యతిరాజా! నా స్వామీ! నా భాగ్యమా! ఎంబెరుమానార్...
ఆ గురుశిష్యులకు లోకమే ప్రణమిల్లింది.
లోకాః సమస్తాః సుఖినో భవన్తు!
స్వస్తి!

## క్రింది ఖాళీల్లో ఒకేపదంతో పూరిస్తూ గేయం పాడుదాం!!

ఆటలంటే ..................................................,
పాటలంటే ..................................................,
ఆటలకన్నా పాటలకన్నా,
అల్లరిపనులే ..................................

సినిమాలంటే ..................................................,
మిఠాయిలంటే ..................................................,
సినిమాకన్నా మిఠాయికన్నా,
షికార్లు కొట్టుటే ..................................

పిట్టలంటే ..................................................,
పువ్వులంటే ..................................................,
పిట్టలకన్నా పువ్వులకన్నా,
చెట్లెక్కడమే ..................................

కొత్తబట్టలు ..................................................,
పౌడరు స్నోలు ..................................................,
బట్టలకన్నా పౌడరుకన్నా,
మట్టిలో ఆటలే ..................................

టీచర్లంటే ..................................................,
పాఠాలంటే ..................................................,
టీచరుకన్నా పాఠంకన్నా,
బడి సెలవంటే ..................................

వెన్నెలంటే ..................................................,
వానలంటే ..................................................,
వెన్నెలకన్నా వానలకన్నా,
అమ్మముద్దులే ..................................



జవాబు: మాకిష్టం

## పిల్లలూ... ఇక్కడ వృత్తాల్లో ఉన్న ప్రశ్నలకు తగిన జవాబులు క్రింద ఉన్న ఖాళీల్లో పూరించండి!

### మీకు తెలుసా? యక్ష ప్రశ్నలు

1) మానవునికి అత్యంత సహాయకారి?
2) రూపమున్నా హృదయం లేనిది?
3) దేవలోకానికి దారి?
4) సుఖానికి ఆధారం?
5) లాభాల్లో గొప్పది?
6) సుఖాల్లో గొప్పది?
7) ధర్మాల్లో ఉత్తమమైనది?
8) మంచి మాటకారికి దొరికేది?
9) భూమికంటె భారమైనది?
10) ఆకాశం కంటె పొడవైనది?

**సమాధానాలు ఇక్కడ వ్రాయండి**

01) ..................................
02) ..................................
03) ..................................
04) ..................................
05) ..................................
06) ..................................
07) ..................................
08) ..................................
09) ..................................
10) ..................................



జవాబులు:
(1)ధైర్యం 2)రాయి 3)సత్యం 4)శీలం 5)ఆరోగ్యం 6)సంతోషం 7)అహింస 8)స్నేహం 9)తల్లి 10)తండ్రి)

చెట్టులో ఉన్న అక్షరాల్లో 'అ' నుండి 'అః'తో మొదలయ్యే పదాలున్నాయి. అవేంటో కనుక్కొని ప్రక్కఖాళీల్లో వ్రాయండి!




**సమాధానాలు ఇక్కడ వ్రాయండి**

01) ........................................
02) ........................................
03) ........................................
04) ........................................
05) ........................................
06) ........................................
07) ........................................
08) ........................................
09) ........................................
10) ........................................
11) ........................................
12) ........................................
13) ........................................
14) ........................................

జవాబులు: (1)అక్షతలు 2)ఆరోగ్యం 3)ఇష్టసఖి 4)ఈర్ష్య 5)ఉత్తరీయం 6)ఊల 7)ఋగ్వేదం 8)ఎలుగుబంటి 9)ఏకాంతం 10)ఒడ్డాణం 11)ఓంకారం 12)ఔదార్యం 13)అంకుశం 14)అహ నా పెళ్లంట!!)

## పొడుపుకథలు



1) మూతతెరిస్తే ముత్యాలపేరు? ఏంటది?
2) చిన్నపాపకు చాలా చీరలు? ఏమిటది?
3) మత్తుకాని మత్తు? ఏమిటది?
4) రెక్కలులేనిపిట్ట గూటికి సరిగా చేరింది? ఏంటది?
5) పెద్దఇంట్లో పొట్టివాణ్ణి, నిలబెడితే నిండా నేనే? ఏంటది?

జవాబు: (1)దంతాలు 2)ఉల్లిపాయ 3)గమ్మత్తు 4)ఉత్తరం 5)దీపం)

## ఏదిమేలు?

1) గడపలన్నిటిలోన ఏ గడప మేలు?
2) అరుగులన్నిటిలోన ఏ అరుగు మేలు?
3) వీధులన్నిటిలోన ఏ వీధి మేలు?
4) ఊరులన్నిటిలోన ఏ ఊరు మేలు?

జవాబులు: 1)మహాలక్ష్మి నర్తించు మా గడపమేలు!
2)అతిథులందరు చేరు మా అరుగుమేలు!
3)కొట్లాటలే లేని మా వీధి మేలు!
4)సిరులు సంపదలు తులతూగు మా ఊరే మేలు!

## రంగులు వేద్దాం..!!





పై చిత్రాన్ని చూసి రంగులు వేయండి






# విరాధుడు

- శ్రీమతి ఇ.పద్మాసని,
94902 74503

సీతారామలక్ష్మణులు దండకారణ్యం వెళ్తున్నారు. అది భయంకరారణ్యం. అనేక క్రూరజంతువులతో, కఠోరమైన కీచు రాళ్లరొదతో నిండి ఉంది.

ఇంతలో ఆ వనంలో పర్వతాకారుడైన ఒక రాక్షసుడు వారికి ఎదురయ్యాడు. అతిక్రూరుడు, భయంకరాకారుడు, భయంకరవేషధారణతో చూడగానే ఏవగింపు కలిగేలా ఉన్నాడు. వాడు రామలక్ష్మణులతో సీతమ్మను చూసి అత్యంత కృద్ధుడయ్యాడు. వాళ్లమీద విరుచుకుపడ్డాడు.

వారిని చంపుతానని బెదిరిస్తూ ఉన్మత్తప్రేలాపన చేశాడు. మీరెవరు? ఎక్కడికెళ్తున్నారు? అని అడిగాడు. అప్పుడు రాముడు ఇక్ష్వాకువంశాన్నిగురించి చెప్పాడు. మేము క్షత్రియులం. సచ్చరిత్రగలవారం. నీవనుకున్నట్లు అవినీతి పరులం కాదు. మేముకూడా నీగురించి తెలుసుకోవాలనుకుంటున్నాం చెప్పు మరి. అప్పటికి విరాధుడు కొంచెం శాంతించాడేమో అడిగినదానికి సవ్యంగానే బదులు చెప్పాడు.

నేను జయుడనే రాక్షసుని కుమారుడను. నా తల్లి శతహ్రద. నన్ను విరాధుడంటారు. నేను తపస్సుచేసి బ్రహ్మదేవుణ్ణి మెప్పించి వరం పొందాను. దానిప్రభావంతో శస్త్రాలేవీ నన్ను చంపలేవు. నా శరీరాన్నెవ్వరూ ఛేదించలేరు. ఆ చెప్పడంలోనే గర్వం, అహంకారమున్నాయి. నన్నెవ్వరూ ఏమీ చేయలేరనే ధీమా! రాక్షసులందరిస్థితి ఇదేకదా. మిడిసిపడడం చివరకు యమపురికి చేరడం. ఇక్కడా అదే. కాని కొంచెం భిన్నంగా జరిగింది.

విరాధుడి అహంకారం రామలక్ష్మణులకు బాగా కోపం తెప్పించింది. శరపరంపర కురిపించారు. కాని, వాడు వరదాన ప్రభావితుడు కదా! అందుకే అవి వాణ్ణేమీ చేయలేకపోయాయి. వాడు రామలక్ష్మణులను పట్టుకుని భుజాలమీద ఎక్కించుకుని పోసాగాడు. అప్పుడు రాముడు వాడి కుడిభుజం నరుకగా లక్ష్మణుడు ఎడమచేతిని ఖండించేశాడు. అపుడా రాక్షసుడు నేలకూలాడు. రామలక్ష్మణులు కాళ్లతో, చేతులతో ముష్టిఘాతాలు చేశారు. కాని, రాక్షసుడుమాత్రం చావలేదు. రాముడికపుడు గుర్తుకొచ్చింది వాడు తపస్సుచేసి వరాలు పొందాడని. అందుకే ఇలా అన్నాడు. లక్ష్మణా! శస్త్రాలతో చావడు. కాబట్టి వీణ్ణి భూమిలో పాతిపెడదాం. ఆ మాటలు వినగానే విరాధుడిమాయ వదిలింది. అంతే శ్రీరాముని గుర్తించి కీర్తించాడు. నేను తుంబురుడనే గంధర్వుడను. రంభయందాసక్తి కలిగిన నేను ఒకనాడు కుబేరునిసేవకు పోలేదు. ఆ కారణంగానే కుబేరుడు నన్ను శపించాడు. తర్వాత మళ్లీ నా వినతిపై శాపవిముక్తికూడా తెలిపాడు. దశరథపుత్రుడు రాముడే నిన్ను వధింపగలడన్నాడు. నా శాపవిమోచనమైంది. నన్ను గుంతలో పూడ్చిపెట్టి హాయిగా వెళ్లండి. మరణించిన రాక్షసులకిదే పరంపరగా వస్తున్న పద్ధతి. ఇలా పాతిపెట్టబడినవారు పుణ్యలోకాలకు పోతారు. ఆ తర్వాత శ్రీరాముడు పడిఉన్న విరాధుని కంఠంపై పాదంతో తొక్కాడు. లక్ష్మణుడు గోతి తవ్వాడు. ఆ తర్వాత ఆ రాక్షసుణ్ణి గొయ్యిలోకి నెట్టారు.

ఇందులో మరో నిజం దాగి ఉంది. రాముడు వనవాసిగా తనదగ్గరకు వచ్చినప్పుడు ఆయనచేతుల్లోనే మరణించాలన్నదే విరాధుని కోరిక. అందుకే తాను శస్త్రాలతో మరణించను అంటూ తన మృత్యురహస్యాన్ని రాముడికి వివరించాడు. ఇలాంటివాళ్లు విష్ణువుని శత్రువుగా భావిస్తారు. ఆయనకెంతో హాని తలపెడతారు. కాని, అంతర్గతంగా ఆయనచేతిమీదుగానే మరణించాలనుకుంటారు. మరణిస్తారు కూడా. ఎందుకంటే అదే కదా మోక్షం.


క్రోధి నామ సంవత్సర

ఉగాది శుభాకాంక్షలు

పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....

దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కరుణాకటాక్షవీక్షణాలు అందరిపై సదా ప్రసరించాలనీ మరియు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ స్వామివారిని ప్రార్థిస్తూ...

మీ.. ప్రధానసంపాదకుడు

# క్విజ్ 21

01) శ్రీరామమంత్రమే? జ)..........
02) 'ఉగ'కు అర్థం? జ)..........
03) జ్ఞానదేవత? జ)..........
04) 'ఒంటిమిట్ట'కు మరోపేరు? జ)..........
05) తాత్త్వికదృష్టికి ప్రతీక? జ)..........
06) 'వాయల్పాడు'కు మరోపేరు? జ)..........
07) సీతారాముల కల్యాణవేదిక? జ)..........
08) మనిషికి మధురానుభూతినిచ్చేది? జ)..........
09) కుటుంబజీవనానికి పునాది? జ)..........
10) సత్యమార్గమేది? జ)..........
11) శ్రీవేంకటేశ్వరుని భక్తాగ్రేసరుడు? జ)..........
12) బ్రహ్మోత్సవాల దోషపరిహారార్థసేవ? జ)..........
13) జయుడు, శతహ్రదుల కుమారుడు? జ)..........
14) విష్ణువు దశావతారాల్లో మొదటిది? జ)..........
15) ధర్మాల్లో గొప్పధర్మం? జ)..........
16) భూమీమ్మద ప్రతిఒక్కరూ ఆచరించాల్సిన మార్గం? జ)..........
17) వాస్తుదోషనివారణయంత్రరాజం? జ)..........
18) సత్యవ్రతుడు అర్ఘ్యమిస్తున్న నది? జ)..........
19) వేదాలను అపహరించిన రాక్షసుడు? జ)..........
20) విష్ణువు మత్స్యావతారంలో పూజలందుకున్న ఏకైక దేవాలయం? జ)..........

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-04-2024.
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........
పాఠశాల: .......... తరగతి: ..........
పేరు: ..........
చిరునామా: ..........
..........
..........
.......... పిన్‌కోడ్: ..........
ఫోన్ సంఖ్య: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

............................................................................ తేది : ..................

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 99



నిర్వహణ: శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)చైత్ర, వైశాఖమాసాల్లో ఏ ఋతువు?(6); 5)మరీచిపుత్రులు. రాక్షసులు(5); 6)జనకునితమ్ముడు(5); 7)కద్రువకుమారుడు(3); 8)బంగారుపర్వతం(3) 10)గంగాయమునా సంగమప్రదేశంలో ఉన్న ఆశ్రమం(6); 12)మేరువు కుమార్తె(2); 13)చైత్రశుద్ధపాడ్యమిన ఏ ఉగాది ప్రారంభమౌతోంది(2); 16)సర్వనామం(2); 19)మనిషికి పనికిరానిది(2); 20)'నాదావళి'వల్ల చాక్షుషమనువుకు జన్మించిన కుమారుడు(3); 21)బ్రహ్మపుత్రుడు, స్వాయంభువ మనువు మొదటిమనువు(4); 22)దక్షునికుమార్తెల్లో ఒకరు(2); 23)సర్వనామం(2)

### నిలువు

1)చైత్రకృష్ణ ఏకాదశికిగలపేరు(4); 2)పరీక్షిత్తును కాటేసిన సర్పం(4); 3)నీటి అడుగుభాగాన ఉన్న నరకం?(2); 4)హనుమంతునితండ్రి(5); 9)రావిచెట్టు మరియొకపేరు(3); 10)ఇది ఒకనక్షత్రం(3); 11)శ్రీకృష్ణుని నివాసం(3); 13)కశ్యపప్రజాపతికి 'కాల' వల్ల జన్మించిన రాక్షసుడు(5); 14)బంగారం(3); 15)తెలుగుసంవత్సరాలలో ఒకటి(2); 17)ఫాల్గుణ మాసానికి మరియొకపేరు(3); 18)చైత్రశుద్ధఏకాదశికి మరియొకపేరు(3)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

\- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

## తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి వసంతోత్సవం
(21-04-2024నుండి 23-04-2024వరకు)





## శ్రీనివాసమంగాపురం,
## శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారి పుష్పయాగమహోత్సవం
(04-04-2024)




SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-03-2024 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2024-2026 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" posting on 5th of Every Month.



తిరుమల
శ్రీవారి శ్రీరామనవమి
ఆస్థాన మహోత్సవం
(17-04-2024)